
శతారుణ గీతాంజలి
రూ॥180/-
పేజీలు:180



నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★



ఆఫ్ఘనిస్థాన్ ఆసుపత్రిపై పాకిస్థాన్ దాడి 02
కాబూల్‌లో 400 మంది మృతి

సంపుటి 09, సంచిక: 108 | బుధవారం | 18-03-2026 | కరీంనగర్ Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## బిసి రిజర్వేషన్లపై నాన్చుడొద్దు



శాసన మండలిలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో కేంద్ర ప్రభుత్వ వైఖరిపై సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మండిపాటు

- బిసిలు అన్నిరంగాల్లో నష్టపోతున్నారని, వివక్షకు గురవుతున్నారని ఆందోళన
- ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్
- రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలుచేయాలని విజ్ఞప్తి

ప్రజాపక్షం/హైదరాబాద్

బిసిలు అన్ని రంగాలలో నష్టపోతున్నారని, తీవ్రమైన వివక్షకు గురవుతున్నారని సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం ఆవేదన వ్యక్తం చేశారు. శాసనమండలిలో మంగళవారం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చలో సత్యం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిసి రిజర్వేషన్‌ల విషయంలో కేంద్ర ప్రభుత్వం నాన్చుడు ధోరణితో రిజర్వేషన్‌ల అంశం ముందుకు కొనసాగడం లేదన్నారు. ఫలితంగా జనాభాలో 52 శాతం ఉన్న బిసిలకు రిజర్వేషన్‌లు అమలు కాకపోవడంతో అన్ని రంగాలలో వెనకబడిపోతున్నారని తెలిపారు. బిసిల రిజర్వేషన్‌ల విషయంలో కేంద్ర ప్రభుత్వం తర్వతిగతిన నిర్ణయం తీసుకుని, బిసి రిజర్వేషన్‌లు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

**ఆర్‌టిసి కార్మికులకు తీవ్ర అన్యాయం**

కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయాలని నెల్లికంటి సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయంలో ఆర్‌టిసి కార్మికులు తీవ్ర అన్యాయానికి గురయ్యారని, అప్పట్లో 59 రోజుల పాటు సమ్మె జరిపారని సత్యం గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీనిచ్చిందని, ఆ హామీని ఎన్నికల మేనిఫెస్టోలో కూడా పొందుపర్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర ఏళ్లు గడుస్తున్నప్పటికీ ఆర్‌టిసి కార్మికుల సమస్యలు పరిష్కారం కాలేదని తరువాయి 2లో

## వడ్డీ లేని రుణాలు ఇచ్చినట్లు నిరూపిస్తే రాజీనామా చేస్తా

### ప్రభుత్వానికి కెటిఆర్ సవాల్
### రూ.57వేల కోట్లు జమచేశాం : భట్టి



- గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో వాదోపవాదాలు

ప్రజాపక్షం/హైదరాబాద్



రాష్ట్రంలో ఇప్పటి వరకు వడ్డీ లేని రుణాల కింద రూ.57 వేల కోట్లను మహిళల ఖాతాలలో జమ చేశామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన వడ్డీ లేని రుణాలను తాము క్లియర్ చేస్తున్నామని, ఐదేళ్లలో లక్ష కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాల లక్ష్యాన్ని పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఉభయ సభలను ఉద్దేశించి 'గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు' తెలిపే తీర్మానంపై మంగళవారం శాసనసభలో జరిగిన చర్చలో బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎ కె.టి.రామారావు వడ్డీ లేని రుణాల అంశాన్ని ప్రస్తావించారు. మహిళలకు రూ.57 వేల కోట్ల వడ్డీలేని రుణాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చినట్టు ఉత్తర్వులు చూపిస్తే తాను రాజీనామా చేసి ఇక్కడి (అసెంబ్లీ) నుంచే వెళ్లిపోతానని, వడ్డీ లేని రుణాలు ఇవ్వకపోతే డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. వడ్డీ లేని రుణాల పెండింగ్ నిధులను చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. దీనిపై భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ధనసరి అనసూయ సీతక్క స్పందించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ 'మీరు'(బిఆర్‌ఎస్) ఎన్ని అడ్డంకులను సృష్టించినా వడ్డీ లేని రుణాలు ఇచ్చి తీరుతామన్నారు. రైతుల శ్రమను గుర్తించి సన్న ధాన్యం పండించిన రైతులకు క్వింటాకు రూ.500 చొప్పున బోనస్‌ను రైతుల ఖాతాలలో వేస్తున్నామని, రైతు భరోసా కింద తొమ్మిది రోజుల్లో రూ.9 వేల కోట్ల నిధులను వారి ఖాతాలలో జమ చేశామన్నారు. వడ్డీ లేని రుణాల కింద స్వయం సహాయక సంఘాల మహిళలకు సంవత్సరానికి రూ.20 వేల కోట్లకు పైగా వారి ఖాతాల్లో తరువాయి 2లో

సిఎం సంతకం చేసిన ఆ ఆరు గ్యారంటీల దస్త్రం 03 ఎటుపోయింది?



మొయినాబాద్ డ్రగ్స్ కేసులో

## సిట్ ఏర్పాటు

- తొమ్మిది మంది పోలీసు అధికారులతో రూపకల్పన
- నేతృత్వం వహించనున్న చేవెళ్ల డిసిపి యోగేశ్‌గౌతమ్

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన మొయినాబాద్ ఫామ్‌హౌస్ డ్రగ్స్ కేసులో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కేసు తీవ్రత దృష్ట్యా ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేసింది. మొత్తం 9 మంది పోలీసు అధికారులతో ఈ సిట్‌ను రూపొందించగా, చేవెళ్ల డిసిపి యోగేష్ గౌతమ్ నేతృత్వం అప్పగించారు.ఈ కేసులో డ్రగ్స్ వినియోగం, గన్ ఫైరింగ్, ప్రముఖుల ప్రమేయం వంటి ఆరోపణలు వెలుగులోకి రావడంతో ప్రభుత్వం దర్యాప్తును మరింత లోతుగా తీసుకెళ్లాలని నిర్ణయించింది. డ్రగ్స్ సరఫరా మార్గాలు, పార్టీలో పాల్గొన్నవారి పాత్ర, అంతర్జాతీయ లింకులు ఉన్నాయా అన్న అంశాలపై సిట్ ప్రత్యేకంగా దృష్టి సారించనుంది. ఇప్పటికే కేసులో ప్రధాన నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కొందరికి నిర్వహించిన డ్రగ్స్ పరీక్షల్లో పాజిటివ్ వచ్చినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో కేసు రాజకీయ వర్గాల్లో కూడా చర్చనీయాంశంగా మారింది. నిష్పక్షపాతంగా, వేగవంతంగా దర్యాప్తు జరిపేందుకు సిట్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం వెలుగులోకి తరువాయి 12లో

## బిఆర్‌ఎస్ ఎన్నోసార్లు ఢిల్లీ వెళ్లలేదా?



- రాష్ట్ర ప్రయోజనాలు, నిధుల కోసం ఎన్ని సార్లైనా ఢిల్లీకి వెళ్తాం : మంత్రి శ్రీధర్‌బాబు
- తెలంగాణ సొమ్ముతో ఢిల్లీ పర్యటనలా? : కెటిఆర్

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో అధికారాన్ని కాపాడుకునేందుకు పదేళ్ల కాలంలో ప్రాంతీయ పార్టీ బిఆర్‌ఎస్ ఎన్నో సార్లు ఢిల్లీకి వెళ్లలేదా అని రాష్ట్ర పరిశ్రమలు, ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రశ్నించారు. రాష్ట్రానికి ప్రయోజనం కలిగే అంశంలో తాము ఎన్ని సార్లైనా ఢిల్లీకి వెళ్ళి ప్రధానిని, కేంద్ర మంత్రులను కలుస్తామన్నారు. శాసనసభ, శాసనమండలి ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై మంగళవారం శాసనసభలో జరిగిన చర్చలో బిఆర్‌ఎస్ తరువాయి 12లో

## డ్రగ్స్ పరీక్షకు సిఎం సిద్ధం



- కెటిఆర్ కూడా ముందుకు రావాలి
- శాసనమండలిలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ సవాల్

ప్రజాపక్షం/హైదరాబాద్

గోదావరి జలాలను వినియోగంలోకి తెచ్చేందుకు పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును వేగంగా పూర్తి చేస్తామని కాంగ్రెస్ ఎంఎల్‌సి బి.మహేష్‌కుమార్ గౌడ్ చెప్పారు. మూసీ పునరుజ్జీవం రాష్ట్ర అభివృద్ధికి కీలకమని, ప్రభుత్వం ప్రజా సంక్షేమం, సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తోందని, వచ్చే ఎన్నికల్లో 100 సీట్లతో మళ్లీ అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. డ్రగ్స్ పరీక్షలకు సిఎం రేవంత్ రెడ్డి సిద్ధమని, కెటిఆర్ కూడా డ్రగ్స్ పరీక్షలకు ముందుకు రావాలని ఆయన తరువాయి 12లో

రాజకీయాలకు, చట్టసభలకు వన్నెతెచ్చిన ఓంకార్ జీవితం చిరస్మరణీయం 03



8 మంది లోక్‌సభ ఎంపిలపై

## సస్పెన్షన్ ఎత్తివేత

**న్యూఢిల్లీ :** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల మెదటి సెషన్‌లో సస్పెన్షన్‌కు గురైన 8 మంది ఎంపిలపై సస్పెన్షన్ ఎత్తివేశారు. అనుచిత ప్రవర్తన కారణంగా వీరిని ఫిబ్రవరి 3న 8 మంది ఎంపిలపై స్పీకర్ ఓంబిర్లా సస్పెన్షన్ వేటు వేశారు. అయితే మంగళవారం ఎత్తివేశారు. ఇది తక్షణమే అమలో అమల్లోకి వస్తుందన్నారు. ఈ సందర్భంగా సభ లోపల లేదా పార్లమెంట్ ప్రాంగణంలో ఎలాంటి ప్లకార్డులు, పోస్టర్లు, ఫోటోలు లేదా ఎఐ రూపొందించిన చిత్రాలను ప్రదర్శించకూడదని సూచించారు. సభలో జరిగిన ఘటన విచారకరమని, సభ సజావుగా పనిచేయడానికి తమ పార్టీ సహకరించడానికి సిద్ధంగా ఉందని పేర్కొంటూ, ఎనిమిది మంది ప్రతిపక్ష సభ్యుల సస్పెన్షన్‌ను తొలగించడాన్ని పరిశీలించాలని కాంగ్రెస్ సభ్యుడు కె. సురేష్ సభను అభ్యర్థించారు. పలువురు ప్రతిపక్ష సభ్యులు చేసిన విజ్ఞప్తుల అనంతరం, సభ సజావుగా పనిచేయడానికి 'లక్ష్మణ రేఖ' గీయాల్సిన అవసరం ఉందని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి తరువాయి 12లో



## బిజెపి కోసం ఇసి ఆటాడుతోంది

- ఈద్‌కు ముందు అధికారులను ఎందుకు బదిలీ చేస్తున్నారు ?
- ఎన్నికల సంఘంపై మమతా బెనర్జీ మండిపాటు
- 291 స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించిన టిఎంసి అధినేత్రి

**కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, టిఎంసి అధినేత్రి మమతా బెనర్జీ మంగళవారం ఎన్నికల సంఘంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. బిజెపి ఆదేశాల మేరకు అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రభుత్వ యంత్రాంగంలో సీనియర్లను, పోలీసు అధికారులను బదిలీ చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ఏదైనా అవాంఛనీయ ఘటన జరిగితే దానికి ఎన్నికల సంఘం, కాషాయ పార్టీయే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆమె హెచ్చరించారు. అసెంబ్లీ ఎన్నికల నిమిత్తం మంగళవాం తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థుల జాబితా ప్రకటించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాటారు. 'ఈద్ పండుగకు కొద్ది రోజుల ముందు సీనియర్ అధికారులను ఎందుకు బదిలీ చేస్తున్నారు? ఎన్నికలకు ముందు అల్లర్లు సృష్టించే ప్రణాళికలు ఏమైనా ఉన్నాయా?' అని ప్రశ్నించారు. బదిలీ అయిన అధికారుల జాబితాను బిజెపి కార్యాలయంలో సిద్ధం చేశారని, ఆ నిర్ణయాన్ని ఎన్నికల సంఘం కేవలం అమలు చేసిందని ముఖ్యమంత్రి ఆరోపించారు. ఎన్నికల ప్రక్రియలో బిజెపికి సహాయపడటానికి పశ్చిమ బెంగాల్ వెలుపల నుండి కొంతమంది అధికారులను తీసుకువచ్చారని కూడా ఆమె ఆరోపించారు. రాజకీయ ఒత్తిడికి లోనై ఎన్నికల సంఘం వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ, బిజెపి తరఫున ఇసి ఒక ఆట ఆడుతోందని టిఎంసి అధినేత్రి మండిపడ్డారు. 'వారు నేరుగా తరువాయి 2లో

సంజయ్ కుమార్ వల్లే

## పార్టీ మార్పు యోచన



ఫిరాయింపు ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పార్టీకి దూరంగా పెట్టాలి : మాజీమంత్రి జీవన్ రెడ్డి

ప్రజాపక్షం/జగిత్యాల

బిఆర్‌ఎస్‌తో గెలిచి కాంగ్రెస్ పార్టీతో కలిసి పనిచేస్తున్న ఫిరాయింపు ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పార్టీ అంతర్గత వ్యవహారాలకు దూరంగా పెట్టాలని మాజీ మంత్రి జీవన్ రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ మారాలని ఆలోచించేందుకు ప్రధాన కారణం సంజయ్ కుమార్ అని ఆరోపించారు. తాను ఇంకా కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నట్లు జీవన్ రెడ్డి స్పష్టం చేశారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో మంగళవారం జీవన్ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తరువాయి 12లో

ఇరాన్ నేషనల్ సెక్యూరిటీ చీఫ్

## లారిజానీ హతం

### బాసిజ్ దళ కమాండర్ సులేమానీ కూడా..




**టెహ్రాన్:** ఇరాన్‌లో ఐ.డి.ఎఫ్ చేస్తున్న యుద్ధంలో 18వ రోజు మంగళవారం ఇద్దరు కీలక ప్రముఖులు మరణించారు. ఇరాన్ రాజకీయ నాయకుడు, అలీ ఖమేనీకి విశ్వసనీయమైన ప్రతినిధులలో ఒకరు, సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటరీ అలీ లారిజానీ లక్ష్యంగా ఐ.డి.ఎఫ్ దాడులు చేసింది. లారిజానీతో పాటు ఇరాన్‌కు చెందిన కీలకమైన బాసిజ్ పారామిలిటరీ ఫోర్స్ కమాండర్ ఘోలం రెజా సులేమానీ కూడా మరో దాడిలో మరణించినట్లు ఇజ్రాయెల్ రక్షణ దళం (ఐ.డి.ఎఫ్) మంగళవారం ప్రకటించింది. ఆయనతోపాటు బాసిజ్ డిప్యూటీ కమాండర్, ఇతర ఉన్నతాధికారులు కూడా మరణించారని ఐడిఎఫ్ పేర్కొంది. లారిజానీ మరణించారా? లేదా? అనే విషయంపై ఇజ్రాయెల్‌కు తరువాయి 2లో

బాగ్దాద్‌లో అమెరికా దౌత్యకార్యాలయంపై

## ఇరాన్ క్షిపణి దాడి

- వైమానికస్థావరాలు, మౌలిక సదుపాయాల ధ్వంసం
- యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఫ్యుజైరాహ్ చమురు నిల్వకేంద్రం ధ్వంసం
- హెజ్బొల్లా దాడుల్లో ఇజ్రాయెల్ నహరియా పట్టణం ధ్వంసం
- టెహ్రాన్, షిరాజ్‌లలో అమెరికా- ఐడిఎఫ్ విధ్వంసం



**దుబాయ్:** దుబాయ్‌లో పేలుళ్ళు, ఖతార్‌లో ఇరాన్ డ్రోన్ల అడ్డగింత, సౌదీఅరేబియాలో ఇరాన్ దాడులతో పశ్చిమాసియా అట్టుడికింది. 18వ రోజు మంగళవారం పశ్చిమాసియాలో ఇరాన్ చేసిన ఏకపక్ష దాడులతో ప్రపంచవ్యాప్తంగా చమురు,గ్యాస్ సంక్షోభం మరింత విస్తరించింది. గల్ఫ్ దేశాలపై దాడులు కొనసాగిస్తోంది. బాగ్దాద్‌లో అమెరికా దౌత్యకార్యాలయంపై మళ్ళీ క్షిపణి దాడులు చేయడంతో ఆ కార్యాలయంలో మంటలు ఎగసిపడ్డాయి. గ్రీన్‌జోన్‌లో ఉన్న రోయా తులిప్ అల్–రషీద్ హోటల్‌పై డ్రోన్ దాడులు చేసింది. బాగ్దాద్‌లో ఒక ఇంటిపై జరిగిన డ్రోన్ దాడిలో నలుగురు మరణించారు. ముఖ్యంగా చమురు ఎగుమతులు సులభంగా చేయడానికి వీలుగా హోర్ముజ్ సమీపంలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఏర్పాటు చేసుకున్న ''ఫ్యుజైరాహ్ చమురు నిల్వకేంద్రం''పై ఇరాన్ క్షిపణి దాడులు చేసింది.ఒక ఆయిల్ ట్యాంకర్‌ను గుర్తు తెలియని ప్రొజెక్టైల్స్ ధ్వంసం చేశాయి. దీంతో ఆ ప్రాంతంలో మంటలు తరువాయి 2లో

# నవంబరు ఎన్నికల్లో ట్రంప్‌కు ఘోర పరాభవమే!

**అమెరికాలో ధరలమంట :
ప్రజల అసంతృప్తి
నిరాశ– మానసిక ఒత్తిడికి
గురవుతున్న ట్రంప్
రిపబ్లికన్లలో భయాందోళన**



**వాషింగ్టన్ :** పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభమైన తర్వాత అమెరికాలో గడ్డు పరిస్థితులు మొదలయ్యాయి. చమురు ధరలు, గ్యాస్ ధరలు, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోవడం ప్రారంభమైంది. అధికార రిపబ్లికన్లకు చమురు దెబ్బ గట్టిగా తగలడంతో సంబంధిత ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులలో తీవ్ర భయాందోళనలు మొదలయ్యాయి. ఈ ఏడాది చివర నవంబరులో జరిగే కీలకమైన ద్వైవార్షిక మధ్యంతర ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో ట్రంప్ పరిపాలనకు తీవ్ర ఆటంకాలు ఎదురవుతున్నాయని రిపబ్లికన్లు ఆందోళన చెందుతున్నారు. అమెరికాలో ఆహార వస్తువుల ధరలు 92 శాతం మేరకు పెరిగాయి. గ్యాస్ ధరలు 68శాతం ఉండగా, ఇక స్టాక్ మార్కెట్ కూడా 58 శాతం మేరకు పతమవుతున్నది. పెరుగుతున్న ధరలు రిపబ్లికన్ నాయకులకు దిగ్భ్రాంతి కలిగిస్తున్నాయి. ఇక అమెరికా రైతులు కూడా చమురు సంక్షోభం, ఎరువుల సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నారు. ప్రజల్లో కొద్దికాలంగా పెరుగుతున్న అసంతృప్తి ఈ యుద్ధ సమయంలో ధరల పెరుగుదల కారణంగా పరాకాష్టకు చేరింది. ద్వైవార్షిక ఎన్నికలు ట్రంప్ ప్రభుత్వానికి ఎంతో కీలకమైనవి. ఈ ఎన్నికల్లో ట్రంప్ పరాజయం పాలైతే ఇక అధికారం ముగిసినట్లుగా మిగిలిన పాలనాకాలమంతా ట్రంప్ ప్రభుత్వం ప్రతిపక్ష డెమొక్రాట్ల అధిపత్యంవల్ల నరకయాతన భరించాల్సి వస్తుందని రిపబ్లికన్లు భయపడుతున్నారు. ఇప్పటికే అమెరికాలో చమురు ధరలు బ్యారెల్‌కు 100 డాలర్లకు చేరే ప్రమాదం ముందు కుదిపింది. రైతులను బుజ్జగించేందుకు ట్రంప్ ఇప్పటికే అనేక చర్యలు తీసుకున్నారు. వెనిజులా నుండి ఎరువులు దిగుమతిచేసుకునేందుకు ఒక ఒప్పందం చేసుకున్నారు. అమెరికా దిగువసభ హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్‌లో ఉన్న 435 స్థానాలకు ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి ఎన్నికలు జరుగుతాయి. సభ్యుడి పదవీకాలం రెండు సంవత్సరాలు. అదేవిధంగా ఎగువసభ సెనేట్‌లో కూడా మొత్తం 100 స్థానాలకుగాను 33 లేదా 34 స్థానాలకు ఎన్నికలు జరుగుతాయి. ఈ ఎన్నికల్లో పరాజయం పాలైతే డెమొక్రాట్లు ఉభయసభల్లో ఆధిపత్యం సాధిస్తే దేశాధ్యక్షుడిగా ట్రంప్ తీవ్ర ఆగచాట్లు పడాల్సి వస్తుంది. ట్రంప్ సోమవారం రాత్రి నిర్వహించిన పత్రికా గోష్ఠిపై అమెరికా మీడియా భిన్న వ్యాఖ్యలు చేస్తోంది. పశ్చిమాసియాలో ఇప్పటికే యుద్ధం సర్వసైన్యాధ్యక్షుడి హోదాలో ఉన్న ట్రంప్ అదుపుతప్పే పరిస్థితులు కనిపిస్తున్నప్పటికీ, ఆయన గుంభనంగా వ్యవహరిస్తున్నారని, తదుపరి మూడేళ్ళ పదవీకాలాన్ని నిర్దేశించగల నిర్ణయాలను ఆ దేశంలో ఎదుర్కొంటున్నారని పత్రికలు పేర్కొన్నాయి. హోర్ముజ్ నియంత్రణకు మిత్రదేశాలు కలిసిరాకపోవడంతో, ట్రంప్ తన మానసిక ఆందోళన కప్పిపుచ్చుకోవడానికి పత్రికాగోష్ఠిలో కెన్నెడీ సెంటర్ పునరుద్ధరణ పనులు, వైట్‌హౌస్‌లో బాల్‌రూమ్ నిర్మాణ పనులు సహా తక్షణ సంబంధం లేని అనేక ఇతర విషయాలు మాట్లాడారని మీడియా పేర్కొంది. ఒత్తిడి తగ్గించుకోవడానికి ఆయన తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని, గతవారం ఆయన గోల్ఫ్ ఆడారని, ఇరాన్ యుద్ధం గురించి ఎంతసేపు మాట్లాడారో అంతే సమయం సుప్రీం కోర్టుపై విమర్శలు చేయడానికి కేటాయించారని పత్రికలు పేర్కొన్నాయి. ఆయన ప్రస్తుత ఉద్రిక్తతలకు సంబంధం లేని విషయాలు మాట్లాడేందుకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపాయి.

# ఆఫ్ఘాన్ ఆసుపత్రిపై పాకిస్థాన్ దాడి

## కాబూల్‌లో 400మంది మృతి



**కాబూల్ :** ఆఫ్ఘానిస్థాన్ రాజధాని కాబూల్‌లో ఒక ఆసుపత్రిపై పాకిస్థాన్ దళాలు గగనతల దాడి చేయడంతో ఆసుపత్రి ధ్వంసమైంది. దీంతో దాదాపు 400 మంది పైగా మరణించారు. 2000 పడకలకు పైగా ఉన్న ఈ ఆసుపత్రి నిత్యం రద్దీగా ఉంటుంది. ఆసుపత్రిపై దాడి వార్త తెలిసిన వెంటనే బంధువులు ఆర్తనాదాలు చేస్తూ అక్కడికి చేరుకున్నారు. విషణ్ణ వదనాలతో శిథిలాలమధ్య తమ బంధువులకోసం వెతుకులాడుతున్న చిత్రాలను ఆఫ్ఘానిస్థాన్ పత్రికలు ప్రముఖంగా ప్రచురించాయి. ఈ ఘటనపై అఫ్ఘానిస్థాన్ ప్రభుత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయగా, ఈ దాడితో తమకు సంబంధం లేదని, తాము దాడి చేయలేదని పాకిస్థాన్ వాదించడం ప్రారంభించింది. పాకిస్థాన్ దాడులకు ప్రతీకారం తీర్చుకుంటామని, ఇంతకింత తీవ్రంగా స్పందిస్తామన ప్రభుత్వ అధికార ప్రతినిధి జబిహుల్లా ముజాహిద్ హెచ్చరించారు. మంగళవారం తెల్లారకముందే పాకిస్థాన్ సైనిక దళాలు అఫ్ఘానిస్థాన్ తాలిబన్ స్థావరాలపై దాడులు చేశాయి. తాము బాలిబన్‌ల ఆశ్రయం పొందిన ఉగ్రవాద స్థావరాలపైమాత్రమే దాడులు చేశామని, ఆసుపత్రి జోలికి వెళ్ళలేదని పాకిస్థాన్ సైనికదళం బుకాయించింది. ఐతే మరోవైపు అఫ్ఘానిస్థాన్‌లోని తాలిబన్ నాయకత్వానగల ప్రజభుత్వంలో డిప్యూటీ స్పోక్స్ పర్సన్ హందుల్లా ఫిత్రాత్ ఒక ప్రకటన చేస్తూ, సోమవారం రాత్రి పొద్దుపోయాక పాకిస్థాన్ సైనికులు రాజధాని కాబూల్‌లోని డ్రగ్ రీహేబిలిటేషన్ సెంటర్ లక్ష్యంగా గగనతల దాడులు చేశారని ఈ దాడుల్లో 400మంది మరణించారు, మరో 250మంది గాయపడ్డారని చెప్పారు. ఆసుపత్రిలోని విస్తారమైన ప్రాంతం, భవంతులు ధ్వంసమయ్యాయని ఎక్స్ వేదికగా చెప్పారు.

'టిఓఎల్ న్యూస్ విభాగం మంగళవారం అఫ్ఘానిస్థాన్ ఆరోగ్యశాఖాధికారులను ఉటంకిస్తూ, ధ్వంసమైన శిథిలాల నుండి ఇప్పటివరకూ 50కి పైగా మృతదేహాలను వెలికితీశారని పేర్కొంది. పాకిస్థాన్ గగనతల దాడులు జరిగిన సమయంలో 3000 మంది రోగులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని పేర్కొంది. దేశీయాంగ సహాయమంత్రి ముహ్మద్ నబీ ఒమరి ఘటనాస్థలాన్ని సందర్శించారు. ఫిబ్రవరి 26వ తేదీ నుండి పాకిస్థాన్ ఆర్మీ భారీ ఎత్తున సరిహద్దుల్లో ఉన్న అఫ్ఘానిస్థాన్ ప్రాంతాలపై ''ఆపరేషన్ ఘజాబ్ లిల్ హక్'' దాడులు ప్రారంభించింది. అప్పటి నుండీ అడపాదడపా ఈ దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. అఫ్ఘానిస్థాన్‌తో పాకిస్థాన్‌కు ఉన్న 2,600కి.మీ సుదీర్ఘమైన సరిహద్దు ప్రాంతాలలో గాలింపు చర్యలు కొనసాగిస్తున్నట్లు పాకిస్థాన్ సమాచార ప్రసారాల మంత్రిత్వశాఖ ఒక ప్రకటనలో తెలియజేసింది. ఆపరేషన్ ఘజాబ్ లిక్ హక్ పేరుతో మార్చి 16వ తేదీ రాత్రి ఎంతో విజయవంతంగా అఫ్ఘానిస్థాన్ భూభాగంలో దాడులు చేసి ఉగ్రవాదులను మట్టుపెట్టామని సమాచార మంత్రి అత్తాయుల్లా తరార్ ఎక్స్ వేదికగా ప్రకటించారు. కాబూల్, నన్‌గర్హార్ ప్రాంతాలలో అఫ్ఘానిస్థాన్ సైన్యమే ఉగ్రవాదులకు ఆశ్రయం ఇస్తోందని, ఆ కేంద్రాలను ధ్వంసం చేశామని ఆయన చెప్పారు.

## ట్రంప్ చైనా పర్యటన వాయిదా

**వాషింగ్టన్ :** నిర్ణీత ప్రకారం ట్రంప్ తలపెట్టిన చైనా పర్యటన వాయిదా పడింది. మార్చి 31 నుండి ఏప్రిల్ రెండో తేదీ వరకు ట్రంప్ చైనాలో పర్యటించేందుకు తాత్కాలికంగా షెడ్యూలు ఖరారైంది. ఈ షెడ్యూలును చైనా ప్రభుత్వం అధికారికంగా ధృవీకరించకపోయినాగానీ అందుకు తగ్గట్టుగా సన్నాహాలు చేస్తున్న తరుణంలో ట్రంప్ స్వయంగా ఈ ప్రకటన చేశారు. ''పశ్చిమాసియాలో యుద్ధం జరుగుతోంది, పరిణామాలు మారుతున్నాయి, నేను 'ఇక్కడ' (వైట్‌హౌస్) ఉండాల్సిన అవసరం ఉంది, అందువల్ల దాదాపు నెలరోజులపాటు నా చైనా ప్రయాణం వాయిదా పడవచ్చు'' అని ట్రంప్ ప్రకటించారు.

# నైజీరియాలో ఆత్మాహుతి దాడులు

## 23 మంది మృతి




**మైదుగిరి :** పశ్చిమ ఆఫ్రికాదేశం ఫెడరల్ రిపబ్లిక్ ఆఫ్ నైజీరియా చాలాకాలం విరామం తర్వాత ఒక్కసారిగా ఆత్మాహుతి బాంబుదాడులతో అల్లకల్లోలమైంది. ఈ దాడుల్లో 23 మంది మరణించారు. మరో 100 మంది గాయపడ్డారు. మైదుగురి శివార్లలో ఉగ్రవాదులు చేసిన దాడులను సైన్యం తిప్పికొట్టిన ఇరవైనాలుగు గంటల వ్యవధిలోనే ఈ ఆత్మాహుతి బాంబు దాడులు జరిగాయి. ఈశాన్య నైజీరియాలోని బోర్నో రాష్ట్రం మైదుగురి నగరాన్ని లక్ష్యలంగా చేసుకుని సోమవారం రాత్రి ఈ బాంబుదాడులు జరిగాయని పోలీసులు మంగళవారం చెప్పారు. సంఘర్షణలో మునిగితేలుతున్న నైజీరియాలో ఇటీవలి చరిత్రలో అత్యంత ఘోరమైన దాడి ఇదే. మైదుగురిలో రాత్రి అనేకసార్లు పేలుడు శబ్దాలు వినిపించాయని స్థానిక నివాసితులు చెప్పారు. మైదుగురి యూనివర్సిటీ టీచింగ్ ఆసుపత్రి ప్రవేశమార్గంలో ఉన్న మార్కెట్ వద్ద ప్రాంతం పేలుడు శబ్దాలతో దద్దరిల్లింది. ఈ దాడులకు తామే కారణమని ఇప్పటివరకూ ఏ ఉగ్రవాద సంస్థా ముందుకువచ్చి ప్రకటన చేయలేదని బోర్నో పోలీసు అధికార ప్రతినిధి నహమ్ కెన్నెత్ చెప్పారు. ఈ ప్రాంతంలో బోకోహార్మ్ ఉగ్రవాదులు ఎంతో క్రియాశీలంగా పనిచేస్తున్నారు. వీరు వేలాదిమంది అనేక గ్రూపులుగా అనేక ప్రాంతాలలో ఉన్నారు. ఇస్లామిక్ స్టేట్ వెస్ట్ ఆఫ్రికా ప్రావిన్స్ సాధనకోసం ఈ ఉగ్రవాదులు పనిచేస్తున్నారు. మైదుగురి నగరం చాలాకాలంగా తీవ్ర హింసాత్మక ఘటనకు కేంద్రంగా ఉంది. కానీ ఇటీవలికాలంలో ఈ నగరం దాడులు లేకుండా ప్రశాంతంగా ఉన్న తరుణంలో మళ్ళీ ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి.

# టర్కీ పురావస్తు తవ్వకాల్లో బయటపడిన 1400 ఏళ్ళనాటి చర్చి



**టర్కీ :** ఈజిప్టులో జరిపిన తవ్వకాల్లో 1400 ఏళ్ళ క్రితంనాటి క్రైస్తవ ప్రార్థనా మందిరం అవశేషాలు బయటపడ్డాయి. బెన్ గురియన్ విశ్వవిద్యాలయం ఈ ప్రకటన చేసింది. ఈజిప్టును ఆనుకుని ఉన్న ఈ ప్రాంతాన్ని ''నెస్సానా'' అని కూడా పిలుస్తారు. ఈ ప్రాంతంలో ఇప్పటికే ఐదు పురాతన క్రైస్తవ ప్రార్థనా మందిరాలను వెలికితీయగా, ఇది తాజాగా బయట పడిన ఆరో ప్రార్థనా మందిరం. బైజాంటైన్ కాలంలో పవిత్ర భూమి నుండి సినాయ్‌లోని సెయింట్ కేథరిన్ మఠానికి వెళ్ళే మార్గంలో యాత్రికులకు ఈ చర్చిలు, విరామ కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడేవని బెన్ గురియన్ విశ్వవిద్యాలయం పురావస్తు విభాగం ప్రొఫెసర్ యానా ఛెఖానెట్స్ చెప్పారు. నాలుగు సంవత్సరాలక్రితం ఇక్కడకు వచ్చి తమ బృందం తొలి క్రైస్తవ యాత్రికుల సాంస్కృతిక చిహ్నాల అన్వేషణ ప్రారంభించిందని ఆయన చెప్పారు. నిట్జానా అనేక కీలక ప్రదేశం క్రైస్తవ యాత్రికులకు ఒక కీలక రవాణా కేంద్రంగా పనిచేసిందని ఆయన చెప్పారు. ఎడారి మార్గంలో ఇదే చిట్ట చివరి మజిలీగా యాత్రికులకు ఈ ప్రాంతం ఉపయోగపడిందని చెప్పారు.

## ఇరాన్ క్షిపణి దాడి

(మొదటి పేజీ తరువాయి)

ఎగసిపడుతున్నాయి. దుబాయ్ విమానాశ్రయంపై మళ్ళీ దాడులు జరిగాయి. ఖతార్‌లోని దోహా నగరం పేలుళ్ళతో దద్దరిల్లింది. నిబంధనలు ఉల్లంఘించి ఇరాన్ మితిమీరిన దాడులు చేస్తోందని ఖతార్ ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది.

లెబనాన్ భూభాగం నుండి ఉత్తర ఇజ్రాయెల్ నహరియా పట్టణంపై హెజ్బొల్లా దళాలు రాకెట్ దాడులు చేయడంతో ఆ పట్టణంలో అనేక ప్రాంతాలు ధ్వంసమయ్యాయి. పది మంది విదేశీ గూఢచారులను అరెస్టు చేశామని వారికి కఠిన శిక్షలు తప్పవని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ ప్రకటించింది. అమెరికాతో కాల్పుల విరమణను తాము ఎప్పటికీ కోరుకోబోమని స్పష్టం చేసింది.

అమెరికా–ఇజ్రాయెల్ ఇరాన్ నగరాల్లో విధ్వంసం సృష్టిస్తున్నాయి. ఇరాన్ సైనిక స్థావరాలపై అమెరికా దాడులు చేసింది. మరోవైపు లెబనాన్‌లో కూడా ఇజ్రాయెల్ దళాలు హింసాకాండను విస్తరించాయి. ఎర్రసముద్రంలో కూడా హౌతీ ఉగ్రవాద దళాలు వాణిజ్య నౌకలను స్తంభింపజేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ట్రంప్ నిరాశకు గురవుతున్న సమయంలో హోర్ముజ్ రక్షణకు తమ నౌకలను పంపుతామని దక్షిణ కొరియా అధికారిక ప్రకటన చేసింది.

ఇరాన్ నాయకుల ప్రకటనలకు భిన్నంగా హోర్ముజ్ వద్ద ఐఆర్‌జిసి పట్టు బిగించడంతో చమురు ధరలు పెరిగాయి. పశ్చిమాసియాలో ప్రాదేశిక రాజకీయ పరిస్థితులు శరవేగంగా మారుతున్నాయి. రోజు రోజుకూ యుద్ధ తీవ్రత మరింత పెరుగుతూ సంక్షోభం–గందరగోళ పరిస్థితి పతాక స్థాయి దిశగా ప్రయాణిస్తోంది. ప్రపంచదేశాలలో ధరల పెరుగుదలతో ప్రజల కష్టాలు పెరుగుతున్నాయి. పశ్చిమాసియా దిశగా ప్రయాణించే ప్రధానమైన ఎయిర్‌లైన్స్ సంస్థలు తమ తమ షెడ్యూల్స్‌కు భిన్నంగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు వెళ్ళే విమానాలను, దుబాయ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు దూరంగా మళ్ళించి షార్జా, అబుధాబిలకు మళ్ళిస్తున్నాయి. ఎయిర్ ఇండియా విమానాలను దారిమళ్ళిస్తున్నట్టు భారత్ కూడా ప్రకటించింది.

ఇరాన్ నగరాలు టెహ్రాన్, షిరాజ్‌లపై అమెరికా, ఇజ్రాయెల్ దళాలు గగనతల దాడులతో విధ్వంసం సృష్టించాయి. ఈ యుద్ధం నుండి ఇరాన్ తనసుతాను పునర్నిర్మించుకోవడానికి దాదాపు పదేళ్ళుపైనే పడుతుందని ట్రంప్ వ్యాఖ్యానించారు అల్–ఉదైద్ వైమానిక స్థావరం, అల్–దఫ్రా సహా పశ్చిమాసియా అంతటా వ్యూహాత్మకమైన అమెరికా స్థావరాలను, కీలకమైన మౌలిక ప్రాతిపదక సౌకర్యాలను లక్ష్యంగా చేసుకుని దాడులు కొనసాగించినట్లు ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ ప్రకటించింది. ఇరాన్ పలు దేశాలపై దాడులు చేయడంతో గల్ఫ్ దేశాలు ఇంటర్‌సెప్టివ్ వ్యవస్థలను క్రియాశీలం చేయడం, పౌరులను అప్రమత్తం చేయడం ద్వారా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకున్నాయి. లెబనాన్ మారుమూల ప్రాంతాలలోకి చొచ్చుకువెళ్ళిన ఇజ్రాయెల్ సైనికులు హెజ్బొల్లా స్థావరాలపై భూతల దాడులను తీవ్రతరం చేశారు. హెజ్బొల్లా స్థావరాలు,మౌలిక సదుపాయాలను ధ్వంసం చేస్తున్నట్లు ఐడిఎఫ్ పేర్కొంది. ప్రజలు గ్రామాలు ఖాళీ చేయాలని తాజా హెచ్చరిక చేసింది. లెబనాన్ వ్యాప్తంగా ఉన్న హెజ్బొల్లా ఫైటర్‌ను సంపూర్ణంగా నిర్మూలిస్తామని ఐడిఎఫ్ ప్రతిజ్ఞ చేసింది. అరమౌన్ సహా బీరూట్‌లోని మూడు ప్రాంతాలపై గగనతల దాడులతో విధ్వంసం సృష్టించింది.

చమురు,గ్యాస్ సంక్షోభం విస్తరించింది. బ్యారెల్ చమురు ధర 100 డాలర్లను దాటేసింది. దీంతో ద్రవోల్బణ పెరుగుదల భయాలు పెరిగాయి. హోర్ముజ్‌కు నౌకలు పంపేదిలేదని నాటో దేశాలు స్పష్టం చేయడంతో చమురు ధరలు పెరిగాయి. ఆసియా,ఆఫ్రికా దేశాల్లో గ్యాస్ సమస్య విస్తరించింది. మరోవైపు అమెరికా ఫెడరల్ బ్యాంక్ తీసుకుంటున్న చర్యల కారణంగా బంగారం,వెండి ధరలు అంతర్జాతీయ మార్కెట్‌లో గణనీయంగా తగ్గుముఖం పట్టాయి. బంగారం ధర వరుసగా రూ.12వేలు (22క్యారెట్లు), రూ.13 (24 క్యారెట్లు) వంతున తగ్గాయి.

హోర్ముజ్ జలసంధి ద్వారా శత్రు దేశాలకు మాత్రమే అనుమతి లేదని, మిగిలిన దేశాలన్నీ స్వేచ్ఛగా ఈ మార్గాన్ని ఉపయోగించుకోవచ్చునని ఉద్రిక్తతలమధ్య మరోసారి ఇరాన్ పాలకులు స్పష్టం చేశారు.

ఈ ప్రకటనలమధ్య భారత్‌కు చెందిన గ్యాస్ ట్యాంకర్ నందాదేవి సురక్షితంగా హోర్ముజ్ జలసంధి దాడులకుని మంగళవారం గుజరాత్ తీరానికి చేరుకుంది. మరో 22 నౌకలు హోర్ముజ్ వద్దనే స్తంభించి ఉన్నాయని భారత్ పేర్కొంది. ఇదిలా ఉండగా, చమురు కష్టాలలో ఉన్న ఇరాక్ ఇరాన్‌తో ఒప్పందం చేసుకుంది. పైపులైన్ల ద్వారా చమురు రవాణాకు ఒప్పందం చేసుకున్నట్లు వార్తలు వెలువడ్డాయి.

**ఇరాన్‌లో 1500 మంది మృతి**

నిరాశ్రయులైన 30.20 లక్షలమంది ప్రజలు

ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ దాడులు,సృష్టించిన విధ్వంసం కారణంగా 18 రోజుల యుద్ధంలో 30.20 లక్షలమంది ఇరాన్ ప్రజలు ఇళ్ళు కోల్పోయి నిరాశ్రయులయ్యారు. వారంతా దాడుల భయంతో తలోదిక్కుకూ పారిపోయారు. వారి ఇళ్ళు ధ్వంసమయ్యాయి. ఈ యుద్ధంలో 1500 మంది ఇరానీయులు మరణించారనీ, మరో 18,500 మంది గాయపడ్డారని, వీరిలో ఎక్కువమంది ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారని ఇరాన్ ఆరోగ్యశాఖామంత్రి మంగళవారం ప్రకటించారు.

లెబనాన్‌లో ఇప్పటివరకూ జరిగిన యుద్ధంలో 850 మంది మరణించగా మరో 2,705 మంది గాయపడ్డారు. ఒక్క మంగళవారంనాడే దాడుల్లో గాయపడిన 70 మందిని ఆసుపత్రులకు తరలించారు. లెబనాన్‌లో వేలాదిమంది షియా ముస్లింలు గ్రామాలు వదలి పారిపోయారు. దీంతో లెబనాన్‌లో ఇప్పటివరకూ 10 లక్షలమంది నిరాశ్రయులయ్యారు. లెబనాన్‌లో శరణార్థుల సమస్య, రోజు రోజుకూ హింసాకాండ విస్తరిస్తూ ఉండటంతో కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, బ్రిటన్ దేశాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. 18 రోజుల యుద్ధంలో పశ్చిమాసియాలోని ఏడు దేశాల్లో 13 మంది అమెరికా సైనికులు మరణించగా, మరో 200 మంది అమెరికన్ సైనికులు గాయపడ్డారు. ఇరాన్ చేసిన దాడులవల్ల ఇజ్రాయెల్‌లో 14 మంది మరణించగా,2,775 మంది క్లస్టర్ బాంబు దాడుల్లో గాయపడ్డారు.

## లారిజానీ హతం

(మొదటి పేజీ తరువాయి)

మొదట తీవ్ర సందేహాలు తలెత్తాయి. ఆ తర్వాత ముమ్మరంగా తనిఖీలు చేసిన తర్వాత లారిజానీ హతుడైనట్లు నిర్ధారణ చేసుకున్నారు. ఇజ్రాయెల్ రక్షణమంత్రి ఇజ్రాయెల్ కట్జ్ ఒక ప్రకటన చేస్తూ లారిజానీని అంతమొందించినట్లు ప్రకటించారు. ఐ.డి.ఎఫ్ దళాల ప్రధానాధిపతి, లెఫ్టినెంట్ జనరల్ అయాల్ జమీర్ మాట్లాడుతూ, ఇజ్రాయెల్ రక్షణ దళం ఈ విజయంతో మరోసారి తన శక్తిసామర్థ్యాలు రుజువుచేసుకుందన్నారు. ఇటీవలికాలంలో పాలస్తీనా యుద్ధరంగంలో అనేకమందిని హతమార్చామని, ఆ విధంగా ఎన్నో విజయాలు సాధించామని, ఇప్పుడు వీరిని అంతం చేయడం మరో అదనపు విజయమని అన్నారు.

లారిజానీ ఇరాన్‌లో ప్రముఖ నాయకుడు, ఫిలాసఫర్, పదవీ విరమణ చేసిన సైనిక నాయకుడు. ఆయన గతంలో సైన్యంలో కీలకపాత్ర వహించారు. 1958లో నజాఫ్‌లో జన్మించిన లారిజానీ సైన్యంలో అనేక కీలక పదవులు నిర్వహించారు. టెహ్రాన్ యూనివర్సిటీలో వెస్టర్న్ ఫిలాసఫీని అధ్యయనం చేశారు. 2008 2020 వరకూ ఇరాన్ పార్లమెంటు స్పీకర్‌గా పనిచేశారు. అమెరికా దాడుల్లో గతనెల అలీ ఖమేనీ మరణించిన తర్వాత దేశంలో ఎంతో శక్తిమంతమైన నాయకుడుగా లారిజానీని ఇరాన్ పత్రికలు తెరమీదకు తెచ్చాయి.

అదేవిధంగా ఇరాన్‌లో శక్తిమంతమైన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జిసి)లో ఉన్న ఐదు బ్రాంచీలలో మరో కీలకమైన స్వచ్ఛంధ ఉగ్రవాద పారామిలిటరీ దళం 'బాసిజ్‌కు సులేమానీ కమాండర్‌గా వ్యవహరిస్తున్నారు. ఇటీవలికాలంలో ఇజ్రాయెల్ అనేక పారామిలిటరీ దళాల కార్యాలయాలపై వరుస దాడులు చేస్తూ ఉండటంతో బాసిజ్ ప్రత్యేకంగా ఒక టెంట్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది. ఘోలం సులేమానీ ఈ టెంట్ కార్యాలయంలో ఉన్నట్లు గుర్తించిన ఐ.డి.ఎఫ్. ఆయనను లక్ష్యంగా చేసుకుని దాడులు చేసింది. 2019 జులైలో సేలేమానీ బాసిజ్ కమాండర్‌గా బాధ్యతలు తీసుకున్నారు. 1979లో ఆయొతొల్లా ఖమేనీ ఈ బాసిజ్ దళాన్ని ఏర్పాటు చేశారు. ఈ బాసిజ్ దళంలో అందరూ స్వచ్ఛంధ సేవకులే ఉంటారు. వీరిలో ఎక్కువమంది గ్రామీణ ప్రాంత గిరిజనులు, నిరుపేదలు ఉంటారు. ఇరాన్–ఇరాక్ మధ్య జరిగిన యుద్ధంలో బాసిజ్ దళం కీలక పాత్ర పోషించింది.

1981లో ఖమేనీ నేతృత్వంలో ఒక స్వతంత్ర సంస్థగా బాసిజ్ ఆవిర్భవించి ఇరాన్‌కు పెట్టని కోటగా నిలిచింది. ఇరాన్ మత రాజ్య పాలకులకు వ్యతిరేకంగా జరిగే అల్లర్లను నిర్దాక్షిణ్యంగా అణచివేయడంలో బాసిజ్‌దే ప్రధాన పాత్ర. ఈ విషయంలో అదెంతో క్రియాశీలంగా వ్యవహరిస్తుంది. ఇరాన్ కొత్త అధినేత, అలీ ఖమేనీ కుమారుడు మొజ్తబా ఖమేనీకి ఐఆర్‌జిసి, బాసిజ్‌లతో సన్నిహిత సంబంధాలున్నాయి.

## నాన్పుడొద్దు

(మొదటి పేజీ తరువాయి)

విమర్శించారు. యాజమాన్యానికి, ప్రభుత్వానికి తమ కష్టాలు చెప్పుకుందామన్నా ఆర్‌టిసిలో కనీసం కార్మిక సంఘాలు కూడా లేవన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయాలని, కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలన్నారు.

**పూర్తి స్థాయిలో రుణమాఫీ అమలు చేయాలి**

రైతులకు పూర్తి రుణమాఫీ అమలు చేయాలని సత్యం ప్రభుత్వాన్ని కోరారు. రూ.2 లక్షలకు ఒక్క రూపాయి ఎక్కువ రుణం ఉన్నా రుణమాఫీ పథకం అమలుకు నోచుకోవడంలేదన్నారు. ఇంకా మిగిలిపోయిన రైతులకు రుణమాఫీ పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయాలని కోరారు. రాష్ట్రంలో సామాన్య ప్రజలు, రైతులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించాలని సత్యం డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ధరల పెరుగుదల, వ్యవసాయ సంక్షోభం వంటి ప్రధాన సమస్యలు ప్రజలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయని అన్నారు. రైతులు పంటలకు గిట్టుబాటు ధరలు పొందలేక ఇబ్బందులు పడుతున్నారని, ఎరువులు, విత్తనాలు, విద్యుత్ ఖర్చులు పెరగడంతో అప్పుల బారిన పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న అసంతృప్తిని గుర్తించాలి

ప్రభుత్వంపై ప్రజల్లో నెలకొన్న అసంతృప్తిని గుర్తించాలని సత్యం సూచించారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టులు ఉన్నప్పటికీ వాటిని భర్తీ చేయడంలో ఆలస్యం అవుతుందని, వెంటనే అన్ని శాఖల్లో ఖాళీలను భర్తీ చేసి యువతకు ఉద్యోగ అవకాశాలను కల్పించాలన్నారు. కార్మికుల పరిస్థితి కూడా దారుణంగా ఉందని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. కనీస వేతనాలను అమలు చేయని యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పట్టణాల్లో పేద ప్రజలు నివాస సమస్యలతో బాధపడుతున్నారని, ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ వేగవంతం చేయాలని కోరారు.

గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది కొరతతో పాటు వైద్యపరికరాల సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించి పేదలకు మెరుగైన వైద్యం అందేవిధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**రాష్ట్ర సాగునీటి ప్రాజెక్టులపై కేంద్రం వివక్ష**

రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం జాతీయ హోదా కల్పించకపోవడం బాధాకరమని సత్యం అన్నారు. దక్షిణ తెలంగాణ ప్రాజెక్టులను గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయాలన్నారు. మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టును స్వాగతిస్తున్నామని, కానీ ఇళ్లు కోల్పోయే వారికి తగిన పునరావాసం, మెరుగైన మౌలిక సదుపాయాలు, ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

**పాఠశాలలను బలోపేతం చేయాలి**

విద్యా రంగంలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం అత్యవసరమని సత్యం అన్నారు. విద్యా రంగానికి సంబంధించి పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, మౌలిక వసతులైన తాగునీరు, మరుగుదొడ్లు, అదనపు తరగతి గదులు ఏర్పాటు చేయాలని సూచించారు. భాషా పండితులు, పిఈటి ఉపాధ్యాయుల పదోన్నతుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. మధ్యాహ్న భోజన పథకంలో ఉన్న లోపాలను సరిదిద్దుతూ, వంట ఏజెన్సీలకు పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని, మెనూ ఛార్జీలను పెంచాలన్నారు. నల్లగొండ జిల్లాలోని స్థానిక సమస్యల పరిష్కారానికి నిధుల కేటాయింపులో ప్రాధాన్యత ఇవ్వాలని సత్యం ప్రభుత్వాన్ని కోరారు.

## ఇసి ఆటాడుతోంది

(మొదటి పేజీ తరువాయి)

బిజెపి కోసం ప్రచారం చేయాలి' అని ఆమె అన్నారు. ఎన్నికలకు ముందు బిజెపికి డబ్బు, ఆయుధాల తరలింపును సులభతరం చేయడానికే ఈ బదిలీలు జరిగాయని కూడా బెనర్జీ ఆరోపించారు. ఎలాంటి ఆటంకాలు లేకుండా బిజెపి డబ్బు, ఆయుధాలు సజావుగా బదిలీ అయ్యేందుకే అధికారులను మార్చారని ఆమె పేర్కొన్నారు. రాష్ట్రంలో బిజెపి చేస్తున్న రాజకీయ ప్రచారంపై కూడా టిఎంసి అధినేత్రి విమర్శలు గుప్పించారు. తన ప్రభుత్వానికి వ్యతిరేకంగా కేంద్ర ఏజెన్సీలను వాడుకుంటోందని ఆ పార్టీపై ఆరోపించారు.

291 స్థానాల్లో టిఎంసి పోటీ

పశ్చిమ బెంగాల్‌లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల కోసం అధికార తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) మంగళవారం అభ్యర్థుల జాబితాను ప్రకటించింది. రాష్ట్రంలోని మొత్తం 294 స్థానాలకు గాను, 291 స్థానాల్లో తమ పార్టీ పోటీ చేస్తుందని మమతా బెనర్జీ చెప్పారు. తాను భవానీపూర్ నియోజకవర్గం నుంచే తిరిగి పోటీ చేస్తున్నానన్నారు. డార్జిలింగ్ కొండ ప్రాంతంలోని మిగిలిన మూడు స్థానాల్లో అనిత్ థాపా నేతృత్వంలోని 'భారతీయ గోర్ఖా ప్రజాతాంత్రిక్ మోర్చా' (బిజిపిఎం) పోటీ చేస్తుందని తెలిపారు. 'మేము 294 స్థానాలకు గాను 291 స్థానాల్లో పోటీ చేస్తాము. డార్జిలింగ్ కొండ ప్రాంతంలోని మిగిలిన మూడు స్థానాల్లో మా మిత్రపక్షమైన, అనిత్ థాపా నేతృత్వంలోని బిజిపిఎం పోటీ చేస్తుంది' అని బెనర్జీ అభ్యర్థుల పేర్లను ప్రకటిస్తూ చెప్పారు. ఈ సందర్భంగా ఆమె పక్కన పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ, రాష్ట్ర అధ్యక్షుడు సుబ్రతా బక్షి ఉన్నారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో టిఎంసి స్పష్టమైన మెజారిటీతో అధికారాన్ని నిలబెట్టుకుంటుందని బెనర్జీ ధీమా వ్యక్తం చేశారు. 226 కంటే ఎక్కువ స్థానాలను గెలుచుకుంటామన్నారు. అభ్యర్థుల జాబితాలో చోటు దక్కని పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. వారికి పార్టీ సంస్థాగత వ్యవహారాల్లో తగిన స్థానం కల్పిస్తామని ఆమె హామీ ఇచ్చారు. బిజెపి లక్ష్యంగా చేసుకుంటూ బెనర్జీ మాట్లాడుతూ, రాబోయే ఎన్నికల్లో ఆ కాషాయ పార్టీ స్థానాల సంఖ్య తగ్గుతుందని అన్నారు. వారి ప్రజా వ్యతిరేక విధానాలకు తగిన గుణపాఠం ఎదురవుతుందని వ్యాఖ్యానించారు. అభ్యర్థుల ప్రకటనతో పశ్చిమ బెంగాల్‌లో తీవ్రమైన ఎన్నికల పోరుకు రంగం సిద్ధమైంది. టిఎంసి వరుసగా నాలుగోసారి అధికారాన్ని చేజిక్కించుకోవాలని ప్రయత్నిస్తోంది.

## రాజీనామా చేస్తా

(మొదటి పేజీ తరువాయి)

జమ చేస్తున్నామన్నారు.

**బిఆర్‌ఎస్ పెట్టిన పెండింగ్ వడ్డీ చెల్లించాం: మంత్రి శ్రీధర్‌బాబు**

గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.3 వేల కోట్ల పావలా వడ్డీ రుణాలను పెండింగ్‌లో పెడితే దానిని కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లిస్తున్నదని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చెప్పారు. వడ్డీ లేని రుణాల పంపిణీ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ ఎందుకు పాల్గొనడం లేదని ఆయన ప్రశ్నించారు.

**వివిధ రూపాల్లో రుణాలు ఇచ్చాం : మంత్రి సీతక్క**

స్త్రీ నిధి, బ్యాంకు లింకేజీ ద్వారా వివిధ రూపాల్లో తీసుకున్న రుణాలకుగాను రూ.57 వేల కోట్లను చెల్లించామని మంత్రి ధనసరి అనసూయ సీతక్క చెప్పారు. రుణాల్లో ఇప్పటి వరకు వడ్డీ లేని రుణాల కింద రూ.1121 కోట్ల నిధులను చెల్లించామని తెలిపారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం మహిళలకు ఇవ్వాల్సిన రూ.3 వేల కోట్ల వడ్డీలను చెల్లించకుండా మోసం చేసిందని, ఆడబిడ్డలు రూపాయి రూపాయి పోగేసి ఆదా చేసుకున్న అభయహస్తం నిధులను కూడా గత ప్రభుత్వం కాజేసిందని విమర్శించారు.

# 'మహిళా సాధికారత'పై శాసనసభలో మాటల యుద్ధం

ప్రజాపక్షం/హైదరాబాద్ : మహిళా సాధికారత అంశంపై శాసనసభలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బిఆర్ఎస్ మధ్య వాదోపవాదనలు జరిగాయి. మహిళలను కోటీశ్వరులను చేస్తామనే అంశంపై బిఆర్ఎస్ ఎంఎల్ఎ కెటి.రామారావు ప్రస్తావించిన అంశాలపై డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ధనసరి అనసూయ సీతక్క స్పందించారు. 'మీ కుటుంబం' (కవితను ఉద్దేశించి)లోని, సమాజంలోని మహిళలను ఎదగనివ్వాలని మంత్రి సీతక్క సూచించారు. శాసనసభ, శాసనమండలి ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ చేసిన ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై మంగళవారం శాసనసభలో జరిగిన చర్చలో బిఆర్ఎస్ ఎంఎల్ఎ కె.టి.రామారావు ప్రస్తావించిన అంశాలపై మంత్రులు స్పందించారు.

## మహిళల పట్ల కెటిఆర్‌కు చిన్నచూపు : భట్టి



మహిళల పట్ల బిఆర్ఎస్‌కు చిన్నచూపు ఉన్నదని, వారి కుటుంబ ఆడబిడ్డ పట్ల ఏ మేరకు గౌరవం ఉన్నదో ప్రజలకు తెలుసునని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. కెటిఆర్ దారి తప్పి మాట్లాడుతున్నట్టుగా అనిపిస్తుందని, మహిళల అభివృద్ధి గురించి వారికి (బిఆర్ఎస్) శ్రద్ధ ఉంటే వారి మొదటి క్యాబినెట్‌లో మహిళలకు అవకాశం కల్పించేవారు కదా? అని అన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల కోసం ప్రజలు ఎదురు చూసి కళ్ళు కాయలు కాసాయని, కానీ డబుల్ బెడ్ రూమ్ ఇల్లు మాత్రం రాలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఒక్కో ఇంటికి రూ 5 లక్షల చొప్పున మొదటి దశలో ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇండ్లను మంజూరు చేశామని, 4.50 లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టామని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఒకే సారి రూ.22,500 కోట్లు మంజూరు చేశామని వివరించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను ప్రజా ప్రభుత్వం అమలు చేసుకుంటూ ముందుకు పోతుందన్నారు.

## విజన్ పెట్టుకోవడం తప్పా? శ్రీధర్‌బాబు



మహిళలను ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చేయాలనే విజన్ పెట్టుకోవడం తప్పా అని మంత్రి శ్రీధర్‌బాబు ప్రశ్నించారు. మహిళా సాధికారతను చులకన చేయడం మంచిదికాదని కెటిఆర్‌కు సూచించారు. తెలంగాణ రాష్ట్రం విషయంలో సోనియాగాంధీ నిర్ణయం తీసుకోకపోతే 'మీరు' ఉండేవారా అని ప్రశ్నించారు. తాము గత ప్రభుత్వ పాలసీలను కూడా కొనసాగిస్తున్నామని, ఒక విజన్‌తో ముందుకు వెళ్తున్నామని వివరించారు.

## మహిళలను ఎగతాలి చేస్తున్నారు : సీతక్క



కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తున్నదని, కానీ 'మీరు' (కెటిఆర్) ప్రతి సారి మహిళలను ఎగతాలి చేస్తున్నారని మంత్రి ధనసరి అనసూయ సీతక్క గ్రహం వ్యక్తం చేశారు. ఆర్‌టిసిలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించామని, కానీ బిఆర్ఎస్ మాత్రం సోషల్ మీడియాలో దానిపై దృష్ప్రచారాన్ని చేయడమే పనిగా పెట్టుకుందని విమర్శించారు. ధనిక రాష్ట్రం అని చెప్పిన బిఆర్ఎస్, వారి పదేళ్ల కాలంలో మహిళలకు వడ్డీ లేని రుణాలను ఎందుకు చెల్లించలేదని, దళితులకు మూడు ఎకరాల భూమిని ఎందుకు పంపిణీ చేయలేదని, నిరుద్యోగ భృతి ఎందుకు ఇవ్వలేకపోయారని ప్రశ్నించారు. మహిళలకు చెందిన అభయ హస్తం డబ్బులను ఎందుకు వాడుకున్నారని నిలదీశారు. గతంలో ఆర్థిక శాఖ మంత్రిగా ఉన్న హరీశ్ రావు మహిళా రుణాలకు రూ.5 లక్షల పరిమితిని విధించారని, తాము పరిమితిని సడలించామని మంత్రి సీతక్క గుర్తు చేశారు.

## కోటీశ్వరులను చేస్తే తెలంగాణ వంద ట్రిలియన్లుగా మారుతుంది కదా? : కెటిఆర్



కోటీ మంది మహిళలను కోటీశ్వరులను చేస్తే తెలంగాణ రాష్ట్రం వంద ట్రిలియన్లుగా మారుతుంది కదా? అని బిఆర్ఎస్ ఎంఎల్ఎ కెటిఆర్ అన్నారు. మహిళలకు పెండింగ్‌లో ఉన్న వడ్డీ లేని రుణాలను ఇవ్వాలని, గృహలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు రూ.2500 సాయం పథకాన్ని అమలు చేయాలని, ఇందుకు సంబంధించిన నిధులను ప్రస్తుత బడ్జెట్‌లో కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కెటిఆర్ కోరారు.

# సిఎం సంతకం చేసిన 'ఆరు గ్యారంటీ'ల దస్త్రం ఎక్కడికి పోయింది : కెటిఆర్

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఆరు గ్యారంటీల దస్త్రంపై సిఎం సంతకం పెట్టినట్టుగా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మొదటి శాసనసభ సమావేశంలోని గవర్నర్ ప్రసంగంలో పొందుపర్చారని, సిఎం సంతకం చేసిన ఆ దస్త్రం ప్రస్తుతం ఏమైందని, ఎఫ్ఎస్ఎల్ అగ్ని ప్రమాదంలో కాలిపోయిందా? అని బిఆర్ఎస్ ఎంఎల్ఎ కె.టి. రామారావు (కెటిఆర్) ప్రశ్నించారు. మాయమైన ఆ దస్త్రంపై సిట్ ఏర్పాటు చేయాలన్నారు. శాసనసభ, శాసనమండలి ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ చేసిన ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై మంగళవారం శాసనసభలో జరిగిన చర్చలో కెటిఆర్ మాట్లాడుతూ గవర్నర్ ప్రసంగంలో ఐటి ఎగుమతులు రూ 3.13 లక్షల కోట్లకు చేరుకున్నాయని, 9.39 లక్షల ఉద్యోగాలు అని పొందుపర్చారని, కానీ ఇటీవల ఐటి శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తన ప్రసంగంలో రూ.3.60 లక్షల కోట్లు అని, 9.46 లక్షల ఉద్యోగాలు అని అన్నట్టుగా ఉన్నదని, ఈ రెండింటిలో ఏది వాస్తవమని ప్రశ్నించారు. గవర్నర్ ప్రసంగం ప్రకారం ఐటి ఉద్యోగాల సంఖ్య ఏడు వేలకు తగ్గిందని, ఇది వాస్తవమా? లేదా సాంకేతిక తప్పులా పరిశీలించాని, ఒక వేళ సాంకేతిక తప్పు జరిగితే అందుకు బాధ్యునిగా ఐటి శాఖ కార్యదర్శిని పక్కన పడేయాలని సూచించారు. పెట్టుబడుల అంశంపై శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. ఫార్మా సిటీ కోసంసేకరించిన భూములతోనే ఫోర్త్ సిటీ, ఫ్యూచర్ సిటీ అంటున్నారని,కానీ ఇందులో ఎంపిలు, ఎంఎల్ఎలు, జర్నలిస్టులకు ప్లాట్లు ఇవ్వడం సాధ్యం కాదని, వాటి కోసం కేటాయించిన భూములను వాటికే ఉపయోగించాలని కెటిఆర్ అన్నారు. ప్రజల ఆస్తుల విలువ జీరో చేశామని సిఎం చెబుతున్నారని, కానీ సిఎం చేసిన సంతకానికే జీరో వ్యాల్యూగా మారిందని, కాంగ్రెస్ జారీ చేసిన గ్యారంటీ కార్డులు, డిక్లరేషన్లకు జీరో వ్యాల్యూ ఉన్నదని, విశ్వసనీయత కోల్పోయిన ప్రభుత్వానికే జీరో వ్యాల్యూ అని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ తీరు 'పోశమ్మ పొతం చేస్తే మైసమ్మ మాయం చేసినట్టుగా ఉందన్నారు. కెసిఆర్ కిట్‌కు అవసరమైతే రాహుల్ కిట్ అని పేరుపెట్టైనా ఈ పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. హైదరాబాద్‌లో 'ఫ్రీడం, ప్రజాపాలనను దొంగలు, దోమలు మాత్రమే ఎంజాయ్ చేస్తున్నాయని కెటిఆర్ ఎద్దేవా చేశారు. ప్రభుత్వం ఏ కార్యక్రమాన్ని నిర్వహించినా ఆ ప్రాజెక్టు అజెండా మాత్రం భూములేనని అన్నారు.

## పెట్టుబడులపై శ్వేతపత్రం విడుదల చేస్తాం: మంత్రి శ్రీధర్‌బాబు

తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులు రావొద్దనే విధంగా భయభ్రాంతులను సృష్టించొద్దని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రతిపక్షానికి సూచించారు. వివిధ కంపెనీలతో చేసుకున్న ఒప్పందాలు, పెట్టుబడుల విషయంలో శ్వేతపత్రం విడుదల చేస్తామని మంత్రి ప్రకటించారు. శాసనసభ, శాసనమండలి ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ చేసిన ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై మంగళవారం శాసనసభలో జరిగిన చర్చలో బిఆర్ఎస్ ఎంఎల్ఎ కె.టి.రామారావు ప్రస్తావించిన అంశాలపై మంత్రి శ్రీధర్ బాబు పైవిధంగా స్పందించారు. రూ.5.75 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు పలువురు ఎంఒయు చేసుకున్నారని వివరించారు.

## ప్రధాన ప్రతిపక్ష నేత అసెంబ్లీకి రాకుండా ఫామ్‌హౌస్‌లో పడుకోవడం దరిద్రం

కాంగ్రెస్ ఎంఎల్ఎ బాలునాయక్ నేనావత్

శాసనసభ బడ్జెట్ సమావేశాల సందర్భంగా గవర్నర్ ప్రసంగానికి కూడా రాని ప్రధాన ప్రతిపక్ష నాయకులలో కె.చంద్రశేఖర రావు ప్రపంచ చరిత్రలో నిలిచిపోతారని కాంగ్రెస్ ఎంఎల్ఎ బాలునాయక్ నేనావత్ అన్నారు. ప్రధాన ప్రతిపక్ష నాయకుడు అసెంబ్లీకి రాకుండా ఫామ్‌హౌజ్‌లో పడుకోవడం దరిద్రమన్నారు. బాధ్యత గల రాజకీయ నాయకులు డ్రగ్స్ కేసులో ఇరికి సమాజానికి ఏమి సంకేతాలను ఇస్తున్నారని ఆ రాజకీయ పార్టీలు కూడా ఆలోచించాలని సూచించారు. శాసనసభ, శాసనమండలి ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ చేసిన ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని మంగళవారం శాసన సభలో కాంగ్రెస్ సభ్యులు బాలునాయక్ ప్రవేశపెట్టగా, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ బలపర్చారు. ఈ సదర్భంగా బాలు నాయక్ మాట్లాడుతూ గవర్నర్ ప్రసంగం భవిష్యత్ తెలంగాణకు అద్దం పడుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఆరు గ్యారంటీలను ప్రశ్నిస్తున్న వారు, గతంలో వారి ఎన్నికల మ్యానిఫెస్టోను ఎంత వరకు అమలు చేశారో చూసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీల అమలును ప్రశ్నించే నైతిక హక్కు బిఆర్ఎస్‌కు లేదన్నారు.

ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ గత బిఆర్ఎస్ హయాంలో రైతులు వరి వేస్తే ఉరి అని అన్నారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో సన్న బియ్యం పండించే రైతులకు రూ. 500ల బోనస్‌ను అందిస్తున్నామని, రైతు భరోసా, రైతులకు పనిముట్లను అందిస్తున్నామని వివరించారు. కాళేశ్వరం నుంచి చుక్క నీరు తీసుకోకపోయినప్పటికీ 71.86 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండించామన్నారు. బిఆర్ఎస్ హయాంలో నిర్మించిన ఒకే ఒక్క కాళేశ్వరం ప్రాజెక్ట్ కూడా కూలిపోయిందని విమర్శించారు.

# జడ్జిమెంట్ చదవకుండానే అభియోగాలు

నాతో మాట్లాడితే నేను జవాబు ఇస్తా: స్పీకర్

హైకోర్టులో అడుగుతాం: కెటిఆర్

ప్రజాపక్షం/హైదరాబాద్: 'జ్యూడిషియరీలోజడ్జ్ తీర్పు ఇస్తారు. జడ్జిమెంట్‌ను మొత్తం చదవకుండానే ఎన్నో అభియోగాలు చేశారు. అయినా నేను మీడియా ముందుకు రాలేదు. ఈ విషయంలో కూడా జడ్జిమెంట్ చదవి నాతో మాట్లాడితే నేను జవాబు ఇస్తాను. అయినా స్పీకర్ స్థానాన్ని ప్రశ్నించడం తక్కువ చేసుకుంటే మంచిది' అని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. శాసనసభ, శాసనమండలి ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ చేసిన ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై మంగళవారం శాసనసభలో జరిగిన చర్చలో బిఆర్ఎస్ ఎంఎల్ఎ కె.టి.రామారావు మాట్లాడుతూ పార్టీ ఫిరాయింపుల అంశాన్ని ప్రస్తావించగా స్పీకర్ పైవిధంగా స్పందించారు. బిఆర్ఎస్ ఎంఎల్ఎ కెటిఆర్ తన ప్రసంగంలో పార్టీ ఫిరాయింపుల విషయాన్ని ప్రస్తావించారు. ఆయన స్పీకర్ నిర్ణయంపై తమ అభ్యంతరాన్ని సున్నితంగా చెప్పే ప్రయత్నం చేశారు. 'మా పార్టీ టికెట్ పై గెలిచిన ఎమ్మెల్యే ఆ పార్టీ తరపున లోకసభ ఎన్నికల్లో పోటీ చేశారు. ఆయనను అక్కడ కూర్చో పెట్టారు. అయినా మీ నిర్ణయంపై మాకు ఏలాంటి విరోధం లేదు' అంటుండగా, స్పీకర్ ప్రసాద్ కుమార్ జోక్యం చేసుకుని జుడీషియరీలో మనం కోర్టుకు పోతాం. జడ్జిమెంట్ జడ్జి ఇస్తారు. ఈ కోర్టు కాకపోతే మరో కోర్టుకు పోతాం. అయినా నువ్వు జడ్జిమెంట్ చదవకుండానే ఎన్నో అభియోగాలు చేశావు. అయినా నేను మీడియా ముందుకు రాలేదు.ఈ విషయంలో కూడా నువ్వు జడ్జిమెంట్ చదివిన తరువాత నాతో మాట్లాడితే జవాబిస్తాను'' అని స్పీకర్ స్పష్టం చేశారు. 'అయినా ఈ విధంగా ప్రశ్నించే అలవాటును నువ్వు (కెటిఆర్) తగ్గించుకుంటే మంచింది' అని కెటిఆర్‌కు స్పీకర్ సలహా ఇచ్చారు.ఇందుకు కెటిఆర్ స్పందిస్తూ, 'మీరంటే నాకు వ్యక్తిగతంగా ఎంతో గౌరవం. మీరు నేను మిత్రులం. ఈ విషయం అందరికీ తెలుసు. అయినా మీరు తీసుకున్న నిర్ణయం తప్పు అయితే సభ్యునిగా ప్రశ్నించే అధికారం నాకు ఉంది. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం మా బాధ్యత, హక్కు. మేం తప్పక హైకోర్టులో అడుగుతాం' అని అన్నారు.

## స్పీకర్ స్థానాన్నే ప్రశ్నిస్తున్నారు : మంత్రి పొంగులేటి

అనంతరం రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీ నివాస్ రెడ్డి స్పందిస్తూ బిఆర్ఎస్ నాయకులు కట్టుకథలు చెప్పడంతో పాటు చివరకు జడ్జి స్థానంలో ఉన్న స్పీకర్‌ను కూడా ప్రశ్నించే స్థాయిలో వారు (బిఆర్ఎస్) ఆహంకారంతో మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# పాతబస్తీ అభివృద్ధికి రూ.5వేల కోట్లు కేటాయించాలి

ఎంఐఎం ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాలా

హైదరాబాద్ అభివృద్ధికి సంబంధించి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకోవడంతో పాటు పాతబస్తీ అభివృద్ధికి ప్రత్యేకంగా ఈ బడ్జెట్‌లో రూ.5వేల కోట్లు కేటాయించాలని ఎంఐఎం ఎంఎల్ఎ అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాలా కోరారు. మూసీ పునరుజ్జీవనం, అభివృద్ధి అత్యవసరమని, అయితే నిర్వాసితులకు న్యాయబద్ధమైన పునరావాసం కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శాసనసభలో మంగళవారం ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ చేసిన ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై జరిగిన చర్చలో బలాలా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు ఎంఐఎం పూర్తి సహాకారం ఉంటుందని, అయితే నిర్వాసితులకు న్యాయం చేయాల్సిందేనన్నారు. 2047 నాటికి ప్రభుత్వం 3ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యంగా ప్రణాళికను ప్రకటించిందని, దీనిని సాధించడానికి అవసరమైన కార్యాచరణను ప్రభుత్వం వెల్లడించాలన్నారు. ఇప్పటి వరకు 1000 ఎకరాల ప్రభుత్వ భూములను హైడ్రా స్వాధీనం చేసుకోవడం మంచిదేనని, అయితే హైడ్రా చట్ట పరిధిని దాటి వ్యవహారించడం సరైంది కాదని పేర్కొన్నారు.

## అసెంబ్లీ మీడియా పాయింట్

### కెటిఆర్ నా వ్యక్తిత్వాన్ని కించపరుస్తున్నారు

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



ప్రజాపక్షం/హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వంపై బిఆర్ఎస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని తాను ఎప్పటికప్పుడు ప్రశ్నిస్తున్నందుకు బిఆర్ఎస్ నేత కెటిఆర్ తన వ్యక్తిత్వాన్ని కించపరుస్తున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మంగళవారం ఆయన మాట్లాడుతూ కెటిఆర్ అసెంబ్లీ సాక్షిగా పదే పదే అబద్ధాలు మాట్లాడుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇస్తున్న సంక్షేమ పథకాలను చూసి బిఆర్ఎస్ ఓర్వలేకపోతున్నదన్నారు. తాను పెట్టుకున్న వాచి రోలెక్స్ అని, దాని విలువ కోటి రూపాయలు అని దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దుబాయ్ కేంద్రంగా వాట్సప్ గ్రూప్‌ల ద్వారా ఎన్ని అసత్య ప్రచారాలు చేసినా తెలంగాణ ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. అసెంబ్లీ నిబంధనలకు విరుద్ధంగా తన ఫోటో తీయడంపై స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తానని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

### కోటి రూపాయల వాచీని రూ.30 వేలకే తీసుకోండి


కెటిఆర్‌కు ఎమ్మెల్యే వేముల వీరేశం సవాల్



ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ధరించిన వాచ్ కోటి రూపాయల వరకు ఉంటుందని చెబుతున్న బిఆర్ఎస్ నేత కెటిఆర్ అదే వాచ్‌ను రూ.30 వేలకే తీసుకోవాలని ఎంఎల్ఎ వేముల వీరేశం సవాల్ చేశారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ ఆది శ్రీనివాస్ మీద చేసిన తప్పుడు ఆరోపణలు వెనక్కి తీసుకుని కెటిఆర్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. గవర్నర్ ప్రసంగాన్ని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పదే పదే తప్పుదోవ పట్టిస్తున్నారని వీరేశం అన్నారు. బిఆర్ఎస్ పార్టీ పదేళ్ల కాలంలో ఆర్థిక విధ్వంసం చేసిన విషయం తెలంగాణ ప్రజలకు తెలుసునని ఆయన పేర్కొన్నారు. ఆది శ్రీనివాస్‌పై అసత్య ప్రచారం చేస్తున్నారని, గతంలో మంత్రి సీతక్కపై కూడా ఇదే విధంగా అసత్య ప్రచారాలు చేశారని ఎంఎల్ఎ రామచంద్రనాయక్ అన్నారు. సొంత చెల్లెలు అడిగిన ప్రశ్నలకు కెటిఆర్ సమాధానం చెప్పకుండా దాటవేశారన్నారు. కాళేశ్వరం, అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు ఇలా ప్రతి దానిలో అవినీతి జరిగిందని సొంత చెల్లెలు కవిత మాట్లాడితే దానికి సమాధానం లేదన్నారు.

### అబద్ధం అయితే ముక్కు నేలకు రాస్తా

ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి



కరీంనగర్ పోలీసు కమిషనర్ ఆలం గౌస్, ఆయన సతీమణి, స్నేహితులు కలిసి ఇష్టం వచ్చినట్లు ఫైరింగ్ చేస్తున్నారు. 180 బుల్లెట్లు ఫైరింగ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. నేను మాట్లాడేది వాస్తవం. అబద్ధం అయితే ముక్కు నేలకు రాస్తా' అని బిఆర్ఎస్ ఎంఎల్ఎ పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ, ఆలం గౌస్ తనకున్న అధికారాన్ని ఉపయోగించి అక్రమ పనులు చేస్తున్నారని కౌశిక్ ఆరోపించారు. గౌస్ కుటుంబ సభ్యులతో కలిసి బోనాలపల్లి గ్రామంలో ఇష్టానుసారంగా ఫైరింగ్ చేస్తున్నారని అన్నారు. కమిషనర్ చేసిన ఫైరింగ్‌లో అమృతమ్మ అనే వృద్ధురాలి తొడకు గాయమైందని తెలిపారు. కమిషనర్‌పై సిఎం ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని ప్రశ్నించారు. ఇందుకు సంబంధించిన ఆధారాలు ఉన్నాయని, మరిన్ని విషయాలను త్వరలో వెల్లడిస్తానని తెలిపారు. బండి సంజయ్‌కి దమ్ముంటే సిపిపై సిబిఐ ఎంక్వయిరీ వెయించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఎంఎల్‌సి మహేష్ కుమార్ గౌడ్ ప్రకటనలు చేసి పారిపోవడం కాదని, అసెంబ్లీలో డ్రగ్స్ టెస్ట్ పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీలో ఎంత మంది డ్రగ్స్ తీసుకుంటున్నారో అప్పుడు తెలుస్తుందన్నారు.

### కౌశిక్‌రెడ్డి చెప్పింది అంతా అబద్ధం

ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు



బిఆర్ఎస్ ఎంఎల్ఎ పాడి కౌశిక్ రెడ్డి పోలీసుల మనోధైర్యాన్ని దెబ్బతీసే విధంగా మాట్లాడుతున్నారని కాంగ్రెస్ ఎంఎల్ఎ కెఆర్.నాగరాజు అన్నారు. కౌశిక్‌రెడ్డి డ్రగ్స్‌కు అలవాటు పడ్డ ముఠా బ్యాచ్ కాబట్టి వారి ప్రవర్తన అసెంబ్లీలో అహంకారంగానే ఉందన్నారు. హాఫ్ ఇయర్లీ, ఇయర్లీ పోలీసుల ఫై రింగ్‌కు కుటుంబ సభ్యులను కూడా పిలవడం ఆనవాయితీ అన్నారు. ప్రైవేటు వ్యక్తులతో ఫైరింగ్ చేయించడం జరగదని, కౌశిక్‌రెడ్డి ఈ అంశంపై కావాలని తప్పుడు ఆరోపణలు, దుష్ప్రచారం చేస్తున్నారని, కౌశిక్ రెడ్డి గుండాయిజంతో ప్రవర్తిస్తున్నారని ఆయన అన్నారు.

### సొంత పార్టీ నేతలపై సిఎంకు విశ్వాసం లేదు

ఎమ్మెల్యే కెపి వివేకానంద్



తన సొంత పార్టీ నేతలపై సిఎం రేవంత్‌రెడ్డికి విశ్వాసం లేదని ఎంఎల్ఎ కెపి వివేకానంద్ ఆరోపించారు. కాంగ్రెస్ ఎంఎల్ఎలు పార్టీ శాసన సభా పక్షం సమావేశాలనికి హాజరుకాకపోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు నిధులు రాక గ్రామాల్లో తిరుగలేకపోతున్నారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కూడా వారి పార్టీ నేతలకు విశ్వాసం లేదన్నారు.

### ఒక్క కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయలేదు

ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్



ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్క ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయలేదని బిఆర్ఎస్ ఎంఎల్ఎ కల్వకుంట్ల సంజయ్ విమర్శించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో రైతులు బయట మార్కెట్‌లో ధాన్యం అమ్ముకుని క్వింటాల్‌కు రూ.700లు నష్టపోతున్నారన్నారు. రైతులు పెట్టిన పెట్టుబడి కూడా రావడంలేదన్నారు. 'రైతుబంధు లేదు. కరెంటు లేదు. ధాన్యం కొనుగోలు లేదు' అని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి మొక్కజొన్న రైతులను ఆదుకోవాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

## అసెంబ్లీ -వాయిదా తీర్మానం

ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ శాఖలలో రిటైర్డ్ ఉద్యోగులకు , వారికి రావాల్సిన బెనిఫిట్స్,గ్రాట్యుటీ,జిపిఎఫ్ వంటి బకాయిల అంశంపైన శాసనసభలో చర్చించాలని సిపిఐ శాసనసభాపక్ష నేత కూనంనేని సాంబశివ రావు శాసనసభలో మంగళవారం వాయిదా తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. రిటైర్డ్ ఉద్యోగులకు సకాలంలో బకాయిలను చెల్లించకపోవడంతో అనేక మంది రిటైర్డ్ ఉద్యోగులు ఆర్థిక, వైద్యపరంగా ఇబ్బందులు పడుతున్నారని కూనంనేని అన్నారు. కాగా వాయిదా తీర్మానాన్ని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తిరస్కరించారు.

## రాజకీయాలకు, చట్టసభలకు వన్నె తెచ్చిన

# ఓంకార్ జీవితం చిరస్మరణీయం

శతజయంతి సభలో పలువురు వక్తలు



ప్రజాపక్షం / హైదరాబాద్ : రాజకీయాలకు, చట్టసభలకు వన్నె తెచ్చిన ఎంసిపిఐ(యు) వ్యవస్థాపక నేత, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు, మాజీ శాసనసభ్యులు మద్దికాయల ఓంకార్ జీవితం చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. ఓంకార్ శతజయంతి సందర్భంగా 'చట్టసభలలో ఓంకార్ పాత్ర' అనే అంశంపై సదస్సు మంగళవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగింది. సభకు ఎంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి అధ్యక్షత వహించగా, రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, ఎంసిపిఐ(యు) జాతీయ ప్రధానకార్యదర్శి మద్దికాయల అశోక్ ఓంకార్, సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు, హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్, మాజీ ఎంఎల్ఎ గుమ్మడి నర్సయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఓంకార్ చిత్రపటానికి వారు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ నిరంతరం ప్రజల కోసం పరితపించిన ఓంకార్ మరణం నర్సంపేటకే కాదు, యావత్ తెలంగాణ రాష్ట్రానికి తీరని లోటు అన్నారు. ఆరు దశాబ్ధాల రాజకీయ ప్రస్థానంలో ఏ శక్తులకూ లొంగకుండా రాజకీయాలకు విలువలు అద్దిన రాజకీయ దురంధరుడు, ప్రజా సమస్యలపై చట్టసభలలో గళం వినిపించిన నిస్వార్థ ప్రజాసేవకుడు ఓంకార్ అని కొనియాడారు. సురవరం ప్రతాపరెడ్డి, గద్దర్, అందెశ్రీ వంటి మహనీయుల చరిత్రను భవిష్యత్తు తరాలకు తెలియజేస్తున్నామని, అదే రీతిలో ఓంకార్‌ను రాష్ట్ర ప్రజలు గుర్తుంచుకునేలా ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని తెలిపారు. ట్యాంక్ బండ్ మీద ఓంకార్ విగ్రహం ఉండేలా తనవంతు కృషి చేస్తానన్నారు. కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకు ఇస్తున్న వాగ్దానాలు నెరవేర్చలేని పార్టీలు చట్టసభలలో పోగవుతున్నాయని విమర్శించారు. అసలు ప్రజలను పట్టించుకునే స్థాయిని దిగజార్చి మాట్లాడుతున్నారన్నారు. ఓంకార్ చట్టసభలను వేదికగా చేసుకుని ప్రజా సమస్యలపై పోరాడారని, చట్టసభలకు వన్నె తెచ్చారని ఆయన కొనియాడారు. ఓంకార్ పోరాటాల స్ఫూర్తి తమకున్నదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌తో నక్సలిజాన్ని అంతమొందించాలని ప్రకటించడం, యావత్తు ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్న వారిని నిర్మూలించేందుకు ఎత్తుగడ అని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వాల తప్పుడు విధానాలను ఎండగట్టాలంటే ప్రస్తుతం వామపక్ష పార్టీలు ఏకం కావాల్సిన అవసరం ఉన్నదని, అది ఓంకార్ ఆశించారని సాంబశివరావు గుర్తు చేశారు. ఓంకార్ ఆశయ సాధనకు తమవంతుగా చట్టసభలను వేదికగా చేసుకుని పోరాడుతామని చెప్పారు. బి.వి.రాఘవులు మాట్లాడుతూ ఓంకార్ స్ఫూర్తితో అసమానతల రాజకీయాలపై, ఆర్థిక అంశాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. అమెరికా సామ్రాజ్యవాదులతో భారత ప్రభుత్వం చేతులు కలిపి యుద్ధాన్ని ప్రోత్సహించడంతో ప్రజలపైనే ధరల భారం పడుతుందటని, ఇందుకు బాధ్యులైన వారికి గుణపాఠం చెప్పాలంటే వామపక్ష, ప్రజాతంత్ర ఉద్యమాలు ఓంకార్ స్ఫూర్తితో పోరాడాలన్నారు. మద్దికాయల అశోక్ ఓంకార్ మాట్లాడుతూ ప్రస్తుతం చట్టసభలలో ప్రజా సమస్యలపై ప్రశ్నించేవారు కాకుండా రాజకీయాలను వ్యాపార దృష్టితో చూసే వారి సంఖ్య పెరిగిపోతుందన్నారు. చట్టసభలలో ప్రాతినిధ్యం వహిస్తున్న వారు ప్రజల పక్షాన ఉండి ప్రజల నేతలనిపించుకోవాలని కోరారు.కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి జెవి.చలపతిరావు, సిపిఐ ఎంఎల్ కేంద్ర కమిటీ సభ్యులు గుర్రం విజయ్‌కుమార్, ఎస్‌యుసిఐ(సి) రాష్ట్ర కార్యదర్శి సిహెచ్.మురారి, ఎంసిపిఐ(యు) కేంద్ర కమిటీ సభ్యులు మర్రెడ్డి వెంకటరెడ్డి, రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు వనం సుధాకర్, వల్లెపు ఉపేందర్‌రెడ్డి, చందర్‌రావు, జిల్లాల నుంచి ఎంసిపిఐయు పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

GREATER HYDERABAD MUNICIPAL CORPORATION
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ

NIT No. 68, పని పేరు: 1 పని కొరకు జిహెచ్ఎంసి రాజేంద్రనగర్ & అత్తాపూర్ సర్కిల్‌లో వరద నీటి లైన్‌లు / యుజిడి నిర్వహణ మరియు మరమ్మతులు, అంచనా విలువ / ఇసివి: రూ.13.00 లక్షలు, డౌన్‌లోడింగ్ ప్రారంభ తేదీ & సమయం: 17.03.2026న సా.4.30గం.లకు, బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం: 23.03.2026న సా.4.40గం.ల వరకు, ఇఇ/ఎస్ఇ పేరు & చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, రాజేంద్రనగర్, జిహెచ్ఎంసి. సెల్ నెం.9989930608, ఇ-మెయిల్ ఐడి: eec11.ghmc2@gmail.com.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, రాజేంద్రనగర్, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 17213-PP/CL/ADVT/1/2025-26, Date: 17-03-2026

శంకర్‌పల్లి మున్సిపాలిటీ కార్యాలయం : రంగారెడ్డి జిల్లా

లేఖ సంఖ్య: E1/MCS/179/2026 | ఇ-ప్రొక్యూర్‌మెంట్ (E-Procurement) టెండర్ ప్రకటన | తేదీ: 16-03-2026

'1). బోరు బావులను శుభ్రపరచడం మరియు లోతు పెంచడం, 2). బోరు మోటార్ల మరమ్మతులు, 3). సి.సి. (CC) రోడ్ నిర్మాణం, 4). నీటి సరఫరా వ్యవస్థ నిర్వహణ మరియు మరమ్మతులు, 5). భూగర్భ డ్రైనేజీ (UGD) పైపుల నిర్వహణ మరియు మరమ్మతులు, 6). కొత్త మోటార్ పంపుసెట్ల సరఫరా మరియు డెలివరీ, మరియు 7). శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో రోడ్లు మరియు డ్రైనేజీల శుభ్రత కోసం నైపుణ్యం లేని కార్మికులను (Un-Skilled Labour) నియమించడం' - ఈ పనుల నిమిత్తం, నమోదిత కాంట్రాక్టర్ల నుండి టెండర్లు ఆహ్వానించబడుతున్నాయి. ఈ టెండర్లను శంకర్‌పల్లి మున్సిపాలిటీ కమిషనర్ 24-03-2026 తేదీన మధ్యాహ్నం 03:00 గంటల వరకు స్వీకరిస్తారు. అదే రోజు మధ్యాహ్నం 03:30 గంటలకు శంకర్‌పల్లి మున్సిపాలిటీ కమిషనర్ గారి సమక్షంలో ఇ- టెండర్లు తెరవబడతాయి.

పిలిచిన టెండర్ల వివరాల (Schedule) జాబితా ఈ క్రింది విధంగా ఉంది:
1. టెండర్ పత్రాన్ని డౌన్‌లోడ్ చేసుకునే తేదీ: 16-03-2026, మధ్యాహ్నం 03:00 గంటలకు
2. ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్ల సమర్పణ: 24-03-2026, మధ్యాహ్నం 03:00 గంటలకు
3. టెండర్ల ప్రారంభం (Opening): 24-03-2026, మధ్యాహ్నం 03:30 గంటలకు

మరిన్ని వివరాల కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్లాట్‌ఫారమ్‌అయిన https://tender.telangana.gov.in ను సందర్శించండి లేదా శంకర్‌పల్లి మున్సిపాలిటీ కార్యాలయాన్ని సంప్రదించండి. సంప్రదించాల్సిన నంబర్లు: 7337323577 / 7331127776. నోటీసు బోర్డుపై కాపీ ఉంచబడింది.

సం/- కమిషనర్
శంకర్‌పల్లి మున్సిపాలిటీ

DIPR R.O. No. : 17146-PP/CL/ADVT/1/2025-26, Date: 17-03-2026

శ్రీ కోటమైసమ్మ అమ్మవారి దేవస్థానము
ఇండ్లకోటయ్యగూడెం, నిడమనూరు మండలము, నల్లగొండ జిల్లా.

లేఖ నెం.01/ఎస్.కె.ఎమ్.టి /2026, | టెండర్-కం-బహిరంగ వేలముల ప్రకటన | తేదీ: 10-03-2026.

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా ! సదరు దేవస్థానమునకు సంబంధించిన బహిరంగ వేలము ది: 25-03-2026, బుధవారము, రోజున ఉదయం 11-00 గంటలకు సహాయ కమీషనరు వారి కార్యాలయము, నల్లగొండ నందు దేవాదాయ- ధర్మాదాయ శాఖ అధికారుల సమక్షములో నిర్వహించబడును.

| క్ర.సం. | వేలము వివరము | డిపాజిట్ డి.డి | కాలపరిమితి |
|---|---|---|---|
| 1 | పూజా సామాగ్రి అమ్ముకొను హక్కు | 1,00,000/- | 01-04-2026 నుండి 31-03-2027 వరకు |
| 2 | కొబ్బరిచిప్పలు ప్రోగుచేసుకొను హక్కు | 1,00,000/- | -దూ- |

కావున పైన తెలిపిన టెండర్ - కం - బహిరంగ వేలం నిర్వహించుటకు ఒక గంట ముందు ఆసక్తిగలవారు డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనగలరని కోరనైనది. ఇతర వివరములకు మొబైల్ నెంబర్ 9703662667 సంప్రదించగలరు.

ఇట్లు,
చెవిటి ఆంజనేయులు, ఫౌండర్ ట్రస్టీ
సిరికొండ నవీన్, కార్యనిర్వహణాధికారి

DIPR R.O. No. : 17187-PP/CL/ADVT/1/2025-26, Date: 17-03-2026



## లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పారదర్శకం

### ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన కలెక్టర్

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని రామస్వామి గుట్ట వద్ద 110 ఎకరాలలో నిర్మిస్తున్న 2160 ఇందిరమ్మ ఇండ్ల మోడల్ హౌసింగ్ కాలనీని త్వరలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని రామస్వామి గుట్ట వద్ద నిర్మిస్తున్న మోడల్ హౌజింగ్ కాలనీని, అంతర్గత రోడ్లు, సబ్‌స్టేషన్, మొక్కల నాటడం, హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించి, మిగిలిపోయిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉందని, అర్హత లేని వారికి ఈ జాబితాలో పేరు ఉండకూడదని స్పష్టం చేశారు. అత్యంత అర్హులైన వారికి ప్రాధాన్యం ఇచ్చి, సూక్ష్మంగా పరిశీలించి ఎటువంటి అవకతవకలకు తావులేకుండా ఈ ప్రక్రియ చేపడుతున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాసగౌడ్, హౌసింగ్ పిడి సిద్ధార్థ, జిల్లా ఉద్యానవన అధికారి నాగయ్య, మిషన్ భగీరథ ఈఈ కరుణాకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, తహసీల్దార్ కవిత, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## గ్యాస్ ధరలు నియంత్రించాలి



**ప్రజాపక్షం/రామన్నపేట :** దేశవ్యాప్తంగా పెరిగిన గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో మంగళవారం రామన్నపేట మండల కేంద్రంలోని సుభాష్ సెంటర్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రామన్నపేట సిపిఐ మండల కార్యదర్శి ఊట్కూరి నరసింహ మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం వైఫల్యంతోనే దేశంలో చమురు సంక్షోభం ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో రామన్నపేట సిపిఐ మండల సహాయ కార్యదర్శి రామ చంద్రు, నాయకులు ఎర్ర రమేష్ గౌడ్, సిపిఐ పట్టణ కార్యదర్శి రచ్చ యాదగిరి, ఏఐటీయూసీ మండల అధ్యక్షులు శివరాత్రి సమ్మయ్య, రైతు సంఘం అధ్యక్షుడు ఊట్కూరి కృష్ణ, ఊట్కూరి భగవంత, రమేష్ పాల్గొన్నారు.

గ్యాస్ ధరలు తగ్గించాలి

## ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం ఆపాలి



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** అమెరికా, ఇజ్రాయెల్ ఇరు దేశాలు ఇరాన్,అరబ్ దేశాల్లోని గ్యాస్, ఆయిల్, ముడి చమురును ఆ చేయాలనే దురుద్దేశ్యంతో ఇరాన్ దేశంపై అక్రమంగా యుద్ధం చేస్తున్న అమెరికా, ఇజ్రాయెల్ దురహంకార చర్యలు, సామ్రాజ్యవాద అహంకారంతో చేస్తున్న యుద్ధాన్ని వెంటనే ఆపాలని, ప్రపంచ శాంతిని పరిరక్షించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోకల వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసిల్దార్ ప్రసాదికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కడియాల అప్పయ్య, ఏఐటియుసి జిల్లా నాయకులు సుధాకర్‌రెడ్డి, నాయకులు ఎల్ల అంజిరెడ్డి, పోకల అంజనేయులు, షేక్ నబీసాబ్, ప్రజాని సైదులు, గుండు గోవిందు, సైదులు, రవి, కాశయ్య, శేషగిరి, చందాల నగేష్, పిట్ట మైసయ్య పాల్గొన్నారు.

## ఎల్లయ్య మృతి సిపిఐకి తీరని లోటు



**ప్రజాపక్షం/నాంపల్లి:** మండలంలోని కేతేపల్లి గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకుడు పల్లేటి ఎల్లయ్య అకాల మరణం పార్టీకి తీరని లోటు అని సిపిఐ జిల్లా కార్యదర్శి ఆర్.అంజయ్య చారి అన్నారు.మంగళవారం ఎల్లయ్య పార్థివ దేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి మనోధైర్యం కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఐ పార్టీ కోసం నిరంతరం కృషి చేస్తూ,పార్టీ ఉద్యమాలలో చురుకుగా పాల్గొనే నిబద్ధత కలిగిన నాయకుడని కొనియాడారు.గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి ఆయన చేసిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. అలాంటి నాయకుడి మృతి పార్టీకి,గ్రామ శాఖకు తీరని లోటని అన్నారు.ఎల్లయ్య ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ప్రతి కమ్యూనిస్టు బాధ్యత అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి సుదనబోయిన రమేష్, సహాయ కార్యదర్శి నేతాళ్ల రాజు,మండల కార్యవర్గ సభ్యులు ఊరుపాక వెంకటయ్య,కోరే సత్తయ్య,గిరి స్వామి,కానుగుల మహేష్,ఉప సర్పంచ్ ఋషిపాక యాదయ్య పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి సహకారం



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** న్యాయవాదుల సమస్యలు పరిష్కరించేందుకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని ఏఐసిసి సభ్యులు రాం రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. సూర్యాపేట బార్ అసోసియేషన్ ఎన్నికల సందర్భంగా మంగళవారం పట్టణంలోని వైట్‌హౌస్‌లో ఆయనను సూర్యాపేట బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు నూకల సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యం లో న్యాయవాదుల ప్రతినిధుల బృందం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగత మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి ఆశయసాధనే తన లక్ష్యమన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు.

### పెండింగ్ ఎక్స్‌గ్రేషియా వెంటనే చెల్లింపునకు

# 25న ఎక్సైజ్ కార్యాలయం ముట్టడి

### గీత కార్మికుల హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలి

### పబ్బు వీరస్వామి పిలుపు



**ప్రజాపక్షం/నల్లగొండ:** గీత కార్మికులకు ఏళ్ల తరబడి రావలసిన పెండింగ్ ఎక్స్‌గ్రేషియా మొత్తాలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 25న ఎక్సైజ్ కార్యాలయం ముట్టడికి పెద్దఎత్తున తరలిరావాలని తెలంగాణ గీతా పనివారల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పబ్బు వీరస్వామి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన గీతా పనివార్ల సంఘం నల్లగొండ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. గీత వృత్తిని నిర్వీర్యం చేస్తూ కార్మికుల జీవనోపాధిని దెబ్బతీస్తున్న ప్రభుత్వ విధానాలపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. 2022 సంవత్సరం నుండి పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియా మొత్తాలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హరితహారం, పర్యావరణ పరిరక్షణలో భాగంగా అన్ని గ్రామాల్లో తాటి,ఈత, ఖర్జూర చెట్ల పెంపకాన్ని ప్రోత్సహించాలని సూచించారు. గీత వృత్తికి నష్టం కలిగిస్తున్న మద్యం బెల్ట్ షాపులను అరికట్టాలని కోరారు. హైదరాబాద్ ట్యాంక్ బండ్‌పై స్వా తంత్ర్య సమరయోధుడు, మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మభిక్షం విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.యాదాద్రి భువనగిరి జిల్లా నందనంలో ఉన్న నీరా ప్రాజెక్టును పునరుద్ధరించి ధర్మభిక్షం పేరుతో కొనసాగించాలని సూచించారు.అలాగే గీత కార్మికుల ఐడెంటిటీ కార్డులు, లైసెన్సులను త్వరితగతిన జారీ చేయాలని ఎక్సైజ్ అధికారులను కోరారు.జిల్లా ప్రధాన కార్యదర్శి బొడిగె సైదులు మాట్లాడుతూ గీత వృత్తిపై ఆధారపడి మరణించిన కార్మికుల భార్యలకు వితంతు పింఛన్ మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. గ్రామాల్లో కల్లు దుకాణాల ఏర్పాటు కోసం వెయ్యి గజాల స్థలాన్ని కేటాయించాలని, నందనంలో నీరా పరిశ్రమలను ఏర్పాటు చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు.ఈ సమావేశంలో సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ సురిగి చలపతి, చింతపల్లి పుల్లయ్య, జయరాములు, బొమ్మరబోయిన లాలు, సహాయ కార్యదర్శులు పల్లె శంకర్, జోగు సురేందర్,మాదగోని మల్లయ్య,కొంకా దేవేందర్,లెనిన్, గంగాదేవి, గాలయ్య పాల్గొన్నారు.

# పిహెచ్‌సిలలో సాధారణ ప్రసవాలు పెరగాలి

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

### మెడికల్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/చింతలపాలెం (మేళ్ళచెర్వు) :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా వైద్య నిపుణులచే ప్రతి పిహెచ్‌సిలో మెడికల్ క్యాంప్‌లు నిర్వహించడం జరుగుతుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ కోరారు. మంగళవారం మేళ్లచెర్వు పిహెచ్‌సిలో జరిగే మెడికల్ క్యాంప్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ క్యాంప్‌ల ద్వారా జనరల్ మెడిసిన్, పిడియాట్రిక్, గైనకాలజీ, ఆర్థోపెడిక్, ఆప్తమాలజీ, మహిళలకు గర్భాశయ ముఖ క్యాన్సర్‌ను గుర్తించే టాప్‌స్పెయర్, కంటికి సంబంధించి క్యాట్రాక్ట్ లోపం, బిపి, షుగర్, చిన్న పిల్లల్లో ఎత్తు, పోషకాహార లోపాలకు చెందిన వైద్య నిపుణులు రోజుకొక్క పిహెచ్‌సికి వచ్చి వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. వైద్యంతోపాటు అవసరమైన వారికి మందులను ఉచితంగా అందించడంతోపాటు ఆరోగ్యం మెరుగుపడేలా తగు సూచనలు, సలహాలు ఇస్తారన్నారు. ఇంకా ఏమైనా శస్త్ర చికిత్సలు చేయాల్సి వస్తే మెరుగైన వైద్యం కోసం జనరల్ హాస్పటల్‌కు రిఫర్ చేయడం జరుగుతుందన్నారు. క్యాంప్‌లో 300 మంది ఓపి నమోదు కావడం పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. పిహెచ్‌సిలలో సాధారణ ప్రసవాలు పెరిగేలా ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు.

**విద్యార్థులతో కలిసి భోజనం...** మేళ్ళచెర్వు మండల కేంద్రంలోని ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ స్కూల్‌లో కలెక్టర్ హాస్టల్‌లోని గదులను, వంట గదిని పరిశీలించి, విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు. విద్యార్థులను ప్రతిరోజు వంట బాగుంటుందా, మెను ప్రతిరోజు అమలు చేస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం జరుగుతున్న పదవ తరగతి వార్షిక పరీక్షల్లో ప్రతి విద్యార్థి ప్రతి సబ్జెక్టులో కనీసం 70 శాతానికి పైగా మార్కులు సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకొని రావాలని కోరారు. కలెక్టర్ వెంట డిప్యూటి డిఎంహెచ్ఓ మాధవ్ కుమార్, డాక్టర్ సుధాకర్ నాయక్, వైద్యులు యశ్వంత్, మణి, ప్రజ్ఞ, సాయిశ్రీ, వెంకటేశ్, సమీర, మెడికల్ అధికారి, వైస్ ప్రిన్సిపాల్ మధు, ఇంచార్జి తహశీల్దార్ సురేందర్ రెడ్డి, సర్పంచ్ బచ్చు పద్మావతి, సిబ్బంది పాల్గొన్నారు.

# ఉగాది నాటికి ఇందిరమ్మ ఇండ్ల సామూహిక గృహప్రవేశాలు



### నల్లగొండ జిల్లా కలెక్టర్ ఎంపిడిఒలకు ఆదేశం

**ప్రజాపక్షం/నల్లగొండ :** ఉగాది రోజున ఇందిరమ్మ ఇండ్ల సామూహిక గృహప్రవేశాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఎంపీడీవోలకు ఆదేశించారు.మంగళవారం కలెక్టర్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తూ ఆయన పలు కీలక అంశాలపై సూచనలు ఇచ్చారు. ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలతో పాటు, సంబంధిత బిల్లుల చెల్లింపులను త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు.వ్యక్తిగత మరుగుదొడ్ల బిల్లులను కూడా చెల్లించాలన్నారు. శాసనసభ్యుల సమ్మతితో గృహప్రవేశాలు నిర్వహించాలని సూచించారు.ఉపాధి హామీ పథకం కింద నిర్మిస్తున్న పాఠశాల టాయిలెట్లు,గ్రామ సమాఖ్య భవనాలు,గ్రామపంచాయతీ కార్యాలయాలు,అంగన్వాడీ భవనాల పనులను ఇంకా ప్రారంభించని పనుల వివరాలు సమర్పించాలని ఆదేశించారు.ఏప్రిల్ 2న జరగనున్న ప్రజాపాలప్రగతి ప్రణాళిక గ్రామసభల కోసం,ఆయా పథకాల లబ్ధిదారుల జాబితాలను సిద్ధం చేసి ఎంపీడీవోలకు పంపాలని చెప్పారు.గ్రామసభల్లో లబ్ధిదారుల పేర్లను చదివి వినిపించాలని సూచించారు.మండల,జిల్లా స్థాయి నివేదికలను కూడా సిద్ధం చేయాలని ఆదేశించారు.జనగణన కోసం అవసరమైన ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లు మరియు ఇండ్ల జాబితాను ముందుగానే సిద్ధం చేసుకోవాలని తెలిపారు.ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్ కుమార్,డిపిఓ శంకర్ నాయక్, పంచాయతీరాజ్ ఈఈ గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.



## ఫిర్యాదులపై తక్షణం స్పందించాలి

**ప్రజాపక్షం/కోదాడ:** ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా కోదాడ టౌన్ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పి కె.నర్సింహా అకస్మికంగా తనిఖీ చేశారు. మంగళవారం కోదాడ టౌన్ పోలీస్‌స్టేషన్‌లోని పరిసరాలను, రికార్డులు, ఫిర్యాదుల నిర్వాహణ, కేసుల దర్యాప్తు, పెండింగ్ ఫైల్స్‌ను సమీక్షించి వాటిని త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. అనంతరం సిసి కెమెరాల పనితీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈసందర్భంగా జిల్లా ఎస్పి మాట్లాడుతూ ఫిర్యాదులపై తక్షణ స్పందనలతో ప్రజలకు భరోసా కల్పించాలని, కేసుల పెండింగ్ లేకుండా వేగంగా చర్యలు తీసుకోవాలని అదేశించారు. సిబ్బంది క్రమశిక్షణతో అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగాలని, మున్సిపాలిటి అధికారులతో సమన్వయం పెంచి రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను సక్రమంగా నియంత్రించాలని చెప్పారు. రోడ్లపై వ్యాపారాలు నిర్వహించడం వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయని, వాటిని నియంత్రించాల్సిన అవసరం ఉందన్నారు. రంజాన్, ఉగాది పర్వదినాల సందర్భంగా ప్రజలు మతభేదాలు లేకుండా సోదరభావంతో ఉత్సవాలు జరుపుకోవాలని కోరారు. ఈ తనిఖీలో కోదాడ డిఎస్పి శ్రీనివాసరెడ్డి, పట్టణ ఇన్స్‌పెక్టర్ శివశంకర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ రామారావు, ఎస్ఐ లు సుధీర్, చిన్న మల్సూర్, ట్రాఫిక్ ఎస్ఐ అంజిరెడ్డి పాల్గొన్నారు.

## పిల్లల మరణాల నివారణకు చర్యలు

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** చిన్నపిల్లల మరణాలకు గల కారణాలను ఆదిలోనే గుర్తించి, నివారించదగ్గ మరణాలు సంభవించకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా ఇమ్యునైజేషన్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రామకృష్ణ అధికారులను ఆదేశించారు. మంగళవారం యాదగిరిగుట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో యాదగిరిగుట్ట, సారాజిపేట మరియు రాజపేట మండలాల పరిధిలోని ఐదు సంవత్సరాలలోపు పిల్లల మరణాలపై ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లస్టర్ స్థాయి అధికారులకు మరియు సిబ్బందికి పలు కీలక శిశు మరణాలకు దారితీసే ఆరోగ్య సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించి తగిన వైద్యం అందించాలి. గర్భిణీ స్త్రీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారికి అవసరమైన అన్ని రకాల వైద్య పరీక్షలను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు తల్లీబిడ్డల ఆరోగ్యంపై నిరంతరం నిఘా ఉంచాలని కోరారు. ఈ సమీక్షా సమావేశంలో యాదగిరిగుట్ట, సారాజిపేట, రాజపేట మండలాలకు చెందిన ప్రభుత్వ వైద్యులు, సూపర్వైజర్లు, హెల్త్ సిస్టర్లు మరియు ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## చౌటుప్పల్ పరిశ్రమలలో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

### ఎఐవైఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విప్లవ్ డిమాండ్

**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** స్థానిక పరిశ్రమలలో స్థానికంగా ఉన్న నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఎఐవైఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొండూరు విప్లవ్ అన్నారు. నేడు ఎఐవైఎఫ్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనేక సంవత్సరాల నుండి చౌటుప్పల్ పరిసర ప్రాంతాల్లోని నిరుద్యోగులు అనేక ఉద్యమాలు చేసిన పరిశ్రమలలో ఉద్యోగ అవకాశాలు కల్పించడం లేదని, అనేకమంది డిగ్రీ, పీజీలు పూర్తి చేసి పట్టాలు చేతపట్టుకొని ఉద్యోగ అవకాశాలు రాక మనోవేదనకు గురవుతుంటే, స్థానికులు అనే సాకుతో తమప్రాంతంలో బోలెడు కంపెనీలు ఉన్న ఉద్యోగం కోసం బయట వెతుక్కోవాల్సిన దుస్థితి ఏర్పడిందని అన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న పంట పొలాలు, బూగర్భ జలాలు పూర్తిగా కలుషితం చేస్తున్నారని, రసాయన పరిశ్రమలు వ్యర్థలను యదేచ్చగా రోడ్లపై పారబోస్తున్న అధికారులు పట్టించుకోడంలేదని అన్నారు. ఈ ప్రాంతంలో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా, ఇక్కడ ఉన్న వాతావరనాన్ని నాశనం చేస్తా ఉంటే ఇక్కడి ప్రజలు ఊరుకోబోరని, తప్పకుండ భవిష్యత్తులో తిరుగుబాటు తప్పదని అన్నారు. ఈ సమావేశంలో ఎఐవైయఫ్ నాయకులు బద్దుల సుధాకర్, దాసరి మనోహర్, గుండెబోయిన భాస్కర్, ఉడుత రాజు, దాసరి సిద్దు, రాంచరణ్, సాయితేజ తదితరులు పాల్గొన్నారు.




# సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటం

### యుద్ధ ప్రభావం ప్రతీ ఒక్కరిపై పడుతుంది

### సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

**ప్రజాపక్షం/నల్లగొండ :** అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటం నిర్వహించాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ,సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. మంగళవారం నల్లగొండలోని స్థానిక క్లాక్ టవర్ సెంటర్లో యుద్ధం వద్దు శాంతి ముద్దు నినాదంతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అమెరికా తన సామ్రాజ్యవాద కాంక్షతో ఇతర దేశాలతో యుద్ధం చేస్తున్నారని విమర్శించారు. యుద్ధం వల్ల అన్ని దేశాలపై ప్రభావం పడుతుందని చమురు ధరలు,గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగిపోయి ప్రజలపై భారాలు పడతాయన్నారు. అమెరికా చేస్తున్న యుద్ధం పై భారత ప్రధాని నరేంద్ర మోడీ మౌనంగా ఉండడం ఏమిటని ప్రశ్నించారు.ఈ మౌనాన్ని వీడాలని డిమాండ్ చేశారు.కేంద్ర ప్రభుత్వం ప్రజలపై భారాలు వేస్తుందని నూతన చట్టాలు తీసుకువచ్చి ఇబ్బందుల పాలు చేస్తున్నారని ఆరోపించారు. వాటిని తిప్పి కొట్టేందుకు పెద్ద ఎత్తున పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి,జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి,నారి ఐలయ్య,బండ శ్రీశైలం,పాలడుగు నాగార్జున,కందాల ప్రమీల, పాలడుగు ప్రభావతి,సయ్యద్ హాషం,జిల్లా కమిటీ సభ్యులు మహ్మద్ సలీం,నర్సిరెడ్డి,జిట్ట నగేష్,సరోజ పాల్గొన్నారు.




# జాతీయ లోక్ అదాలత్ విజయవంతం చేయాలి




### మార్చి 28న యాదాద్రి జిల్లా వ్యాప్తంగా నిర్వహణ

**ప్రజాపక్షం/ఆలేరు :** జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ, యాదాద్రి భువనగిరి ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ విజయవంతం కోసం ఆలేరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో సమన్వయ సమావేశం నిర్వహించారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.జయరాజు సూచనల మేరకు ఈ కార్యక్రమం జరిగింది. సంస్థ కార్యదర్శి వి.మాధవిలత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో ఆలేరు జూనియర్ సివిల్ జడ్జి ఆర్.అజయ్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ మార్చి 28వ తేదీ శనివారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ను విజయవంతం చేయడానికి అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న సివిల్, క్రిమినల్, మోటార్ యాక్సిడెంట్, బ్యాంకు రికవరీ, చెక్ బౌన్స్ వంటి కేసులను ఎక్కువగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామ స్థాయి వరకు ప్రచారం నిర్వహించి ప్రజలకు లోక్ అదాలత్ ప్రాముఖ్యతను వివరించాలని, సంబంధిత కక్షిదారులకు ముందుగానే నోటీసులు అందజేయాలని సూచించారు. అదేవిధంగా ప్రతిరోజూ ప్రీసిట్టింగ్స్ నిర్వహిస్తూ, పరస్పర చర్చల ద్వారా కేసులను ముందుగానే పరిష్కరించే అవకాశం ఉందని తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ ద్వారా వేగవంతమైన, ఖర్చు తగ్గించే న్యాయ సేవలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏజీపీ బి.హరిబాబు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు వనమా రాజు, ఉపాధ్యక్షులు టి.హరికృష్ణ, ట్రెజరర్ రవికుమార్, న్యాయవాదులు జూకంటి రవీందర్, సీసా శ్రీనివాస్ గౌడ్, రావుల రవీందర్ రెడ్డి, భీమగాని శ్రీనివాస్ గౌడ్, కె.వి ప్రసాద్, వంగరి శివకుమార్, తోటకూరి రాజు, సామల రమేష్, సంపత్, మొరిగాడి కృష్ణ పాల్గొన్నారు.

# వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి రావొద్దు

### మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి

### సమస్యలు పరిష్కరించి సమన్వయంతో అభివృద్ధి చేయాలి



**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** మున్సిపల్ కార్యాలయంలోని చైర్మన్ చాంబర్లో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ బాధ్యతలు స్వీకరణ కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి దంపతులకు వేదమంత్రాలతో పూర్ణకుంభంతో పండితులు పాలకవర్గ సభ్యులు స్వాగతం పలికారు. ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి, ఆయన సతీమణి లక్ష్మీ లు మున్సిపల్ ఛాంబర్‌లో మొగుదాల పావని రమేష్ గౌడ్‌ను కుర్చీలో కూర్చోబెట్టి సన్మానించి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో గెలిచిన కౌన్సిలర్ సభ్యులందరినీ అభినందించారు. పోటీలో చాలామంది ఉంటారు కానీ ప్రజల మద్దతు ఉన్నవారే ఒక్కరే గెలుస్తారని అన్నారు. వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి రాకుండా చూసుకోవాలని పాలకవర్గానికి సూచనలు చేశారు. మున్సిపాలిటీ అభివృద్ధి కోసం సమన్వయంతో పనిచేసి మౌలిక సదుపాయాలు, మెరుగుదలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పారిశుద్ధ్యం రహదారుల వంటి సమస్యలను త్వరగా పరిష్కరించే దిశగా పనిచేయాలని కోరారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో 46 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మునుగోడు కాంగ్రెస్ ఇంచార్జ్ పబ్బు రాజు గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బోయ దేవేందర్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె శేఖర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య,ఆకుల ఇంద్రసేనా రెడ్డి, ఆర్టీవో శేఖర్ రెడ్డి, సర్పంచ్‌లు, మాజీ ప్రజాప్రతినిధులు మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సిటీ గ్యాస్ ప్రాజెక్టులకు క్లియరెన్స్ ఇవ్వండి

- ఎల్‌పిజి కొరత తీర్చేందుకు రాష్ట్రాలపై కేంద్రం ఒత్తిడి
- ఆందోళన పడొద్దు: తొలుత ఇళ్లకే సరఫరా
- హోటళ్ళు, రెస్టారెంట్లకు కమర్షియల్ గ్యాస్ ఆపేశాం
- గతంకంటే ఇప్పుడే ఇళ్ళకు ఎక్కువ సిలిండర్లు ఇస్తున్నాం
- దేశంలోని రిఫైనరీల్లో ఎల్‌పిజి ఉత్పత్తి పెరిగింది
- కేంద్ర మంత్రిత్వశాఖాధికారి సుజాతా శర్మ ప్రకటన

**న్యూఢిల్లీ:** పైప్ లైన్ల ద్వారా వంటిళ్ళకు సరఫరా చేసే సిటీ గ్యాస్ ప్రాజెక్టులకు సత్వరం క్లియరెన్సులు ఇవ్వాలని రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి పెంచింది. యుద్ధం కారణంగా దేశంలో వంటగ్యాస్ కొరతవల్ల హోటళ్ళ వ్యాపారం,గృహ వినియోగదారులు సిలిండర్ల కోసం సుదీర్ఘంగా ఎదురుచూడటం, గ్యాస్ బుకింగ్ కోసం తీవ్ర ఆందోళన చెందడం వంటి పరిణామాల మధ్య ఈ సమస్యల పరిష్కారానికి నగరాల్లో నేరుగా వంట గ్యాస్ ఇళ్ళకు సరఫరా చేసేందుకు ఉద్దేశించిన సిటీ గ్యాస్ ప్రాజెక్టులకు సత్వర అనుమతులు మంజూరు చేయాలని రాష్ట్రాలను కేంద్రం కోరింది. పైపుల ద్వారా వంటగ్యాస్ సరఫరాలు పొందే విధానానికి వెళ్ళేందుకు గృహిణులు, వ్యాపార వర్గాలను కూడా ప్రోత్సహించాలని కోరింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం మార్చి 16వ తేదీలిఖితపూర్వక ఆదేశాలు ఇచ్చింది. పశ్చిమాసియాలో హోర్ముజ్ జలసంధి నుండి వాణిజ్య నౌకల్లో వంటగ్యాస్ సరఫరా గడచిన 18 రోజులుగా స్తంభించిపోవడంతో ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలతోపాటు భారత్‌లో కూడా ఎల్‌పిజి సరఫరాలు నిలిచిపోవడంతో ప్రజలు ఇండక్షన్ కుక్కర్లు వంటి ప్రత్యామ్నాయ మార్గాలను అనుసరిస్తున్నారు. దాదాపు 60 శాతం ఎల్‌పిజి గ్యాస్ హోర్ముజ్ జలసంధి నుండే భారత్‌కు రావాల్సి ఉండగా యుద్ధం ముగిసే పరిస్థితి లేకపోవడంవల్ల ఈ కొరత తీరే మార్గాలు కనిపించడం లేదు. దీంతో దేశీయంగా ఎల్‌పజి ఉత్పత్తులు పెంచాలని



ఆదేశించడంతోపాటు ప్రభుత్వం ఇతర తక్షణ అవకాశాలపై దృష్టి కేంద్రీకరించింది. ''పరిస్థితి ఇంకా ఆందోళన కరంగానే ఉంది, కానీ గృహ అవసరాలకే వంటగ్యాస్ సరఫరా చేయాలని,దానికే ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వం గట్టి నిర్ణయం తీసుకుంది'' అని కేంద్ర పెట్రోలియం,సహజవాయువుల మంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శి సుజాతా శర్మ మంగళవారం న్యూఢిల్లీలో మీడియా సమావేశంలో చెప్పారు. వంటగ్యాస్ కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, గతం కంటే అసలు ఇప్పుడే ఎక్కువగా ఇళ్ళకు గ్యాస్ సిలిండర్ల సరఫరా పెరిగిందని చెప్పారు. యుద్ధం రాకముందు రోజుకు 50 లక్షలమందికి వంట గ్యాస్ సరఫరా చేస్తే, ఇప్పుడు మార్చి 13వ తేదీన రోజుకు 62.50 లక్షలమందికి, మార్చి 14వ తేదీన 60 లక్షల మంది ఇళ్ళకు వంట గ్యాస్ సరఫరాలు చేశామని చెప్పారు. ఐతే గ్యాస్ బుకింగుల విషయంలో ప్రజల్లో ఇప్పటికీఆందోళన నెలకుని ఉందని, అలా కంగారు పడాల్సిన అవసరం లేదని ఆమె చెప్పారు. గృహావసరాలకు ప్రాధాన్యత ఇచ్చేందుకు వీలుగాదేశీయంగా గ్యాస్ ఉత్పత్తులు పెంచమని రిఫైనరీలకు చెప్పామని, మార్చి ఐదోతేదీతో పోలిస్తే ఈ పది రోజుల్లో దేశీయంగా రిఫైనరీలోల వంటగ్యాస్ ఉత్పత్తి 38 శాతంపెరిగిందని, అందువల్ల ఎలాంటి ఆందోళనా అవసరం లేదని చెప్పారు. అనేక రాష్ట్రాలలో అక్రమ నిల్వదారులను కూడా అరికట్టే చర్యలు కొనసాగుతున్నాయని, అలాంటివారిపై దాడులు,సోదాలతో కేసులు నమోదు చేస్తున్నారని, కొరత లేకుండా చూస్తున్నామని చెప్పారు. మొదట హోటళ్ళు, రెస్టారెంట్లకు కమర్షియల్ గ్యాస్ సరఫరాలు నిలిపివేశామని, పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చిన తర్వాత వాటికి సరఫరాలు పుష్కలంగా పునరుద్ధరిస్తామని చెప్పారు. దేశంలో ఉన్న ఎల్‌పిజి నిల్వలు, బుకింగ్ వివరాలకు సంబంధించిన గణాంకాలను కూడా ఆమె వివరించారు. సాధారణంగా దేశంలో ఒక రోజుకు 55 లక్షలమంది గ్యాస్ సిలిండర్ల బుకింగులు చేసుకుంటారని, యుద్ధం మొదలైన తర్వాత మార్చి 13వ తేదీ నాటికి ఈ బుకింగులు రోజుకు 87.70 లక్షల వంతున పతాకస్థాయికి చేరుకున్నాయని, కేంద్ర ప్రభుత్వం పరిస్థితులను చక్కదిద్దేందుకు అన్ని చర్యలూ తీసుకున్న తర్వాత ఈ రోజువారీ వంటగ్యాస్ బుకింగుల సంఖ్య సోమవారం (మార్చి 16) నాటికి 70 లక్షలకు దిగి వచ్చిందని వివరాలు తెలియజేశారు. దేశంలో గృహ వినియోగదారులను పైపుల ద్వారా వంటగ్యాస్ సరఫరాలు పొందాలని ప్రభుత్వం అటు గృహిణులను, వ్యాపారులనూ కూడా ప్రోత్సహిస్తోందని చెప్పారు. సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్ వర్కు వల్ల సిలిండర్ల డెలివరీ సమస్య తగ్గుతుందని, సులభంగా వంటగ్యాస్ లభ్యం అవుతుందని సుజాతా శర్మ చెప్పారు. రాష్ట్రాలలో ప్రభుత్వాలు, జిల్లా యంత్రాంగాలను కూడా చాలా జాగ్రత్తగా ఈ పరిస్థితిని కనిపెట్టుకుని ఉండాలని ఆదేశించామన్నారు. మహారాష్ట్ర, రాజస్థాన్‌లలో ఉమ్మడి బృందాలు తనిఖీలు, దాడులు కొనసాగిస్తున్నాయని చెప్పారు. ఉత్తర ప్రదేశ్‌లో అధికారులు ఆకస్మిక దాడులు చేశారని 1400 ప్రాంతాలలో తనిఖీలు చేసి 20 ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేశారని, 19 మందిని విచారణ చేస్తున్నారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్, బిహార్, ఒడిసా,కర్ణాటకలలో కూడా దాడులు కొనసాగుతున్నాయని చెప్పారు. ఓఎంసి కూడా ఒక్కరోజుల్లో ఎల్‌పిజి పంపిణీ, రిటైల్ అవుట్‌లెట్‌లలో 1300 ఆకస్మిక తనిఖీలు చేశారన్నారు. ప్రజల్లో అవగాహన ప్రచారం కూడా ఓఎంసి చేపడుతుందన్నారు. వినియోగదారులు ఎస్ఎంఎస్‌లు, వాట్సాప్‌లు, మొబైల్ యాప్‌లను రీఫిల్లింగ్ కోసం ఉపయోగించుకోవాలని కోరారు.

## బెంగాల్‌లో పది స్థానాల్లో పోటీ

### సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య



**న్యూఢిల్లీ:** వామపక్ష కూటమిలో భాగంగా పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ 10 స్థానాల్లో పోటీ చేస్తుందని సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య మంగళవారం తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లో పరిశీలనలో ఉన్న 60 లక్షలకు పైగా ఓటర్లు ఎన్నికల్లో ఓటు వేయగలిగేలా చూడటంలో ఎన్నికల సంఘం విఫలమైందని ఆయన ఆరోపించారు. తృణమూల్ కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రంలో ఒక బలమైన ప్రత్యామ్నాయాన్ని అందించడానికి, అదే విధంగా ఏ విధంగానైనా సరే అధికారంలోకి రావాలని చూస్తున్న బిజెపిని అడ్డుకోవడానికి వామపక్ష పార్టీలు కృషి చేస్తాయని భట్టాచార్య విలేకరులతో అన్నారు. 2011 వరకు 34 ఏళ్ల పాటు నిరంతరాయంగా రాష్ట్రాన్ని పాలించిన, సిపిఐ(ఎం) నేతృత్వంలోని కూటమి, 2021 అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క స్థానాన్ని కూడా గెలుచుకోలేకపోయింది. ఈసారి పశ్చిమ బెంగాల్‌లో వామపక్షాల అవకాశాల గురించి ప్రస్తావిస్తూ, బెంగాల్‌లోని ఈ రాజకీయ కూటమికి సానుకూలమైన ఒక కొత్త పరిణామం చోటుచేసుకుందని ఆయన పేర్కొన్నారు. మొదటిసారిగా, ఇప్పుడు సిపిఐ(ఎంఎల్), వామపక్ష కూటమి (పశ్చిమ బెంగాల్‌లో) మధ్య సీట్ల పంపకం ఒప్పందం కుదిరింది. వామపక్ష కూటమిలో భాగంగా తాము 10 స్థానాల్లో పోటీ చేస్తామని, ఈ సీట్ల పంపకం ఒప్పందంలో ఐఎస్ఎఫ్ డా భాగస్వామిగా ఉంటుందని భట్టాచార్య చెప్పారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల కోసం తమ 192 మంది అభ్యర్థులతో కూడిన మొదటి జాబితాను వామపక్ష కూటమి సోమవారం ప్రకటించింది. సిపిఐ(ఎంఎల్) లిబరేషన్, ఇండియన్ సెక్యులర్ ఫ్రంట్ (ఐఎస్ఎఫ్) అనుబంధ పార్టీలుగా తమ అభ్యర్థులను బరిలోకి దింపుతాయని వామపక్ష కూటమి చైర్మన్ బిమన్ బోస్ కూడా తెలిపారు. తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్ వంటి ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో 'సర్' ఇప్పటికే లక్షలాది మంది ఓటర్ల ఓటు హక్కును తొలగించిందని భట్టాచార్య ఆరోపించారు. 'పశ్చిమ బెంగాల్‌లో ఇది కేవలం ఓట్ల తొలగింపుకు సంబంధించిన విషయం మాత్రమే కాదు. 60 లక్షలకు పైగా ఓటర్లను పరిశీలనలో ఉన్న జాబితాలో ఉంచారు. ఈ పరిశీలనలో ఉన్న ఓటర్ల కేసులపై ఎన్నికలకు ముందే ఒక నిర్ణయం తీసుకుంటామని ఎన్నికల సంఘం నుండి ఎటువంటి హామీ లేదు' అని ఆయన అన్నారు. 'బెంగాల్ నుండి వినిపిస్తున్న ప్రధాన డిమాండ్ ఏమిటంటే— ముందుగా న్యాయపరమైన పరిశీలనలో ఉన్న ఓటర్ల ఓటు హక్కులకు భరోసా కల్పించాలి, ఆ తర్వాతే ఓటింగ్ ప్రక్రియను కొనసాగించాలి. ఏ ఒక్క అర్హులైన ఓటరు కూడా విస్మరించబడకుండా ఎన్నికల సంఘం తప్పక చర్యలు తీసుకోవాలి' అని సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ నాయకుడు పేర్కొన్నారు. తమిళనాడులో తమ పార్టీ డిఎంకెతో పొత్తులో ఉన్నప్పటికీ, 15 స్థానాల్లో మాత్రం స్వతంత్రంగా పోటీ చేస్తుందని ఆయన తెలిపారు. 'కేరళలో మేము ఏ రాజకీయ పార్టీతోనూ పొత్తు పెట్టుకోలేదు. తిరువనంతపురం, త్రిశూర్, కన్నూర్ అసెంబ్లీ స్థానాల్లో స్వయంగా పోటీ చేస్తాము, మిగిలిన స్థానాల్లో వామపక్ష అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తాము' అని భట్టాచార్య జోడించారు.

### మూడు నెలల్లోపు పిల్లల దత్తతకు మాత్రమే...

## ప్రసూతి సెలవును పరిమితంచేసే చట్టం 'సుప్రీం' కొట్టివేత

### దత్తత తీసుకున్న తల్లి 12వారాల ప్రసూతి సెలవుకు అర్హురాలని తీర్పు

**న్యూఢిల్లీ :** ప్రసూతి సెలవు విషయంలో అత్యున్నత న్యాయస్థానం కీలక తీర్పును వెలువరించింది. మూడు నెలల కంటే ఎక్కువ వయసున్న బిడ్డను ఒక మహిళ దత్తత తీసుకుంటే ఆమెకు ప్రసూతి సెలవులను నిరాకరించడం సహేతుకం కాదని సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తన తీర్పులో స్పష్టంచేసింది. దత్తత అనేది పునరుత్పత్తి స్వేచ్ఛ హక్కులో భాగమని గమనించిన సుప్రీంకోర్టు, మూడు నెలలలోపు వయసున్న బిడ్డను చట్టబద్ధంగా దత్తత తీసుకున్న మహిళ ప్రసూతి సెలవుకు అర్హత పొందుతుందని పేర్కొన్న చట్టాన్ని మంగళవారం కొట్టివేసింది. న్యాయమూర్తులు జస్టిస్ జె.బి.పార్ధివాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం దత్తత తీసుకున్న బిడ్డ వయసుతో సంబంధం లేకుండా, దత్తత తీసుకున్న తల్లి 12 వారాల (మూడు నెలలు) ప్రసూతి సెలవుకు అర్హత కలిగి ఉంటుందని తీర్పు ఇచ్చింది. 2020 కోడ్ సెక్షన్ 60(4), దత్తత ద్వారా ప్రసూతి ప్రయోజనాలను పొందేందుకు, దత్తత తీసుకున్న బిడ్డ వయసుపై మూడు నెలల పరిమితిని విధించడం, రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 21లను ఉల్లంఘిస్తోందని ధర్మాసనం పేర్కొంది. పితృత్వ సెలవును సామాజిక భద్రతా ప్రయోజనంగా గుర్తించే నిబంధనను తీసుకురావాలని సుప్రీంకోర్టు కేంద్రాన్ని కోరింది.మూడు నెలల కంటే తక్కువ వయసున్న బిడ్డను దత్తత తీసుకుంటేనే 12వారాల ప్రసూతి సెలవును అనుమతించే సామాజిక నియమావళిలోని సెక్షన్ 60 (4)ను సవాల్ చేస్తూ హంసానందిని నందూరి దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఈ తీర్పు నిచ్చింది.

### అమెరికాతో వాణిజ్య ఒప్పందం రద్దు చేసుకున్న మలేషియా

## భారత్ ఎందుకు చురుకుగా వ్యవహరించడం లేదు?

### ప్రధాని మోదీని ప్రశ్నించిన కాంగ్రెస్

**న్యూఢిల్లీ :** అమెరికాతో కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాన్ని మలేషియా రద్దు చేసుకున్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారతదేశపు గౌరవాన్ని త్యాగం చేస్తూ చేతులు కట్టుకుని కూర్చోడానికే సంతృప్తి చెందినట్లు కనిపిస్తున్నారని, భారతదేశం మలేషియా మాదిరిగా ఎందుకు అంత చురుకుగా వ్యవహరించడం లేదని కాంగ్రెస్ మంగళవారం ప్రశ్నించింది. అమెరికాతో కుదుర్చున్న ఒప్పందాన్ని రద్దు చేసుకున్న తొలిదేశంగా మలేషియా నిలిచిందని కాంగ్రెస్ మీడియా, పబ్లిసిటీ విభాగం అధిపతి పవన్ ఖేరా వెల్లడించారు. 2025 అక్టోబరు 26న మలేషియా అమెరికాతో ఈ ఒప్పందంపై సంతకం చేసింది. మలేషియాతో భారతదేశానికి పూర్తి స్థాయి ఒప్పందం జరిగిన దాఖలాలు కూడా లేవని, అయినప్పటికీ భారత్‌కు వ్యతిరేకమైన ఆ వాణిజ్య ఒప్పందం భవితవ్యంపై ప్రభుత్వం ఎలాంటి స్పష్టతా ఇవ్వలేదు. కేవలం అజ్ఞాత వ్యక్తుల ద్వారా వదంతులు మాత్రమే వ్యాప్తి చెందాయని ఆయన చెప్పారు. ఇది చాలదన్నట్లుగా దిగుమతులను అరికట్టడంలో విఫలమైనందుకు , బలవంతపు కార్మిక వ్యవస్థపై అమెరికా భారత్‌పై రెండు 301 విచారణలను ప్రారంభించగా, అధిక పారిశ్రామిక సామర్థ్యం, తయారీలో వక్రీకరణలపై రెండవ విచారణను ప్రారంభించింది అని పవన్ ఖేరా తెలిపారు.



కానీ భారతదేశ భవిష్యత్తును వాషింగ్టన్ నిర్ణయిస్తుండగా, ప్రధానమంత్రి మోదీ, పియూష్‌గోయల్ భారతదేశ గౌరవాన్ని త్యాగం చేస్తూ సంతృప్తిగా కూర్చున్నట్లున్నారు. తన భవిష్యత్తును నిర్ణయించుకోవడంలో భారతదేశం మలేషియా మాదిరిగా ఎందుకు చురుకుగా వ్యవహరించడం లేదని పవన్‌ఖేరా ప్రశ్నించారు. మోదీ అమెరికా కోసం ఎందుకింత కష్టాన్ని భరిస్తున్నారు?. 1993నుంచే అమెరికాకు మోదీ రహస్యాలు తెలుసు కాబట్టేనా? అని ఖేరా ప్రశ్నించారు. అమెరికా కొత్త ప్రపంచ సుంకాల విధానం అమలులోకి వచ్చిన తర్వాతే భారత్‌అమెరికాల మధ్య మధ్యంతర వాణిజ్య ఒప్పందం సంతకాలు జరుగుతాయని ఒక సీనియర్ ప్రభుత్వ అధికారి చెప్పిన ఒక రోజు తర్వాత పవన్‌ఖేరా ఈ వ్యాఖ్యలు చేశారు.

## నా కలను నెరవేరుస్తారా?

- సినీనటి నయనతారపై అన్నా డిఎంకె ఎంపి అనుచిత వ్యాఖ్యలు



**చెన్నై :** అన్నా డిఎంకె రాజ్యసభ ఎంపి సి. వేణుగోపాల్ షణ్ముగం వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. తనకు హీరోయిన్ నయనతార కావాలని, ఈ కోరికను తీరుస్తారా అని సిఎం స్టాలిన్‌ను ఆయన ప్రశ్నించారు. ఎవరికైనా నయనతారను పెళ్లి చేసుకోవాలని ఉంటే, ఆ కోరికను ముఖ్యమంత్రి నెరవేరుస్తారా అని అడిగారు. సిఎం స్టాలిన్ తాజాగా ప్రకటించిన 'మీ కలను మాతో చెప్పండి' కార్యక్రమాన్ని ఉద్దేశించి వేణుగోపాల్ షణ్ముగం ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు ఇంటింటికి తిరిగి, ప్రభుత్వం నుంచి ప్రజలు కోరుకునే అంశాలను, పాలనపై ఇచ్చే సలహాలు, సూచనలను తెలుసుకుంటారు. డిఎంకె ప్రభుత్వ పాలనా వైఫల్యం, మహిళలపై నేర ఘటనల పెరుగుదల, శాంతిభద్రతలకు భంగం వాటిల్లడం వంటి అంశాలపై రాష్ట్రవ్యాప్తంగా అన్నాడిఎంకె నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా తన సొంత జిల్లా విల్లుపురంలో జరిగిన నిరసన కార్యక్రమం వేదికగా రాజ్యసభ ఎంపి వేణుగోపాల్ షణ్ముగం ఈ కామెంట్స్ చేశారు. ఆయన వ్యాఖ్యలను డిఎంకె వర్గాలు తీవ్రంగా తప్పుపట్టాయి. రాష్ట్ర ప్రభుత్వ విధానాలను ఎవరైనా విమర్శించొచ్చని, కానీ మహిళలపై అశ్లీల వ్యాఖ్యలు చేయడం సరికాదని డిఎంకె అధికార ప్రతినిధి డాక్టర్ సయ్యద్ హాఫీజుల్లా హితవు పలికారు. నయనతార గురించి అలా మాట్లాడటం ద్వారా, యావత్ మహిళా లోకాన్ని ఎంపి షణ్ముగం అవమానించారన్నారు. నాగరిక సమాజంలో ఇలాంటి వ్యాఖ్యలు ఆమోదయోగ్యం కావని పేర్కొన్నారు. మహిళల గురించి ఇలా మాట్లాడినందుకు వేణుగోపాల్ షణ్ముగంపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నా డిఎంకె పార్టీకి ఆయన సూచించారు.

### ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో


## రూ. 81,500 కోట్ల నరేగా నిధులు విడుదల



**న్యూఢిల్లీ :** ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు ఎంజి నరేగా ఉపాధి పథకం కింద రాష్ట్రాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు రూ. 81,500 కోట్లకు పైగా నిధులు విడుదల చేసినట్లు ప్రభుత్వం మంగళవారం తెలిపింది. వేతన చెల్లింపులు ప్రత్యక్ష బదిలీ విధానం ద్వారా నిరంతర ప్రాతిపదికన జరుగుతున్నాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి కమలేష్ పాశ్వాన్ లోక్‌సభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఈనెల 11, 2026 నాటికి రాష్ట్రాలవ్యాప్తంగా చెల్లించాల్సిన బకాయిలు సుమారు రూ. 18,862 కోట్లుగా ఉన్నాయని తెలిపారు. ఇందులో వేతనాల కోసం రూ. 8,688.29 కోట్లు, సామాగ్రి కోసం రూ. 9,692.28 కోట్లు, పరిపాలనా సంబంధిత అంశాల కోసం రూ. 502.42 కోట్లు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఈనెల 11, 2026 నాటికి, 202526 ఆర్థిక సంవత్సరంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజినరేగా) కింద మొత్తం రూ. 81,502.62 కోట్లు విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. ఇందులో వేతన చెల్లింపుల కోసం రూ. 65,875.13 కోట్లు, సామాగ్రి, పరిపాలనా సంబంధిత అంశాల కోసం రూ. 15,627.48 కోట్లు ఉన్నాయని ఆయన వివరించారు. పశ్చిమ బెంగాల్ మినహా, 202425 ఆర్థిక సంవత్సరం వరకు చెల్లించాల్సిన, ఆమోద యోగ్యమైన వేతన బకాయిలన్నీ ఇప్పటికే పూర్తిగా చెల్లించబడ్డాయని సహాయ మంత్రి తెలిపారు. ప్రభుత్వ వివరాల ప్రకారం, కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను పాటించనందున, చట్టంలోని సెక్షన్ 27 నిబంధనల మేరకు మార్చి 9, 2022 నుండి పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి ఎంజి నరేగా కింద నిధుల విడుదల నిలిపివేసింది. పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి సంబంధించి 2021–22 ఆర్థిక సంవత్సరపు 'కార్మిక బడ్జెట్'ను పెంచాలన్న ప్రతిపాదనను, గ్రామీణాభివృద్ధి శాఖ జారీ చేసిన ఆదేశాలను పాటించనందువల్ల, ఆ శాఖకు చెందిన ఎంజి నేరగా సాధికార కమిటీ ఆమోదించలేదని ఆయన తెలిపారు. ప్రభుత్వపు 'నరేగాసాఫ్ట్' ఇ–గవర్నెన్స్ వేదిక ప్రకారం, పశ్చిమ బెంగాల్‌కు సంబంధించిన పెండింగ్ బకాయిల మొత్తం (08.03.2022 నాటికి) రూ. 3082.52 కోట్లుగా ఉంది. ఇందులో వేతనాల విభాగానికింద రూ. 1457.22 కోట్లు, సామాగ్రి విభాగానికింద రూ. 1607.68 కోట్లు, పరిపాలన విభాగానికింద రూ. 17.62 కోట్లు ఉన్నాయి. ఈ బకాయిల చెల్లింపు అర్హత, కేంద్ర ప్రభుత్వం చేపట్టే పరిశీలనకు లోబడి ఉంటుందని మంత్రి తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లో అధికారంలో ఉన్న తృణమూల్ కాంగ్రెస్ పార్టీ, ఇప్పటికే పూర్తి చేసిన పనులకు సంబంధించి చెల్లించాల్సిన బకాయిలలో వేతనాల విభాగానికింద రూ. 3,700 కోట్లు, వేతనేతర విభాగానికింద రూ. 3,200 కోట్లు ఉన్నాయని పేర్కొంది. ఈ పథకం అమలు జరగని కాలానికి సంబంధించి కేంద్రం చెల్లించాల్సిన అంచనా బకాయిల మొత్తం, వేతనాల విభాగానికింద రూ. 28,400 కోట్లుగానూ, వేతనేతర విభాగానికింద రూ. 16,400 కోట్లుగానూ ఉంటుందని టిఎంసి తెలిపింది. టిఎంసి అంచనా ప్రకారం, పశ్చిమ బెంగాల్‌కు సంబంధించి ఎంజి నరేగా కింద చెల్లించాల్సిన మొత్తం పెండింగ్ బకాయిలు రూ. 51,700 కోట్లుగా ఉన్నాయి.

## ఉత్కంఠ రేపిన హర్యానా రాజ్యసభ ఎన్నికలు

### సంజయ్ భాటియా, కరమ్‌వీర్ సింగ్ గెలుపు



**చండీగఢ్ :** హర్యానాలో జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో ఉత్కంఠ పోరు సాగింది. అయితే బిజెపి నుంచి సంజయ్ భాటియా, కాంగ్రెస్ పార్టీ నుంచి కరమ్‌వీర్ సింగ్ బోద్ విజయం సాధించారు. క్రాస్ ఓటింగ్ జరిగినట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో హర్యానా ఎన్నికలపై అందరి దృష్టి పడింది. ఆ రాష్ట్రం నుంచి రెండు సీట్లే ఖాళీ ఉండగా, ఇండిపెండెంట్ అభ్యర్థిగా సతీశ్ నందల్ పోటీ చేశారు. సతీశ్‌కు బిజెపి మద్దతుగా నిలిచింది. సోమవారం అర్థరాత్రి వరకు ఈ రేసు ఆసక్తికరంగా సాగింది. అర్థరాత్రి సిఎం నయాబ్ సింగ్ సైని ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. విజయం సాధించిన ఇద్దరు అభ్యర్థులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. బిజెపి మద్దతు ఇచ్చిన సతీశ్ నందల్ స్వల్ప తేడాతో కాంగ్రెస్ అభ్యర్థి చేతిలో ఓడినట్లు సిఎం సైని పేర్కొన్నారు. ఐదుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు క్రాస్ ఓటింగ్ చేశారని, మరో నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఓట్లను అనర్హమైనవిగా ప్రకటించినట్లు సైని చెప్పారు. క్రాస్ ఓటింగ్‌కు పాల్పడిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకుంటామని కాంగ్రెస్ పార్టీ నేత బికె హరి ప్రసాద్ తెలిపారు.తమ అభ్యర్థిని ఓడించేందుకు బిజెపి తీవ్రంగా ప్రయత్నించినట్లు కాంగ్రెస్ నేత భూపిందర్ సింగ్ హుడా ఆరోపించారు. కానీ ఆ అగ్నిపరీక్షలో నెగ్గినట్లు చెప్పారు. రాజ్యసభ ఎన్నికల పోలింగ్‌కు ముందు ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పార్టీ హిమాచల్ ప్రదేశ్‌కు తీసుకెళ్లిందని సిఎం సైని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ తన ఎమ్మెల్యేలను నమ్మడం లేదని ఆయన అన్నారు. ఓటింగ్‌కు దూరంగా ఉన్న ఐఎన్ఎల్‌డి పార్టీపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌కు బి టీమ్‌గా ఆ పార్టీ వ్యవహరించిందన్నారు.

# బెంగాల్‌లో 19 మంది సీనియర్ పోలీస్ అధికారులు బదిలీ

**కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ ఎన్నికల సంఘం రాష్ట్ర అధికార యంత్రాంగాన్ని పునర్వ్యవస్థీకరిస్తోంది. సోమవారం సిఎస్, డిజిపిపై వేటు వేసిన ఎన్నికల సంఘం తాజాగా పోలీసు వ్యవస్థలో బదిలీలు చేపట్టింది. ఇద్దరు ఎడిజిలతో సహా 19 మంది సీనియర్ పోలీసు అధికారులను బదిలీ చేయాలని ఎన్నికల సంఘం మంగళవారం ఆదేశించింది. ఐపిఎస్ అధికారి రాజేష్ కుమార్ సింగ్‌ను దక్షిణ బెంగాల్‌కు కొత్త అదనపు డైరెక్టర్ జనరల్ (ఎడిజి)గా నియమించగా, కె. జయరామన్‌ను ఉత్తర బెంగాల్ ఎడిజిగా నియమించారు. వీరిద్దరూ 1997 బ్యాచ్‌కు చెందిన అధికారులే అని ఒక ప్రకటనలో పేర్కొంది. అసన్‌సోల్–దుర్గాపూర్, హౌరా, బర్రాక్‌పూర్, చందానగర్ ప్రాంతాలకు కొత్త పోలీసు కమిషనర్లు (సిపి) నియమితులయ్యారు. పశ్చిమ బర్ధమాన్‌లోని అసన్‌సోల్–దుర్గాపూర్‌కు ప్రణవ్ కుమార్ కొత్త సిపిగా, హౌరాకు అఖిలేష్ కుమార్ చతుర్వేది సిపిగా, ఉత్తర 24 పరగణాలలోని బ్యారక్‌పూర్‌కు అమిత్ కుమార్ సింగ్ కొత్త సిపిగా, హుగ్లీ జిల్లాలోని చందన్‌నగర్‌కు సునీల్ కుమార్ యాదవ్ సిపిగా నియమితులయ్యారు. ఈ తాజా బదిలీల ప్రక్రియలో 12 జిల్లాల పోలీసు సూపరింటెండెంట్లు (ఎస్‌పి) కూడా బదిలీ అయ్యారు. బారాసత్‌కు పుష్ప, కూచ్ బెహార్‌కు జస్‌ప్రీత్ సింగ్, బీర్‌భూమ్‌కు సూర్య ప్రతాప్ యాదవ్, హుగ్లీ గ్రామీణ ప్రాంతానికి కుమార్ సన్నీ రాయ్, డైమండ్ హార్బర్‌కు ఇషాని పాల్, ముర్షిదాబాద్‌కు సచిన్, బసిర్‌హాట్‌కు అలకానంద భోవాల్, మాల్దాకు అనుపమ్ సింగ్, పూర్వ మేదినీపూర్‌కు అన్నుమాన్ సాహా, జంగీపూర్‌కు సురిందర్ సింగ్ ఎస్‌పిలుగా నియమితులయ్యారు. ఇస్లాంపూర్‌కు కొత్త ఎస్‌పిగా రాకేష్ సింగ్, పశ్చిమ మేదినీపూర్‌కు ఎస్‌పిగా పాపియా సుల్తానా నియమితులయ్యారు. వైఎస్ జగన్నాథరావును కోల్‌కతా పోలీసుల డిసిపి (సెంట్రల్)గా నియమించారు. 'పారదర్శకంగా, భయం లేకుండా, హింసకు తావులేకుండా, ప్రలోభాలకు అతీతంగా ఎన్నికలను నిర్వహించడానికి ఎన్నికల సంఘం కట్టుబడి ఉంది' అని ఒక అధికారి తెలిపారు. ఈ ఆదేశాన్ని తక్షణమే అమలు చేయాలని ఎన్నికల సంఘం (ఇసి) ఆదేశించింది. బదిలీ అయిన అధికారులను ఎన్నికల విధుల నుండి మినహాయిస్తూ, మార్చి 18వ తేదీ ఉదయం 11 గంటల లోపు ఈ ఆదేశాల అమలు నివేదికను సమర్పించాలని కోరినట్లు ఆ ప్రకటన పేర్కొంది. ఆదివారం ఎన్నికల తేదీలు ప్రకటించిన వెంటనే, ఎన్నికల సంఘం ప్రధాన కార్యదర్శి నందిని చక్రవర్తిని, హోం కార్యదర్శి జగదీష్ ప్రసాద్ మీనాను బదిలీ చేసింది. ఆ తర్వాత, డిజిపి పీయూష్ పాండేను, కోల్‌కతా సిపి సుప్రతీమ్ సర్కార్‌ను కూడా వారి పదవుల నుండి తొలగించింది. 294 మంది సభ్యులు కలిగిన పశ్చిమ బెంగాల్ శాసనసభ ఎన్నికలు ఏప్రిల్ 23, 29 తేదీలలో రెండు దశల్లో జరగనున్నాయి. మే 4న ఓట్ల లెక్కింపు జరుగుతుంది.



## జెడియుని వీడిన కె.సి త్యాగి



**న్యూఢిల్లీ :** జెడియు సీనియర్ నేత కె.సి. త్యాగి పార్టీని వీడినట్లు ప్రకటించారు. తన తదుపరి కార్యాచరణను త్వరలోనే నిర్ణయించుకుంటానని తెలిపారు. సమతా పార్టీ, జనతా దళ్ విలీనంతో అక్టోబర్ 2003లో జెడియు ఆవిర్భవించినప్పటి నుండి త్యాగి ఆ పార్టీతో అనుబంధం కలిగి ఉన్నారు. ఆయన జెడియులో ప్రధాన కార్యదర్శి, ప్రధాన అధికార ప్రతినిధి, రాజకీయ సలహాదారుతో సహా వివిధ హోదాల్లో సేవలందించారు. 'అవును, నేను పార్టీని వీడాను' అని ప్రశ్నించినప్పుడు త్యాగి పిటిఐకి చెప్పారు. 'పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ముగిసింది. ఈసారి నేను పార్టీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకోలేదు' అని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అయితే, అణగారిన వర్గాలు, రైతులు, వ్యవసాయదారులతో సహా సమాజంలోని వంచనకు గురైన వర్గాల ప్రయోజనాలకు సంబంధించిన 'విశాలమైన, విస్తృతమైన సిద్ధాంతపరమైన అంశాల' పట్ల తన నిబద్ధత ఎప్పటిలాగే దృఢంగా కొనసాగుతుందన్నారు. దాదాపు అర్ధ శతాబ్దం పాటు నా సహచరుడిగా కొనసాగిన నితీష్ కుమార్ పట్ల వ్యక్తిగత గౌరవం కూడా ఏమాత్రం మారలేదన్నారు. 'సంబంధిత వ్యక్తులందరితో సంప్రదించిన తర్వాత తన తదుపరి కార్యాచరణ త్వరలోనే ప్రకటిస్తానని త్యాగి చెప్పారు. 'నా రాజకీయ మిత్రులు, సానుభూతిపరులు, కార్యకర్తలలో కొందరు, దేశంలోని రాజకీయ పరిస్థితులపై చర్చించడానికి ఈనెల 22న రఫీ మార్గ్‌లోని మావ్లాంకర్ హాల్‌లో ఏకాభిప్రాయం కలిగిన వ్యక్తుల సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నారు' అని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు. భారతరత్న చౌదరి చరణ్ సింగ్ జీ, డాక్టర్ రామ్ మనోహర్ లోహియా జీ, భారతరత్న కర్పూరి ఠాకూర్ జీల ఆలోచనలు, సిద్ధాంతాల నుండి స్ఫూర్తి పొందుతూనే ఉంటామని ఆ సీనియర్ సోషలిస్ట్ నాయకుడు పేర్కొన్నారు.

## అసెంబ్లీ ఎన్నికలకు 1,111 మంది పరిశీలకులు : ఇసి




**న్యూఢిల్లీ :** వచ్చే నెలలో జరగనున్న రాష్ట్ర శాసన సభ ఎన్నికలు, ఉప ఎన్నికల కోసం ఎన్నికల సంఘం (ఇసి) 1,111 మంది పరిశీలకులను నియమించింది. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, అసోం, కేరళ, పుదుచ్చేరి శాసనసభలకు ఎన్నికలు జరుగుతుండగా, పలు రాష్ట్రాల్లో ఏప్రిల్‌లో ఉప ఎన్నికలు కూడా జరగనున్నాయి. ఈ పరిశీలకులు ఇసికి కళ్లు, చెవులుగా వ్యవహరిస్తూ, ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేలా చూస్తారని ఎన్నికల సంఘం తెలిపింది. గురువారం నాటికి పరిశీలకులు తమ తమ శాసనసభ నియోజకవర్గాల్లో ఉండాలని ఇసి ఆదేశించింది. అక్కడికి చేరుకున్న తర్వాత, పరిశీలకులు తమ సంప్రదింపు వివరాలను బహిరంగపరుస్తారని, అలాగే, అభ్యర్థులు, రాజకీయ పార్టీలు లేదా వారి ప్రతినిధులు లేదా ప్రజలలోని ఎవరైనా కలిసి ఎన్నికల సంబంధిత సమస్యలను వినడానికి ప్రతిరోజూ ఒక నిర్దిష్ట సమయాన్ని కేటాయిస్తారని ఇసి తెలిపింది.

**సర్టిఫికెట్స్ పోయినవి**

నేను, **మాడుగుల నిరంజన్ తండ్రి సాంబయ్య,** ఇ.నెం. 2-78, మహేశ్వరం గ్రామం, నర్సంపేట మండలం, వరంగల్ జిల్లా. నేను మా ఇంటి నుండి నర్సంపేట ఎంఆర్‌ఓ ఆఫీస్‌కు మోటార్ సైకిల్‌పై వస్తుండగా మార్గమధ్యంలో బండి ట్యాంక్ కవర్ నుండి నా యొక్క **ఎస్.ఎస్.సి మెమో (HT No. 515417)** మరియు **ఇంటర్‌మీడియట్ మెమో (HT No. 713945)** ఒరిజినల్ సర్టిఫికెట్స్ జారి పోయినవి. కావున దొరికిన వారు ఈ నంబర్ **9849606670** తెలుపగలరని మనవి.

ఇట్లు
**మాడుగుల నిరంజన్ తండ్రి సాంబయ్య,**
మహేశ్వరం గ్రామం,
నర్సంపేట మండలం, వరంగల్ జిల్లా.

# ప్రజాస్వామ్య విలువలకు గండి!

ఏ ఒక్క అవకాశాన్నీ విడిచిపెట్టకుండా, కేంద్రంలోని బిజెపి సర్కారు ప్రజాస్వామ్య విలువలకు గండి కొడుతునే ఉంది. భారత ఎన్నికల సంఘం (ఇసిఐ)నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతానికి ప్రకటించిన అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ తీరు ఈ విషయాన్ని మరోసారి స్పష్టం చేసింది. అస్సాం, కేరళలతోపాటు కేంద్రపాలిత ప్రాంతం పాండిచ్చేరిలో ఎన్నికలను ఏప్రిల్ 9న ఒకే విడతలో నిర్వహించాలని నిర్ణయించిన ఇసిఐ, తమిళనాడు లో దాదాపు రెండు వారాల తర్వాత ఒకే విడతతోపాటు, పశ్చిమ బెంగాల్‌లో మొదటి విడత పోలింగ్‌కు అంత సమయం తీసుకోవడం అనుమానాలకు తావిస్తున్నది. 'ఒకే దేశం.. ఒకే ఎన్నిక' అంటూ నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రయత్నాలు చేసినప్పుడు, 'సిద్ధం' అని ప్రకటించిన ఇసిఐకి కేవలం నాలుగు రాష్ట్రాల్లో ఎన్నికలకు రెండు వారాల సుదీర్ఘ విరామం అవసరమా? అంతేకాదు, పశ్చిమ బెంగాల్‌లో చీఫ్ సెక్రెటరీ, హోమ్ సెక్రటరీ, డిజిపిసహా పలువురు అత్యున్నత అధికారుల బదిలీ వెనక ఆంతర్యం ఏమిటి? నిజానికి, ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడమే ఇసిఐ అహంకార ధోరణికి నిదర్శనం. ఫిబ్రవరి 28న తుది ఓటర్ల జాబితా ప్రచురించిన తరువాత కూడా, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు పశ్చిమ బెంగాల్‌లో 'సర్' ప్రక్రియ ఆగలేదు. 60లక్షల మంది ఓటర్ల భవిష్యత్తు అనిశ్చితిలోకి జారుకుంది. చట్టం ప్రకారం ఎన్నికల షెడ్యూల్ ప్రకటించే ముందే సంపూర్ణ ఓటర్ల జాబితా సిద్ధంగా ఉండాలి. అయితే ఈ నిబంధనను పక్కన పెట్టి, కేంద్ర ప్రభుత్వం తమ అజెండాను ముందుకు నెట్టినట్టు కనిపిస్తున్నది. ఎన్నికల్లో పోటీ చేయడం ఒక పౌరుని హక్కు, ఓటు వేయడం ఎంత ముఖ్యమో అదీ అంతే ముఖ్యమైనది. కానీ చాలామంది తమ పేర్లు సమయానికి జాబితాలో లేకపోవడం వల్ల పోటీ చేయలేకపోతారు. మరికొందరు ఓటు కూడా వేయలేకపోతారు. ఎన్నికల సంఘం ప్రకటన ప్రకారం పశ్చిమ బెంగాల్‌లో సందేహాస్పద ఓటర్లపై విచారణ జరుగుతుంది. అదే సమయంలో అనుబంధ ఓటర్ల జాబితాలు విడుదల అవుతాయి. షెడ్యూల్ ప్రకటించే సమయంలో, ఈ అనుబంధ జాబితా క్రమంగా విడుదల అవుతుందని, పేర్లు వచ్చేకొద్దీ వాటిని జాబితాలో చేరుస్తామని ఇసిఐ ప్రకటించడం విడ్డూరం. ఒకటికాదు.. రెండుకాదు.. ఏకంగా 60లక్షలకుపైగా పేర్లు ఇంకా అనిశ్చితిలో ఉన్న సమయంలోనే ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేయడంలో ఆంతర్యం ఏమిటి? దేశ చట్టాల ప్రకారం, ఓటర్ల జాబితా పూర్తిగా సిద్ధం కాకుండా ఎన్నికలను ప్రకటించడం నిషిద్ధం. కానీ పశ్చిమ బెంగాల్ సందర్భంలో జరుగుతున్నది చట్ట విరుద్ధం. అసంపూర్తి జాబితాను తుది జాబితాగా చూపిస్తూ ఎన్నికలను నిర్వహించే ప్రయత్నం. బెంగాల్‌లో పాగా వేయాలని చాలాకాలంగా ప్రయత్నిస్తున్న బిజెపి ఆడుతున్న నాటక ప్రహసనం. అస్సాం, కేరళ, పాండిచ్చేరి ఎన్నికల తర్వాత ఎక్కువ సమయం తీసుకోవడం బిజెపి వ్యూహాత్మక ఎత్తుగడ కావచ్చు. అత్యున్నత అధికారుల బదిలీ ఈ అనుమానాన్ని బలపరుస్తుంది. రెండు వారాల వ్యవధి లో ఏదైనా జరగవచ్చు... ఏమైనా చేయవచ్చు.. అనే ధీమా కేంద్రానికి ఉండవచ్చు. రాజ్యాంగ వ్యవస్థలను పార్టీ అనుబంధ సంస్థలుగా మార్చుకున్నదని ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న ఆరోపణలు కేవలం విమర్శలు కావని ఇసిఐ తీసుకున్న నిర్ణయం రుజువు చేస్తున్నది.

తమిళనాడులో నటుడు విజయ్ పార్టీ 'తమిళగ వెట్రి ఖజగం' (టివికె) తో పొత్తుకు తహతహలాడుతున్న బిజెపి, అస్సాం, కేరళ, పాండిచ్చేరి ఎన్నికల తర్వాత బేరసారాలకు దిగినా ఆశ్చర్యం లేదు. తమిళనాడులో పట్టు సంపాదిస్తే, ఆ తర్వాత దక్షిణ భారత దేశంలో పాగా వేయవచ్చన్నది బిజెపి ఆంతర్యం కావచ్చు. పరిస్థితులను చూస్తుంటే, ఈ అనుమానం కలగక మానదు. ఏదిఏమైనా, మోదీ ప్రభుత్వం తన ఎజెండాను ముందుకు తీసుకెళుతున్నట్టు కనిపిస్తున్నది. బిహార్‌లో 'సర్' చెల్లుబాటుపై తుది తీర్పు రాకముందే ఎన్నికలు జరిగాయి. వేలాదిమంది ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోయారు. న్యాయం ఆలస్యమైతే అది అన్యాయమే అవుతుందనే లోకోక్తి బిహార్‌లో రుజువైంది. ఇప్పుడు పశ్చిమ బెంగాల్‌లోనూ అదే పరిస్థితి కనిపిస్తున్నది. అసంపూర్తి ఓట్ల జాబితాతోనే ఎన్నికల ప్రకటన వెలువడింది. ఒకవైపు విచారణలు కొనసాగుతునే ఉన్నాయి. మరోవైపు నామినేషన్ల చివరి రోజుకే తుది అనుబంధ జాబితా వస్తుంది. అంటే ఓటు కోల్పోయేవారు... ఎన్నికల్లో పోటీ చేయలేకపోయే వారు ఎక్కువగానే ఉండవచ్చు. ప్రజలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకొని, ప్రజల కోసం పనిచేస్తూ, న్యాయబద్ధంగా ఓట్లు సంపాదించడం ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలం. అన్ని రాజకీయ పార్టీలు తప్పక అనుసరించాల్సిన మార్గం. కానీ, అధికారం కోసం బిజెపి ఎంతకైనా తెగిస్తుందని ఎన్నో సందర్భాల్లో రుజువైంది. బిహార్‌లో నితీష్ కుమార్‌ను పావుగా వాడుకున్న తీరు రాజకీయ నైతికత పతనమవుతున్నదనడానికి నిలువెత్తు నిదర్శనం. యంత్రాంగాన్ని సమాయత్తం చేయడం కోసమే, అస్సాం, కేరళ, పాండిచ్చేరి పోలింగ్ తర్వాత ఇసిఐ రెండు వారాల సమయం తీసుకుందనుకుంటే, జమిలీ ఎన్నికలను ఏ విధంగా నిర్వహిస్తుందనేది ప్రశ్న.

లోక్‌సభతోపాటు, దేశంలోని అన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు జరిపే సత్తా ఉన్న ఇసిఐకి ఇంత వ్యవధి అవసరమా? 'సర్' అంశాన్ని తెరపైకి తీసుకొచ్చి, అర్హులకు ఓటు హక్కు కల్పించడమే లక్ష్యమని కేంద్రం చెప్తున్నప్పటికీ, ఏదో ఒక మార్గంలో అధికారాన్ని చేజిక్కించుకోవడమే లక్ష్యంగా కనిపిస్తున్నది. ఎన్నికల షెడ్యూల్‌లో భారీ వ్యవధి నుంచి పశ్చిమ బెంగాల్‌లో ఉన్నతాధికారుల బదిలీ వరకూ ఇసిఐ నిర్ణయాలు అనుమానాలను తావిస్తున్నాయి. ఇసిఐ స్వయంగానే ఈ నిర్ణయాలు తీసుకుందా లేక కేంద్ర ప్రభుత్వ జోక్యం ఉన్నదా? అనేది ప్రశ్న. వ్యవస్థల ప్రవర్తనపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. అన్యాయం జరుగుతున్నా, అదే ప్రక్రియ కొనసాగుతుండటం ప్రజాస్వామ్యంపై నమ్మకాన్ని దెబ్బతీస్తోంది. మొత్తం మీద, అసంపూర్తి ఓటర్ల జాబితాను తుది జాబితాగా ప్రకటించి, ఎన్నికలు నిర్వహించడం, తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లో పోలింగ్‌ను ఆలస్యం చేయడం ఇసిఐ చిత్తశుద్ధిని ప్రశ్నిస్తున్నాయి. పశ్చిమ బెంగాల్‌లో అధికారుల బదిలీల తో స్వేచ్ఛా, నిష్పక్షపాత ఎన్నికలపై నీలినీడలు అలముకున్నాయి. అన్ని గమనిస్తున్న ఓటర్లు ఎలాంటి తీర్పునిస్తారో చూడాలి.



## పాక్ దాడిని ఖండిస్తున్నాం

అఫ్గానిస్థాన్‌లోని ఆస్పత్రిపై పాకిస్థాన్ వైమానిక దాడులు తీవ్రంగా ఖండించదగినవి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ముస్లింలు శాంతి, ఆత్మపరిశీలన, కరుణతో గడిపే పవిత్ర రంజాన్ మాసంలో ఈ దాడి జరగడం దారుణం. ఒక ఆసుపత్రిని అందులోని రోగులను లక్ష్యంగా చేసుకోవడాన్ని ఏ మతమూ, ఏ చట్టమూ, ఏ నైతికతా సమర్థించలేవు. ఈ నేరపూరిత చర్యకు పాల్పడిన వారిని జవాబుదారీగా చేయాలి. ఆఫ్గానిస్థాన్‌లో పౌరులపై పాకిస్థాన్ చేస్తున్న విచక్షణారహిత దాడులను వెంటనే ఆపేలా అంతర్జాతీయ సమాజం కృషి చేయాలి. మృతుల కుటుంబాలకు భారత్ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తుంది. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తుంది. ఈ విషాద సమయంలో ఆఫ్గానిస్థాన్ ప్రజలకు భారత్ సంఘీభావంగా నిలుస్తుంది.

– ఐక్యరాజ్యసమితిలో భారత శాశ్వత ప్రతినిధి హరీశ్ పర్వతనేని



## రక్షణ రంగానికి ఆయుధాలను అందిస్తున్న ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీలు

దేశ రక్షణలో అహరహం తలమునకలైన త్రివిధ దళాలు భారతీయ ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్, నావికా బలగాలకు ఆయుధ శక్తిని నింపుతున్న ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీలు గత రెండు శతాబ్దాలకు పైగా అవిశ్రాంత అమూల్య సేవలను అందిస్తున్నాయి. మన దేశ త్రివిధ దళాలకు అవసరమయ్యే ఆయుధాలు, మందుగుండు సామాగ్రి, రక్షణ కు వినియోగించే ఎలక్ట్రానిక్ ఉపకరణాలను స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేసే ప్రభుత్వ రక్షణరంగ సంస్థగా ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీలు అమూల్య సేవలను అందిస్తున్నా యి. భారత దేశ త్రివిధ సాయుధ దళాల వెనుక ఆయుధ శక్తిగా తన విశిష్టతల ను ప్రదర్శిస్తున్న ఆర్డ్‌నన్స్ ఫ్యాక్టరీల చరిత్ర చాలా గొప్పది. వలసపాలకుల కాలంలో 18, మార్చి 1801న తొలి ఆర్డ్‌నన్స్ ఫ్యాక్టరీ కలకత్తా సమీపాన కొస్సిపోర్ ప్రాంతంలో నెలకొల్పడంతో ఆ చారిత్రాత్మక సన్నివేశానికి గుర్తుగా ప్రతి ఏట 18 మార్చిన దేశ త్రివిధ దళాలు, ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీ బోర్డులు సంయుక్తంగా ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీల దినోత్సవంను ఘనంగా జరుపుకోవడం కొనసాగుతున్నది.

**భారతీయ రక్షణ రంగంలో 4వ దళం – ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు:**

మన త్రివిధ దళాలకు ధీటుగా 4వ సాయుధ బలగంగా ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీలు విశిష్ట సేవలను అందిస్తున్నాయి. కాలానుగుణంగా శాస్త్రసాంకేతిక పరిజ్ఞానాన్ని జీర్ణించుకుంటూ వివిధ రకాలైన ఆయుధాలు, మందు గుండు సామాగ్రి, రక్షణ రంగ వాహనాల రూపకల్పన, సిబ్బంది ప్రత్యేక దుస్తుల తయారీ, పర్వత ప్రాంత రవాణాకు సంబంధించిన ఉపకరణాలు, అత్యాధునిక ఎలక్ట్రానిక్ ఉపకరణాలను మన దేశ అవసరాలకు అనుగుణంగా తయారు చేసి సమయానికి అందిస్తూ దేశ రక్షణలో ప్రధాన భూమికను నిర్వహిస్తున్న ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీల సిబ్బంది సేవలను గుర్తించడం, దేశ రక్షణలో అమరత్వం పొందిన యోధులను స్మరించుకోవడం, అత్యాధునిక ఆయుధాల ప్రదర్శన, ఆధునిక పరిశోధనా ఫలితాల మూట విప్పడం, ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీల సేవకు సంబంధించిన ఫోటో ప్రదర్శనలు, పరేడ్ల నిర్వహణ లాంటి కార్యక్రమాలను ఈ వేదికగా నిర్వహించడం జరుగుతుంది. దేశవ్యాప్తంగా 41 ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీలు 24 ప్రాంతాల్లో స్థాపించడంతో పాటు 9 శిక్షణ కేంద్రాలు, 3 ప్రాంతీయ మార్కెటింగ్ కేంద్రాలు, 4 ప్రాంతీయ భద్రత కార్యాలయాలు 5 ఆపరేషనల్ విభాగాలుగా విస్తరించి ఉన్నాయి. అత్యధికంగా మహారాష్ట్రలో 10, యుపిలో 09, ఎంపి/తమిళనాడుల్లో 06 చొప్పున ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు స్థాపించడం జరిగింది.

రెండవ ప్రపంచ యుద్ధం నుంచి మొన్నటి ఆపరేషన్ సింధూర్ వరకు తన ప్రత్యేకతను నిలుపుకుంటూ వస్తున్న ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీలు రానున్న కాలంలో కూడా త్రివిధ దళాలకు ఆయుధ శక్తిని అందిస్తూ దేశ సమగ్రత, సమైక్యతలను కాపాడటంలో తనదైన పాత్రను పోషిస్తాయి. భరతమాత సేవలో ప్రాణాలర్పించిన ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీలకు సంబంధించిన అమరులకు ఘన నివాళులు అర్పించడం, ప్రస్తుతం సేవలు అందిస్తున్న సైనికులకు ధైర్యంగా నిలవడం మన కనీస బాధ్యత.

(18 మార్చి ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీల దినోత్సవం సందర్భంగా)

# లేబర్ కోడ్‌ల అమలు నిలుపుచేయండి!



జి.అనురాధ
BOC రాష్ట్ర అధ్యక్షురాలు,
9959632366

మోదీ ప్రభుత్వం కార్మికులు, సంఘాల వ్యతిరేకతను పెడచెవినపెట్టి ఏప్రిల్ ఒకటో తేదీ నుండి నాలుగు లేబర్ కోడ్‌లను అమలుచేసేందుకు సిద్ధపడి గెజిట్‌ను విడుదల చేసింది. 2020లో బిజెపి ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దుచేసి దీని స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను రూపొందించింది. రద్దుచేసిన చట్టాలు బ్రిటీష్ కాలంనాటి చట్టాలైనందున వాటిని నవీకరణ చేసినట్లుగా బిజెపి అనుచరులు, మద్దతుదారులు మాట్లాడుతున్నారు. మోదీ ప్రభుత్వం రద్దుచేసిన 29 చట్టాల్లో 25చట్టాలు 1947తర్వాత భారత పార్లమెంటు ఆమోదించినవే. దేశవ్యాప్తంగా కార్మికులు, కార్మిక సంఘాలు అమలులో ఉన్న 29 కార్మిక చట్టాలను రద్దు చేయడాన్ని దాని స్థానంలో నాలుగు లేబర్ కోడ్లను తేవడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. నాలుగు లేబర్ కోడ్లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా కార్మిక సంఘాల పిలుపు మేరకు సార్వత్రిక సమ్మెలు జరిగాయి. ఫిబ్రవరి 12న జరిగిన సార్వత్రిక సమ్మెలో సంఘటిత, అసంఘటిత రంగాలకు చెందిన 50కోట్లమంది కార్మికులు పాల్గొని తమ వ్యతిరేకతను తెలిపారు.

**లేబర్ కోడ్‌లు మింగిన అసంఘటిత కార్మిక చట్టాలు..**

మోడీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లలో బలైన చట్టాల్లో ఎంతో కాలం నుండి 37రకాలైన భవన నిర్మాణ కార్మికులు అనుభవిస్తున్న భవన నిర్మాణ కార్మికుల చట్టాలు సైతం ఉన్నాయి. నాలుగు లేబర్ కోడ్లలో ఒకటైన పారిశ్రామిక సంబంధాల కోడ్. 2020లో ట్రేడ్ యూనియన్ల చట్టం..1926,సోషల్ సెక్యూరిటీ కోడ్ (సామాజిక భద్రత కోడ్)..2020లో భవన నిర్మాణ కార్మికుల సెస్ చట్టం.. 1996,ఆక్యుపే షనల్ సేఫ్టీ,హెల్త్ అండ్ వర్కింగ్ కండిషన్స్ కోడ్ (వృత్తిపరమైన భద్రత ఆరోగ్యం పని పరిస్థితుల కోడ్..2020లో బిల్డింగ్ అండ్ ఇతర నిర్మాణ కార్మికుల చట్టం..1996 ఉన్నాయి. ఇదే కాకుండా వివిధ రకాలుగా అసంఘటిత రంగాలలో పనిచేస్తున్న కార్మికులకు సంబంధించి బీడీ మరియు సిగార్ వర్కర్స్ చట్టం 1966, సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్ చట్టం..1976, ప్లాంటేషన్ల లేబర్ చట్టం.. 1957,అసంఘటిత కార్మికుల చట్టం..2008,సమాన పనికి సమాన వేతన చట్టం.. 1961,అంతర్రాష్ట్ర వలస కార్మికుల చట్టం.. 1979,సినీ కార్మికుల చట్టం..1981, డాక్ వర్కర్స్ చట్టం..1986 ఉన్నాయి. మోదీ ప్రభుత్వం ఉన్న చట్టాలను రద్దుచేసి తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లలో కాల్చిన కర్రతో వాతలు పెట్టే దానిలో జర్నలిస్టుల చట్టాలు కూడా ఉన్నాయి. సోషల్ సెక్యూరిటీ కోడ్ ఆక్యుపేషనల్ సేఫ్టీ, హెల్త్ అండ్ వర్కింగ్ కండిషన్స్ కోడ్‌లో వర్కింగ్ జర్నలిస్ట్ ఇతర న్యూస్ పేపర్ చట్టం..1955, వర్కింగ్ జర్నలిస్టుల చట్టం..1958 ఉన్నాయి. ఇవేవీ మోది ప్రభుత్వం ప్రచారం చేస్తున్నట్లు బ్రిటిష్ వలస కాలంనాటి చట్టాలు కావు. అసంఘటిత కార్మికులు కోట్లాదిమంది పెట్టుబడి దారులకు, సంఘటిత రంగంలో ఉన్న కార్మికు లు విదేశీ స్వదేశీ కార్పొరేట్ సంస్థల అధిపతులకు, జర్నలిస్టులు బడా యాజమాన్యాలకు కట్టుబానిసలుగా పని చేయాలనే ఉద్దేశంతోనే ఈ నాలుగు లేబర్ కోడ్లను మోదీ ప్రభుత్వం తీసుకు వచ్చిందనేది నిర్వివాదాంశము.

**నిర్మాణ కార్మికుల నిధులపై కన్నేసిన కార్పొరేట్లు :** భవన నిర్మాణ రంగ కార్మికుల పోరాటాల ఫలితంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్స్ చట్టం..1996 సెక్షన్(18)కింద ఏర్పడిన భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులో 25 లక్షల 72 వేల మంది కార్మికులు సభ్యులుగా చేరారు. ఇందులో 37రకాలైన పనులు చేసే కార్మికులు సభ్యులుగా ఉన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం 2014 సెప్టెంబర్ 17నుండి తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్స్ వెల్ఫేర్ బోర్డుగా మార్పుచేశారు. ఈ బోర్డులో కార్మిక సంఘాల ప్రతినిధులు,ప్రభుత్వ అధికారులు, యాజమాన్యాల ప్రతినిధులను సభ్యులుగా చేర్చి బోర్డును ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు సెస్ పేరు తో 564 కోట్లు వసూలు చేసేవారు.

అధికారపార్టీ నేతల అండ దండలు, అవినీతి అధికారుల సహకారం తో సెస్ చెల్లించకుండా మెట్రో, మెగా తదితర బడా నిర్మాణ సంస్థలు ఎగ్గొట్టేవారు. భవన నిర్మాణ కార్మికుల బోర్డు నిధులు సెస్సులపై ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలు కన్నేసాయి. దీనిలో భాగమే మిషన్ మోదీ పథకం పేరుతో కేంద్ర ప్రభుత్వం బీమా కంపెనీలకు మేలు చేసే పథకాన్ని తెచ్చింది.నాలుగు లేబర్ కోడ్‌ల ద్వారా భవన నిర్మాణ కార్మికుల సెస్సు నిర్వహణను ప్రభుత్వ ఆధీనంలో కాకుండా ప్రైవేట్ సంస్థల అధిపతుల ఆజమాయిషీలో పెట్టేందుకు సామాజిక భద్రత కోడ్ 2020లో రూపొందించబడింది. సెస్సును, నిధులను, బోర్డు నిధులను కార్మికుల కొరకు వినియోగించకుండా ఇతర పథకాలకు మళ్లించే చర్యలను అరికట్టేందుకు కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ కాగ్స్‌తో ఆడిట్ చేయించాలని, కార్మిక సంక్షేమ పథకాలకు బోర్డు నిధులను ఖర్చు చేయాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఇప్పుడు సామాజిక బాధ్యత కోడ్ 2020లోని నాలుగో అధ్యాయంలో 10 లోపు కార్మికులు పనిచేసేచోట ఏ సౌకర్యాలు, అవకాశాలు వర్తించే అవకాశంలేని విధంగా పేర్కొనబడింది. భవన మరియు నిర్మాణ పనుల నిర్వచనాన్ని మార్పు చేయడం జరిగింది. ఇది ఏమిటంటే ఒక వ్యక్తి లేదా వ్యక్తుల సమూహం సొంత నివాసం కొరకు దానికి సంబంధించిన పనుల విలువను రూ.10లక్షల నుండి 50 లక్షలకు పెంచింది. అంటే 50 లక్షల విలువైన నిర్మాణాలు, భవనాలు నిర్మాణం చేసినా వారు కార్మికులు కారు. వారు సంక్షేమ బోర్డులో పేర్కొన్న పథకాలకు అనర్హులుగా భావించబడతారు. ఒకవైపున మెగా, మెట్రో తదితర బడా నిర్మాణ సంస్థల నుండి సెస్సును వసూలు చేయకుండా వదిలేసి మరో పక్కన ఈ విధంగా చేయడం అంటే కార్మికుల బోర్డును నిర్వీర్యం చేయడమే అవుతుంది. వారికి బోర్డులో పేర్కొన్న హక్కులు సౌకర్యాలు అమలు చేయబడవు అన్నమాట. 50లక్షలు అంతకన్నా ఎక్కువ మొత్తాన్ని, ప్రభుత్వం నోటిఫై చేసిన కార్మికుల సంఖ్య కంటే ఎక్కువ మందిని నియమించుకునే నిబంధన వల్ల వారికి సెస్ నుండి మినహాయింపు కల్పించి సెస్ రాబడి తగ్గించడానికి, సంక్షేమ ప్రయోజనాలను ఎగ్గొట్టటానికి ఉద్దేశించబడినది.

కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని తెచ్చిన సమయంలో వివిధ రంగాల కార్మికులకు అమలు చేయబడుతున్న సంక్షేమ పథకాలను రద్దు చేయడం జరిగింది. రద్దు చేయబడిన వాటిలో బీడీ వర్కర్స్ వెల్ఫేర్ సెస్ చట్టం తేదీ 1.7.2017, ఐరన్, మాంగనీస్, క్రోమ్ ఖనిజాల గనుల కార్మికుల వెల్ఫేర్ సెస్ చట్టం తేది.21.5.2016, మైకా మైన్స్ లేబర్ వెల్ఫేర్ సెస్ చట్టం తేది.21.5.2016, లైమ్ స్టోన్ గనుల కార్మికుల వెల్ఫేర్ సెస్ చట్టం తేది.21.5.2016 ఉన్నాయి.

**బోర్డు నిధులు మింగేసే ప్రయత్నంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం**

తెలంగాణ రాష్ట్రంలో 2023లో ఆరు గ్యారెంటీల పేరుతో ఇచ్చిన హామీలలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి తోడ్పడుతామని సైతం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలో పేర్కొన్నది. అధికారంలోకి వచ్చి ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడగానే తేది. 21.8.24న భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను, బోర్డునిధులను అప్పనంగా ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు పూనుకొని రహస్య టెండర్లను పిలిచింది. దీనికి వ్యతిరేకంగా భవన నిర్మాణ కార్మిక సంఘాలు, కార్మికులు ఐక్యంగా పెద్దఎత్తున ఆందోళనలు చేశారు. కేంద్ర ప్రభుత్వం మిషన్ మోదీ పథకం సాకుతో అమలు చేసేందుకు చేస్తున్న కుటిల ప్రయత్నాలు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమబోర్డు నిధులకు ప్రమాదకరంగా పరిణమించాయి. మోదీ ప్రభుత్వం అనుసరించే దారిలోనే రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రయాణించ దలచుకున్నట్లు కనిపిస్తోంది.

నాలుగు లేబర్ కోడ్‌లలో కార్మిక సంఘం పెట్టుకొనే హక్కు లేకుండా చేస్తున్నది. మహిళలను రాత్రివేళలో పనిచేయించేందుకు అవకాశం కల్పిస్తున్నది. భవన నిర్మాణ రంగంలో అత్యధిక మంది మహిళలే ఉన్నందున వారి భద్రత మరింత ప్రమాదంలో పడే అవకాశం ఉంది.

మోదీ అనుచరులు ఎల్ అండ్ టి అధినేత సుబ్రహ్మణ్య స్వామి, ఇన్ఫోసిస్ అధినేత నారాయణమూర్తి లాంటి కార్పొరేట్ సంస్థల అధిపతులు వారానికి 72నుంచి 90గంటలు అంటే రోజుకి 12నుండి 14గంటల పాటు పనులు చేయాలని కార్మికులకు ఉపదేశాలిస్తున్నందున భవన నిర్మాణరంగంలో కార్మికుల పనిగంటలు పెరిగే ప్రమాదకరమైన పరిస్థితులకు అవకాశం ఉంది. ఇప్పటికే 600 నుండి 1500 రూపాయ ల వరకు భవన ఇతర నిర్మాణ కార్మికుల రోజువారీ కూలీ అమలు జరిగింది. అయినా నిత్యావసర సరుకుల ధరలు, పిల్లలు చదువులు, ఇంటి అద్దెలు చెల్లించడానికి, కుటుంబ బతుకు బండిని లాగడం రోజు రోజు కు భారంగా మారుతుంది. ఇలాంటి పరిస్థితిలో ఇప్పుడు లేబర్ కోడ్లలో ఫ్లోర్ లెవెల్ వేజ్ పేరుతో 2019లో రూ.178లు, 2024 నాటికి రూ.174.లు కేంద్రం నిర్ణయిస్తే కార్మికుల జీవన పరిస్థితి ఎలా మారనుందో ఊహించుకోవచ్చు. కార్మికులు సమ్మె చేసే అవకాశాలు లేవు. కార్మిక శాఖ అధికారులను ఉత్సవ విగ్రహాలుగా మార్చి పారిశ్రామిక సంబంధాల కోడ్‌లో కార్మిక సంఘాల చట్టాన్ని మార్చడం జరిగింది.

పనిస్థలాల్లో రక్షణ లేకపోవడం, ప్రమాదాలలో గాయపడటం, ప్రాణాలు కోల్పోవడం లాంటి సమయాలలో సైతం నష్టపరిహారాలు చెల్లించడానికి వీలు కల్పించని లేబర్ కోడ్‌ల వల్ల నిర్మాణరంగ కార్మికులకు రానున్న రోజుల్లో అన్ని రకాల కార్మికులతో పాటు మరింత ఎక్కువగా భవన నిర్మాణ కార్మికులు, అసంఘటితరంగ కార్మికులు ప్రమాదకరమైన పరిస్థితులను అనుభవించాల్సి వస్తుంది.

భవన నిర్మాణరంగ కార్మికులకు ప్రమాదకరంగా మారిన నాలుగు లేబర్ కోడ్‌లను మోదీ ప్రభుత్వం ఏప్రిల్ ఒకటి నుండి అమలు చేస్తామని నవంబర్‌లోనే ప్రకటించింది. బిజెపి యేతర రాష్ట్రాలైన తమిళనాడు, కేరళ, బెంగాల్ తదితర రాష్ట్రాల్లో నాలుగు లేబర్ కోడ్‌లను అమలుచేసేది లేదని ప్రకటించారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి నాలుగు నెలలుగా ఎందుకు మాట్లాడటం లేదు? అధికారంలో ఉన్న కాంగ్రెస్ వైఖరి అనుమానాలకు దారితీస్తుంది.ఏప్రిల్ ఒకటి నుంచి తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కోడ్‌లను అమలుచేయమని స్పష్టంగా ప్రకటించాలి. రానున్న అసెంబ్లీలో ఈ మేరకు తీర్మానం చేయాలి. నాలుగు లేబర్ కోడ్లను రాష్ట్రంలో అమలు చేయకుండా చేసేందుకు ప్రభుత్వంతో తీర్మానం చేయించే వరకు భవన నిర్మాణ కార్మికులు, అసంఘటిత రంగంలోని కార్మికులు ఉద్యమాన్ని సాగించాలి.

# బాధ్యతారహిత ప్రజాప్రతినిధులు...నియంత్రించని సర్కార్

అలిశెట్టి ప్రభాకర్ అన్నట్లు 'దొంగ' సినిమా నిర్మాతలకి వేరే దిక్కేది! సగటు తెలుగు ప్రేక్షకుడి జేబే రోజూ దక్కేదీ! రైల్వేకోడూరు జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ తనను బలవంతంగా లొంగదీసుకుని వాడుకున్నాడని హర్ష వీణ అనే ప్రభుత్వ ఉద్యోగి రోజుకో వీడియో రిలీజ్ చేసినా ప్రభుత్వం నుంచి స్పందన లేదు. టిడిపికి చెందిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్ ఓ మహిళతో వీడియో కాల్‌లో మాట్లాడుతూ ముద్దులు పెడుతున్న దృశ్యాలు గతంలో వైరల్ అయ్యాయి. దీంతో ఆయనపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఈ వీడియో వ్యవహారం తేల్చాలని ఆయన పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు. అదే సమయంలో వీడియోలో ఉన్న టిడిపి మహిళా నేత గుంటుపల్లి వాణి ఓ వీడియో రిలీజ్ చేశారు. తన భర్తతో వీడియో కాల్ మాట్లాడిన వీడియోను డీప్ ఫేక్ చేసి ఎమ్మెల్యేను ఇరికించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఇక సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి అదుమూలంపై నమోదైన లైంగిక వేధింపుల కేసులో ఎంఎల్‌ఏ ని పార్టీ కార్యక్రమాల నుంచి పక్కకు తప్పించారు ఆముదాలవలస ఎంఎల్‌ఏ కూన రవికుమార్ తనను శారీరకంగా, లైంగికంగా వేధించాడని స్వయానా బాధితురాలు కెజిబివి ప్రిన్సిపాల్ సౌమ్య ఆరోపిస్తే నిజానిజాలు తేల్చాల్సిన ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తున్నది. ఇక బిజెపి ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి కుమారుడు సుధీర్ రెడ్డి డ్రగ్స్ కేసులో జైల్లో ఉన్నారు. తాజాగా ఏలూరు ఎంపి పుట్టా మహేష్ యాదవ్ బిఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి మొయినాబాద్ ఫామ్ హౌస్‌లో డ్రగ్స్ సేవిస్తూ పట్టుబడ్డాడు. డ్రగ్స్ సేవించినట్లు పాజిటివ్ వచ్చినట్లు పోలీసు అధికారులు తెలియజేసారు. ఇక టివి 5 అధినేత తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ బిఆర్ నాయుడు మహిళలతో రంకు భాగోతం వీడియోలో వైరల్ అవుతున్న చర్యలకు ఉపక్రమించని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం. లడ్డు కల్తీ పై స్పందించిన సనాతన వాదులు మహిళలపై, చిన్నారులపై జరుగుతున్న లైంగిక హింసలపై స్పందన కరువయ్యింది. రాజమండ్రిలో కల్తీ పాలు తాగి 15 మంది మరణించారు. ఇంకా ఐదుగురు వెంటిలేటర్‌పై ఉన్నారు. 2024 నుంచి బాణాసంచా పేలుళ్లలో చనిపోయిన వారి సంఖ్య 60, మొన్న వేట్లపాలెం ఘటన మరువకముందే నిన్న గోపాలపట్నంలో పేలుడు. ఒక వైపు విద్యార్థులలో మానవ విలువలు సంస్కృతి వారసత్వం ఆధ్యాత్మిక చింతన పెంపొందించేందుకు చాగంటి లాంటి ఘనాపాటిని సలహాదారులుగా నియమించారు. మరోవైపు ఎర్ర చందనం స్మగ్లింగ్ చేస్తున్న ఒక గజదొంగ కథ ప్రేరణగా తీసిన సినిమాకు 1300 టికెట్టు పెట్టి ప్రేక్షకుల నుంచి డబ్బు వసూలు చేసుకోవడానికి ప్రభుత్వం పర్మిషన్ ఇస్తున్నారు. తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన వారికి పారితోషికం ఇస్తున్నారు. అసలే బెట్టింగ్, ఆన్లైన్ గేమ్స్, జూదం, మోసం అమ్మాయిలపై అఘాయిత్యాలు, దొంగ రవాణా, గుడుంబా, గంజాయి, ఎర్ర చందనం స్మగ్లింగ్, వ్యభిచార రాకెట్, దందాలతో పోలీసులు సతమవుతుంటే విశృంఖలత్వాన్ని, హింస, స్మగ్లింగ్, ధూమపానం, మద్యపానం దొంగ పనులు చేసేవారిని హీరోగా తెరకెక్కించి ఏ మాత్రం సెన్సార్ లేకుండా ఎక్కడ తగ్గకుండా 'తగ్గేదెలా' జుగుప్సాకరమైన, అశ్లీల సన్నివేశాలను యువత పెడదోవకు ప్రేరేపించే సినిమాలు సెన్సార్ బోర్డు కళ్ళు మూసుకొని సర్టిఫై చేస్తున్నారు, మరోవైపు హిందూ మనోభావాలు లవ్ జిహాద్ అని గగ్గోలు పెట్టే మతతత్వవాదులకు అశ్లీలత కనిపించకపోవడం సిగ్గుచేటు. పత్రికలు కూడా సినిమా రివ్యూలలో అశ్లీలతను రాయకుండా దర్శకుడిని పొగుడుతూ, సెకండాఫ్‌లోని జాతర ఎపిసోడ్‌లో ఇదిరా పెళ్లాం అంటే అనేట్టు చూపించాడు అంటూ పుంఖాను పుంఖాలుగా రాస్తున్నారు.

చట్ట సభలు వ్యవస్థల్ని దిశా నిర్దేశం చేస్తాయి, ప్రజాప్రతినిధులు అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. కారణమేదైనా మనిషి వావివరసలు పరచిపోతున్నాడు. తప్పెవరిది అని ఒకరినొకరు నిందించుకోవడం కాకుండా, వ్యవస్థ మొత్తం గా ఆలోచించాలి.

డా. ముచ్చుకోట సురేష్ బాబు,
9989988912

# ఇవి 'వస(చి)తి' గృహాలా?

వరుస ఘటనలు సంక్షేమ వసతి గృహ విద్యార్థుల తల్లిదండ్రుల్లో భయాందోళన నెలకొంది. విష ఆహారం విద్యార్థుల ప్రాణాల మీదకు తెస్తుంది. వసతి గృహాల సిబ్బంది వ్యవహార తీరు ఈ పరిస్థితికి కారణమవుతుంది. పేదలు, బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారు తమ పిల్లలను సంక్షేమ వసతి గృహాలకు పంపుతున్నారు. సిబ్బంది అన్ని తామై పిల్లలను సంరక్షించాల్సిన పరిస్థితి ఉండగా అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. చాలా వసతి గృహాల్లో క్రమశిక్షణ లోపించిందన్న ఆరోపణలు ఒక పక్క మరో పక్క ఆహారం విషతుల్యమై విద్యార్థులు ఆసుపత్రుల పాలు కావడం సంక్షేమ వసతి గృహాలపై అపనమ్మకాన్ని పెంచేవిధంగా ఉంది. దమ్మపేట, మణుగూరులో జరిగిన ఘటనలు మరువక ముందే ముదిగొండ మండలంలో చోటు చేసుకున్న ఘటన ఇప్పుడు తీవ్ర విమర్శలకు దారి తీస్తుంది. ఎప్పుడో ఒకసారి ఎక్కడో ఒక చోట జరిగిందంటే పొరపాటునో జరిగి ఉండవచ్చునని భావించవచ్చు. కానీ ఉమ్మడి జిల్లాలో వరుస ఘటనలు చోటు చేసుకోవడం పదుల సంఖ్యలో విద్యార్థులు ఆసుపత్రుల పాలు కావడం జరుగుతుంది. ఒక ఘటన చోటు చేసుకున్న తర్వాతనైనా అధికార యంత్రాంగం అప్రమత్తం కావాల్సి ఉండగా ఆ పని చేయడం లేదు. విద్యార్థులకు నిత్యం ఏమి వండి వడ్డిస్తున్నారు, వసతి గృహాల్లో పరిశుభ్రత, సిబ్బంది హాజరు తదితర విషయాలపై ఆయా శాఖల అధికారులకు పట్టింపు లేకుండాపోయింది. క్షేత్రస్థాయి సిబ్బంది మొదలు ఉన్నతాధికారుల వరకు ఉన్న ఆర్థిక సంబంధాలు క్షేత్రస్థాయి సిబ్బందిని సరిగ్గా పనిచేసేలా చేయలేకపోతున్నాయి. విద్యార్థుల ప్రాణాల మీదకు వస్తున్నా తగు రీతిలో స్పందించడం లేదంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అవగతం చేసుకోవచ్చు. ఆహారం విషతుల్యమై విద్యార్థులకు వాంతులు, విరోచనాలు అనగానే ఆగమేఘాల మీద ఘటన స్థలికి చేరుకోవడం, ఒకరినో ఇద్దరినో విధుల నుంచి తప్పించి చేతులు దులుపుకోవడం ఇప్పుడు సంక్షేమ అధికారులకు అలవాటుగా మారింది. విధుల నుంచి తప్పించిన వారిని రెండు మూడు నెలల్లో తప్పించిన వారే విధుల్లోకి తీసుకుని మీకు మేమున్నాం మీరు ఏమైనా చేయండి అంటూ బాసటగా నిలిచినట్లు ఉంది పరిస్థితి. మార్చి మాసంలోనే మూడు ఘటనలు ఉమ్మడి జిల్లాలో చోటు చేసుకున్నాయి. ఆ తర్వాతనైనా నిరంతర పర్యవేక్షణ ఉందా అంటే అది కొరవడింది. విద్యాభ్యాసన గురించి పక్కనపెడితే మిగిలిన అన్ని విషయాల్లో సంక్షేమ హాస్టళ్లు వైఫల్యాలకు కేంద్రాలుగా మారుతున్నాయి. మెనూ అమలుపై ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. విద్యార్థి సంఘాల ఆందోళనలకు, వినతి పత్రాలకు సైతం అధికారులు స్పందించడం లేదు. చదువు సంగతి వదిలిపెట్టి కొందరు విద్యార్థులు గాడితప్పి మత్తు పదార్థాలను సేవించి హల్‌చల్ చేస్తుండగా కొందరు వేధింపులకు గురై ప్రాణాలను తీసుకుంటున్నారు. మొత్తం సంక్షేమ వసతి గృహ వ్యవస్థను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉంది. ఈ విద్యా సంవత్సరం ముగుస్తున్న క్రమంలో వేసవిలో వసతి గృహాల పనితీరు మెరుగుదల, ఇతరత్రా వ్యవహారాలపై ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టిసారించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. తప్పిదాలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించడంతో పాటు భవిష్యత్తులో తిరిగి ఉద్యోగానికి వచ్చే అవకాశం లేకుండా చర్యలు ఉంటే తప్ప మేలు జరిగే పరిస్థితి లేదని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఆ దిశగా అధికారులు తగు చర్యలు తీసుకుంటారని ఆశిద్దాం.

## బిజెపి ప్రభుత్వ వైఫల్యంతో గ్యాస్ కొరత

సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నల్లు సుధాకర్ రెడ్డి



**ప్రజాపక్షం/కురవి :** బిజెపి ప్రభుత్వ విధాన వైఫల్యాల వల్ల గ్యాస్ ధరలు పెరిగి తీవ్ర కొరత ఏర్పడ్డదని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నల్లు సుధాకర్ రెడ్డి ఆరోపించారు. కురవి మండల కేంద్రం గుడి సెంటర్ లో వంట గ్యాస్ సిలెండర్లతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ డోనాల్డ్ ట్రంప్ ప్రపంచ నియంతగా వ్యవహరిస్తూ తన ఆధిపత్యాన్ని చలాయించడం కోసం ప్రభుత్వ అధినేతలను ఎత్తుకెళ్లి నిర్బంధించడం, ఇరాన్‌పై ఇజ్రాయిల్‌తో కలిసి ఏకపక్షంగా దాడులు నిర్వహించి ప్రపంచ సంక్షోభానికి కారణమవుతున్నారని ఆరోపించారు. నరేంద్ర మోడీ అమెరికాను పల్లెత్తు మాట అనకుండా, ఎవరి వద్ద చమురు కొనాలో ట్రంప్ పర్మిషన్ తీసుకోవలసిన రావడం అమెరికాకు దాసోహమై ,దేశ సార్వభౌమత్వాన్ని మంటగలిపారని, గ్యాస్ ధర ఒకేసారి 60 రూపాయలు పెంచడం, గ్యాస్ బండల తీవ్ర కొరతతో హోటల్స్, హాస్టల్స్ మూతపడే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నెల్లూరు నాగేశ్వరరావు, కొరవి టౌన్ కార్యదర్శి తురక రమేష్, బుడమ వెంకన్న, దూదికట్ల సారయ్యా, కలగూర నాగరాజు, బొల్లం విజయ్, యం.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## పాత విధానంలోనే మెడికల్ బోర్డు నిర్వహించాలి: మోటపలుకుల రమేష్



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** సింగరేణిలో పాత విధానంలోనే మెడికల్ బోర్డును నిర్వహించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి మోటపలుకుల రమేష్ డిమాండ్ చేశారు. భూపాలపల్లి ఏరియాలో సింగరేణి కాలరీస్ వర్కర్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేపట్టిన సేవ్ సింగరేణి బస్ జాతా కార్యక్రమంలో భాగంగా సింగరేణి వ్యాప్తంగా అన్ని గనులు, డిపార్ట్మెంట్స్ మీద నల్ల బ్యాడ్జీలు ధరించి మెడికల్ బోర్డు, మారుపేర్లు, ఇన్కమ్ ట్యాక్స్ రిటర్న్, తదితర అంశాలపై గని మేనేజర్ పిట్ సెక్రటరీ ఎల్.శంకర్ ఆధ్వర్యంలో బ్రాంచి కార్యదర్శి మోటపలుకుల రమేష్ మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. బస్ జాతా కార్యక్రమాన్ని విజయవంతం చేసి మార్చి 30న కొత్తగూడెంలో హెడ్ ఆఫీస్ ముట్టడి ధర్నా కార్యక్రమం జరుగుతుందని దాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. సింగరేణిలో కొత్త బొగ్గు బావులు ప్రారంభించాలని, పాత విధానంలో మెడికల్ బోర్డును నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. కెటికె1లో జి.శ్రీనివాస్, సదయ్య, కెటికె5 లో ఆసిఫ్ పాషా, రాజేందర్, కేటికె6లో శ్రీనివాస్, గణేష్, కెటికె 8 శంకర్, కృష్ణ, ఓసి 2లో కరిముల్లా, రామచందర్, ఓసి 3లో నూకల చంద్రమౌళి, మహేందర్ రావు, ఏరియా వర్క్షషాప్‌లో శ్రీనివాస్, కొమురయ్యలు కార్యక్రమంలో పాల్గొని నల్ల బ్యాడ్జీలు ధరించి గని మేనేజర్లకు మెమోరాండం అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ పిట్ సెక్రటరీ శ్రీకాంత్, వర్క్ మెన్ ఇన్స్‌పెక్టర్ హరీష్, మైన్స్ కమిటీ, సేఫ్టీ కమిటీ, షిఫ్ట్ ఇంచార్జిలు, అసిస్టెంట్ షిఫ్ట్ ఇంచార్జిలు, టెంపుల్ కమిటీ, క్యాంటీన్ కమిటీ, కార్యకర్తలు, కార్మిక సోదరులు పాల్గొన్నారు.

## గ్యాస్ సరఫరాలో పారదర్శకతకు ప్రాధాన్యం

రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్యాస్ సరఫరా పారదర్శకంగా, నిరంతరంగా కొనసాగాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ తెలిపారు. మంగళవారం భూపాలపల్లి లోని హెచ్‌పీ గ్యాస్, సింగరేణి కాలరీస్‌కు చెందిన గ్యాస్ ఏజెన్సీలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వినియోగదారులకు అందిస్తున్న సేవలు, గ్యాస్ సరఫరా విధానం, నిల్వల పరిస్థితి, భద్రతా ప్రమాణాలను సమగ్రంగా పరిశీలించారు. గ్యాస్ సిలిండర్ల నిల్వ, పంపిణీ విధానం, రికార్డుల నిర్వహణను పరిశీలించిన ఆయన వినియోగదారులకు సమయానికి గ్యాస్ సరఫరా అందించడంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. వినియోగదారుల ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించడంతో పాటు భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. ఎల్పీజీ డీలర్లు వినియోగదారుల బుకింగ్ సీక్వెన్స్‌ను తప్పనిసరిగా పాటిస్తూ గ్యాస్ రీఫిల్స్‌ను సరఫరా చేయాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ క్రమాన్ని అతిక్రమించకూడదని ఆదేశించారు. అదేవిధంగా జిల్లాలో గ్యాస్ నిల్వలు, బుకింగ్స్, ఆయిల్ కంపెనీల నుంచి రావాల్సిన సరఫరాపై పర్యవేక్షణ కోసం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధ్యక్షతన ఎనర్జీ సప్లై మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల అధికారి కిరణ్ కుమార్, ఇన్స్‌పెక్టర్ సురేందర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## ఇవిఎం గోదాం కలెక్టర్ తనిఖీ



**ప్రజాపక్షం/ములుగు :** కలెక్టరేట్ ఆవరణలో భద్రపరిచిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ల(ఈవీఎంల) గోదాంను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జితో కలిసి గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో త్రైమాసిక తనిఖీ నిర్వహించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సాధారణ తనిఖీలలో భాగంగా కలెక్టరేట్ ఆవరణలో జిల్లాకు సంబంధించి స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచిన ఈవిఎంలను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టర్ పరిశీలించారు. ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ గోదాంకు సంబంధించిన రికార్డులు, కట్టుదిట్టమైన భద్రత చర్యలు, సీసీ కెమెరాల నిరంతర పర్యవేక్షణ గురించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గోదాంలో అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా ఏర్పాటు చేసిన ఫైర్ ఎక్స్‌స్టింగిషర్లను ఇతర అగ్నిమాపక పరికరాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో అత్యంత కీలకమైన ఈవిఎంల భద్రత విషయంలో అత్యంత పారదర్శకతను పాటిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ సెల్ డిప్యూటీ తహసీల్దారు నితీష్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ మనోహర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ప్రారంభించిన కలెక్టర్ చాహత్ బాజ్ పాయి




**ప్రజాపక్షం/హనుమకొండ :** ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా దామెర లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వైద్య శిబిరాన్ని కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ ప్రత్యేక వైద్య శిబిరంలో స్త్రీలు, జనరల్ మెడిసిన్, ఎముకలు కీళ్లు, కంటి, దంత, పిల్లల వైద్య నిపుణులు పాల్గొని వైద్య సేవలను అందించారు. వైద్య శిబిరంలో వైద్యులు ప్రజలకు ఉచిత సేవలు అందిస్తుండగా ఓపి విభాగం తదితర సేవలను కలెక్టర్ పరిశీలించారు. 375 మందికీ వైద్య పరీక్షలు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అదేవిధంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఓపి నమోదు, ఫార్మసీ, షోరూంలని కలెక్టర్ సందర్శించారు. ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను గురించి వైద్యులు సిబ్బందిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 99 రోజుల కార్యచరణ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక వైద్యులతో వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య, పరకాల ఆర్డిఓ డాక్టర్ కన్నం నారాయణ, దామెర తహసిల్దార్ జ్యోతి వరలక్ష్మి దేవి, స్థానిక సర్పంచ్ కల్పన, వైద్యాధికారులు డాక్టర్ మహేంద్ర, డాక్టర్ రాజ్ కుమార్, డాక్టర్ శాంతి ప్రియ, డాక్టర్ ఎస్‌కే.జాస్మిన్ మెహర, డాక్టర్ ప్రమోద్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఔట్‌సోర్సింగ్ సిబ్బంది నియామకానికి సిఎం రేవంత్ రెడ్డికి వినతి



**ప్రజాపక్షం/హనుమకొండ :** హైదరాబాద్ అసెంబ్లీ ప్రాంగణంలో మంగళవారం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో శానిటేషన్, ఇతర పనుల నిర్వహణకు 250 మంది సిబ్బందిని ఔట్ సోర్సింగ్ విధానంలో నియమించేందుకు మంజూరు ఇవ్వాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని కలిసి, సంబంధిత ఫైల్ ప్రస్తుతం మున్సిపల్ శాఖ ఉన్నతాధికారుల వద్ద ఉన్నందున, దానిని ఈ మార్చ్ నెలాఖరు నాటికి ఆమోదించాలని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖల మంత్రి కొండా సురేఖ, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, నగర మేయర్ గుండు సుధారాణి కలిసి వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ, ఈ నెలాఖరు నాటికి మంజూరు కల్పించే దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## అగ్నికి అడవి ఆహుతి



**ప్రజాపక్షం/తాడ్వాయి :** అటవీ ప్రాంతంలో ప్రస్తుతం వేసవి తీవ్రత దృష్ట్యా కార్చిచ్చులతో అడవి ఆహుతవుతుంది. తాడ్వాయి కాటాపూర్ మధ్య ఉన్న అభయారణ్య ప్రాంతంలో గత కొన్ని రోజులుగు పలు చోట్ల మంటలు చెలరేగుతున్నాయి. ఎండిన ఆకులు, గాలి వేగం వలన మంటలు వేగంగా వ్యాపిస్తున్నాయి. అడవిలో మంటల వలన వచ్చే దట్టమైన పొగ కారణంగా తాడ్వాయి కాటాపూర్ ప్రధాన రహదారిపై వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పొగ వలన ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడాది ఉష్ణోగ్రతలు ముందస్తుగానే పెరగడం వలన అడవి పొడిబారి స్వల్ప నిప్పు రవ్వ తగిలినా భారీగా మంటలు వ్యాపిస్తున్నాయి. అటవీ మంటల వలన గాలి కాలుష్యం పెరగడమే కాకుండా పర్యావరణానికి భారీ నష్టం వాటిల్లుతుంది. అడవిలో నుండి వంట చెఱకు తెచ్చుకుంటేనే నానా రకాలుగా ఇబ్బందులు పెట్టే అధికారులు అడవులు తగలబడక ముందే చర్యలు తీసుకుంటే అడవులు అగ్నికి ఆహుతి అవవు కదా అని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# సహజ వ్యవసాయంతో భూసారాన్ని సంరక్షించుకోవచ్చు

జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**ప్రజాపక్షం/నర్సంపేట :** సహజ వ్యవసాయం ద్వారా పంటల ఉత్పత్తి ఖర్చులు గణనీయంగా తగ్గడంతో పాటు భూమి సారాన్ని సంరక్షించుకోవచ్చని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సహజ వ్యవసాయంపై రైతులకు శిక్షణ కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మంగళవారం నర్సంపేట మండలం రాజుపేట గ్రామంలోని రైతు వేదికలో సహజ వ్యవసాయం (నేచురల్ ఫార్మింగ్)పై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద హాజరై రైతులనుద్దేశించి మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపికపై రైతులకు అవగాహన, శిక్షణ చాలా అవసరమని పేర్కొన్నారు. సహజ వ్యవసాయం ద్వారా పంటల ఉత్పత్తి ఖర్చులు గణనీయంగా తగ్గడంతో పాటు భూమి సారాన్ని సంరక్షించుకోవచ్చని తెలిపారు. ఎక్కువగా పురుగు మందులు ఎరువులు వాడడం వల్ల ఆరోగ్య సమస్యలకు వస్తున్నాయని, వాటి నివారణకు పురుగు మందులు లేని నాణ్యమైన ఆహారం అవసరమని తెలియజేశారు. రసాయనాల వినియోగాన్ని తగ్గించి, సహజ పద్ధతులను అనుసరించడం ద్వారా ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులను పెంచవచ్చని రైతులకు సూచించారు. అనంతరం రైతులకు సహజ వ్యవసాయం కోసం అవసరమైన నేచురల్ ఫార్మింగ్ కిట్లను జిల్లా కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడి అగ్రికల్చర్ అనురాధ, హార్టికల్చర్ అధికారి శ్రీనివాస్‌రావు, నర్సంపేట సహాయ వ్యవసాయ సంచాలకులు దామోదర్ రెడ్డి, వ్యవసాయ అధికారి కృష్ణ, నర్సంపేట తహసీల్దార్ రవిచంద్రా రెడ్డి, సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## ఉద్యోగాలు, పెట్రోల్‌బంక్ ఇప్పిస్తామని డబ్బులు వసూలు.. ముఠా అరెస్ట్




**ప్రజాపక్షం/జనగామ :** ఔట్ సోర్సింగ్ పద్ధతిలో ఉద్యోగాలు, పెట్రోల్ బంక్‌లు ఇప్పిస్తామని అమాయక ప్రజల వద్ద డబ్బులు వసూలు చేసిన ముఠాను మంగళవారం పోలీసులు అరెస్ట్ చేశారు. నలుగురితో కలిసిన ముఠాను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. ఈ సందర్భంగా జరిగిన విలేకర్ల సమావేశంలో ఏసిపి పందరి చేతన్ డబ్బుల వసూళ్ల ముఠా వివరాలు వెల్లడించారు. జనగామ పట్టణంలోని పూర్ణిమా కాలనికి చెందిన బెలిగిని శివకుమార్ అనే వ్యక్తి పురోహితం చేసుకుంటూ జీవనం సాగించేవాడన్నారు. తన వద్దకు వచ్చిన అమాయక ప్రజలకు ఉద్యోగాలు, పెట్రోల్ బంక్ ఇప్పిస్తానని, మంత్రులు మల్లు బట్టి విక్రమార్క, కొండా సురేఖ, స్పీకర్ గడ్డం ప్రసాదరావు, పోలీస్ శాఖలో ఐపిఎస్ సజ్జనార్‌తో సంబంధాలు ఉన్నాయన విశ్వాసం కలిగించేలా నమ్మబలికి డబ్బులు వసూలు చేశాడన్నారు. తాను సేకరించిన డబ్బులు తన అల్లుడు సాయిచరణ్, ఇల్లందుల శ్రీనివాస్, దరావత్ రాజేష్‌లకు పంపించేవాడని, అనంతరం ఆ నలుగురు కలిసి డబ్బులు పంచుకునేవారన్నారు. ఈ విషయమై జనగామ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు అందగా డిసిపి రాజమహేంద్రనాయక్ ఆదేశాల మేరకు ఇన్స్‌పెక్టర్ పి.సత్యనారాయణరెడ్డి, సబ్ ఇన్స్‌పెక్టర్ ఎం.భరత్‌లను రంగంలోకి దింపడం జరిగిందన్నారు. పక్కా సమాచారంలో మంగళవారం జనగామలోని హన్మకొండ రోడ్డులో గల ఇండియల్ ఆయిల్ పెట్రోల్ బంక్ వద్ద ఆ నలుగురు ఉన్నారన్న సమాచారం మేరకు పోలీసులతో అక్కడకు వెళ్లి వారిని పట్టుకోవడం జరిగిందన్నారు. ప్రధాన నిందితుడు శివకుమార్‌తో పాటు శ్రీనివాస్, సాయి చరణ్, దరావత్ రాజేష్‌లపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందన్నారు. నిందితులను పట్టుకోవడంతో ప్రతిభ కనబరిచిన సిఐ సత్యనారాయణరెడ్డి, ఎస్ఐ భరత్‌తో పాటు పోలీస్ సిబ్బందిన వరంగల్ పోలీస్ కమీషనర్ సన్‌ప్రీత్ సింగ్, డిసిపి రాజమహేంద్రనాయక్, ఎసిపి పందరి చేతన్ అభినందించారు.

## కమర్షియల్ గ్యాస్ కొరత నివారించాలి

సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఎండి అబ్దుల్ రషీద్



**ప్రజాపక్షం/మరిపెడ :** కేంద్ర ప్రభుత్వం కమర్షియల్ గ్యాస్ కోరతను నివారించాలని, రోజురోజుకు పెరుగుతున్నా నిత్యావసర సరుకుల ధరలను అదుపు చేయాలని సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఎండి అబ్దుల్ రషీద్ డిమాండ్ చేశారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని హోటల్ యజమానులతో కలసి డిమాండ్ చేస్తు మంగళవారం మరిపెడ తహసీల్దార్‌కు ఆయన వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతు మండల పరిధిలో నిత్యవసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగి, కమర్షియల్ గ్యాస్ సరఫరా సరిపడా లేక సాధారణ ప్రజలు, చిన్న హోటల్ నిర్వాకులు, బండి హోటల్ నడిపే పేద వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోజువారి వ్యాపారాల మీద అధారపడి జీవించే చిరువ్యాపారులు తమ వ్యాపారాలు నిర్వహించుకోలేక ఇబ్బందులు పడుతున్నారని, ఆర్థిక నష్టాలు భరించలేక వ్యాపారం మూసుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. కమర్షియల్ గ్యాస్ కొరత నివారించి సమస్యను పరిష్కరించకపోతే దశల వారి ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హోటల్ యాజమానులు సోమన్న, సంపత్, బిక్షపతి, శ్రీను, సోహేల్, తదితరులు పాల్గొన్నారు.

# వైద్యం కోసం వచ్చే ప్రతి ఒక్కరికీ నాణ్యమైన సేవలు



ప్రభుత్వ ఆసుపత్రి ఆకస్మిక తనిఖీలో

జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** వైద్యం కోసం వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ మహబూబాబాద్ పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ప్రధాన జనరల్ హాస్పిటల్ లో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హాస్పిటల్‌లోని ఓపి వార్డు, ఏఎంసీ, ఐసీయూ, పిడియాట్రీషియన్, ఎస్ఎన్సియు, జనరల్ మెడికల్ వార్డు, ఆలనా సెంటర్, ప్రతి వార్డులు తిరుగుతూ వైద్యం కోసం వచ్చిన పేషెంట్లు, వారి బంధువులతో స్వయంగా మాట్లాడారు, హాస్పిటల్‌లో అందిస్తున్న సేవలు, ఆహారం తదితర అంశాలపై ఆరా తీశారు, హాస్పిటల్‌లోని సిబ్బంది హాజరు పట్టిక, స్టోర్ స్టాక్ రిజిస్టర్, ఇన్ పేషెంట్, ఔట్ పేషెంట్ రిజిస్టర్లు, డ్యూటీ ఆర్డర్స్, రిజిస్టర్, వైద్య పరీక్షలు నిర్వహించే ఇండెంట్ రిజిస్టర్, బయోమెట్రిక్ రిజిస్టర్, మెడిసిన్ స్టాక్ రిజిస్టర్ లను ఉదయం నుండి మధ్యాహ్నం వరకు సుదీర్ఘ సమయం హాస్పిటల్, వార్డులు, పరిసరాలను స్వయంగా పరిశీలించారు. వివిధ ఆరోగ్య సమస్యల వైద్యం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి నిరుపేద సామాన్య ప్రజలు తదితరులు వైద్యం కోసం రావడం జరుగుతుందని, ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అత్యాధునిక పరికరాలతో వైద్య విధాన సేవలు, టెస్టులు , ప్రతి ఒక్కరికి అందాలనే ఉద్దేశంతో నాణ్యమైన, వేగమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. హాస్పటల్ వైద్య సిబ్బంది ప్రతి ఒక్కరూ కచ్చితంగా సమయపాలన పాటించాలని, వారికి కేటాయించిన సమయాలలో వైద్య సేవలు అందించడం కోసం సిద్ధంగా ఉండాలని, అత్యవసర పరిస్థితులలో ప్రతి ఒక్కరూ అందుబాటులో ఉంటూ ప్రజలకు వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో కూడా వైద్య సేవల నిమిత్తం ప్రత్యేక క్యాంపులు నిర్వహించి పేదలకు వైద్య సేవలు అందించడం జరుగుతుందని అన్నారు,కలెక్టర్ వెంట హాస్పిటల్ సూపరిండెంట్ డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ వెంకట్ లకావత్, డాక్టర్ జగదీష్, డాక్టర్ హర్షవర్ధన్, తదితరులు ఉన్నారు.

## అంగన్‌వాడీ సెంటర్‌లో కుళ్లిన గుడ్లు పంపిణీ

దుర్వాసన విషయమై ప్రశ్నించిన బాధితులు



**ప్రజాపక్షం/మరిపెడ :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎవరు పోషకహర లోపంతో బాధపడొద్దని అంగన్‌వాడీ సెంటర్‌ల ద్వారా పోషకాహారం అందిస్తూ వుంటే, కొందరు అధికారులు, సిబ్బంది పనితీరు ప్రభుత్వ లక్ష్యాలను నీరుగార్చే విధంగా వుంది. మహబుబాబాద్ జిల్లా మరిపెడ మండలం గిరిపురం గ్రామానికి చెందిన వల్లెపు శ్రావణి మంగళవారం అంగన్‌వాడీ సెంటర్‌కు వెళ్ళి తనకు ఇచ్చిన గుడ్లు తీసుకొని ఇంటికి వెళ్ళి తిందామని పొట్టు తీస్తే సరిగా ఉడకక దుర్వాసన వస్తూ వుండటంతో అది గమనించిన ఆమె అత్త ఉపేంద్ర తినవద్దని వారించి, అంగన్‌వాడీ సెంటర్‌కు వెళ్ళి అంగన్‌వాడీ టీచర్‌ను ఇదేంటని, ఎలా ఈ గుడ్లు తింటారని ప్రశ్నించింది. ఖంగుతిన్న టీచర్ వెంటనే కుళ్లిన, వాసన వస్తున్న గుడ్లను లాక్కొని పడేసి, వేరే గుడ్లు ఇస్తా మాట్లాడవద్దని అసహనం వ్యక్తం చేసింది. నిర్లక్ష్యంగా మాట్లాడడంతో ఆగ్రహించిన బాధితురాలు ఇవే గుడ్లు చిన్న పిల్లలు తింటున్నారని, ఇటీవల ఇటుకల గడ్డ తండలో కల్తీ ఆహారం తిని ఇద్దరు పసివాళ్ళు మరణించారన్నారు. ఈ గుడ్లు తింటే ఆమె గతి ఏంటని విలేకరుల ముందు తన గోడు వెళ్ళబోసుకుంది. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో, సిబ్బంది ఇష్టారీతిగా వ్యవరిస్తున్నారని, కాంట్రాక్టర్ నాణ్యమైన సరుకు సరఫరా చేయడం లేదని, ఇప్పటికైనా అధికారులు విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు.

## విధులు, బాధ్యతలు విస్మరించొద్దు

జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



**ప్రజాపక్షం/జనగామ :** వివిధ శాఖల అధికారులు తమ విధులు, బాధ్యతలను విస్మరించకుండా పారదర్శకంగా పనిచేయాలని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. అలా అయితేనే ప్రభుత్వ పథకాలు అమలై సత్ఫలితాలు వస్తాయన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో భూ భారతి, ఇసుక తరలింపు, స్పెషల్ ఇంటిన్సివ్ రివిజన్, సెన్సస్ తదితర అంశాలపై అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్, ఆర్‌డిఓలతో కలిసి రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ భారతి దరఖాస్తులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. తహశీల్దార్ల వారిగా లక్ష్యాలను నిర్దేశించారు. ఇసుక, మొరం, గ్రావెల్ అక్రమ రవాణా కాకుండా నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. ఓటర్ల జాబితా సవరణకు స్పెషల్ ఇంటిన్సివ్ రివిజన్ ప్రక్రియను అలాగే జనాభా లెక్కల విధులను సమర్థవంతంగా నిర్వహించాలని, వయస్సు, విద్యార్హత, వృత్తి, సామాజిక వర్గం మౌళిక వసతుల వివరాలు వంటి అంశాల్లో ఎటువంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్త వహించాలన్నారు. తహశీల్దార్లు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వయించాలని ఆదేశించారు.

**గ్యాస్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలి**

గ్యాస్ సిలిండర్ల సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మిని కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్‌తో కలిసి డిఎల్ఈఎస్ఎంసిఇ సమీక్ష నిర్వహించారు. జిల్లాలో 12 గ్యాస్ ఏజెన్సీలు ఉండగా ఆ ఏజెన్సీల వద్ద సరిపడా గ్యాస్ సిలిండర్లు ఉన్నాయన్నారు. కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆర్డిఓ గోపిరాం, వెంకన్న, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, సంక్షేమ శాఖల అధికారులు రవీందర్, హసీనాబేగం, విక్రమ్, కోదండరాములు, శ్రీనివాస్‌గౌడ్, గ్యాస్ డీలర్ల సంఘం అధ్యక్షులు పాల్గొన్నారు.

**మహిళా సంఘాలు వ్యవసాయ రంగంలో ముఖ్యపాత్ర పోషించాలి**

మహిళా సంఘాలు వ్యవసాయ రంగంలో ముఖ్యపాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో మార్క్‌ఫెడ్, వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొక్కజొన్న సాగు విస్తృతం అవుతున్నందున కొనుగోలు కేంద్రాలు తక్షణమే ఏర్పాటు చేయాలన్నారు. మహిళా సంఘాలకు వరి ధాన్యం కొనుగోలు కేంఎ్రాల్లో అనుభవం ఉన్నందున వారికి ప్రాధాన్యత ఇస్తే బాగుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి అంబికాసోని, డిఆర్‌డిఓ వసంత, ఏడిఎలు, అడిషనల్ పిడి పాల్గొన్నారు.

**పెంబర్తిలో సమైక్య భవన పనుల పరిశీలన**

జనగామ మండలంలోని పెంబర్తి గ్రామంలో నిర్మాణం అవుతున్న సమైక్య భవన నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు జరిగిన భవన నిర్మాణపనుల వివరాలు అడిగి తెలుసుకొని మిగతా పనులను కూడా వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఓ వసంత, పిఆర్ ఈఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

**యాసంగి రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలి**

రైతు భరోసా దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతున్నందున 2025–26 యాసంగి కోసం రైతులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఒక ప్రకటనలో తెలపారు. 28 ఫిబ్రవరి 2026 నాటికి భూమి రిజిస్టేషన్ పూర్తయి, పట్టాదార్ పాస్ పుస్తకం కలిగిన రైతులు ఈ పథకానికి అర్హులని వెంటనే దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేసుకోవాలన్నారు. పట్టాదార్ పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, సేవింగ్స్ బ్యాంక్ అకౌంట్ వివరాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 25 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## న్యాయం చేయాలని బాధితుల ఆందోళన

**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** వరంగల్ నగరానికి చెందిన గుండా రఘురాం ఆయన భార్య గుండా శ్వేతలు మార్టిగేజ్ ఇల్లు లోను ఇప్పిస్తామని చెప్పి ఏకంగా ఇంటిని వారి పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించుకుని తమకు నిలువ నీడ లేకుండా చేశారని ఆరోపిస్తూ కాజీపేట ప్రాంతానికి చెందిన చందా నవీన్ కుమార్, ఆయన భార్య పిల్లలతో మంగళవారం హనుమకొండ అంబేద్కర్ సెంటర్‌లో పురుగుల మందు డబ్బాతో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా బాధితుడు నవీన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేట కూరగాయల మార్కెట్ ప్రాంతానికి చెందిన చందా నవీన్ కిరాణం నడిపించుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో వరంగల్ ప్రాంతానికి చెందిన గుండా రఘురాం వద్ద కిరాణం సరుకులు తెచ్చుకుంటూ ఉండగా నవీన్ కుమార్ ఆర్థిక పరిస్థితి గమనించి మీకు లోన్ ఇప్పిస్తాం మీకు సిబిల్ లేదు కాబట్టి మీ ఇల్లును తన పేరు మీద రిజిస్ట్రేషన్ చేయండి అంటూ సేల్ డీడ్ చేయించుకుని లోన్ ఇప్పించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయకపోతే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటామని అన్నారు. విషయం తెలుసుకున్న సుబేదారి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని న్యాయం చేస్తామని బుజ్జగించి వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

## ఎసిపిని ఆశ్రయించిన భూదాన్ బాధితులు



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** వెలుగుమట్ల భూదాన్ కమిటీ ముఠా సభ్యుల చేతిలో ఆర్థికంగా మోసపోయిన మరికొందరు బాధితులు మంగళవారం ఖమ్మం టౌన్ ఎసిపి రమణమూర్తిని ఆశ్రయించారు. ఇంటి స్థలాలు ఇప్పిస్తామని యూసిసిఆర్ (ఎంఎల్), వినోబాబు వెల్ఫేర్ పేరుతో బాధితుల నుంచి లక్ష రూపాయల నుంచి మూడులక్షల వరకు వసూలు చేశారని ఎసిపికి ఫిర్యాదు ఇచ్చేందుకు వచ్చిన 9మంది బాధితులు తమ వద్ద ఉన్న రశీదులను ఆయనకు చూపించారు. వాటిని పరిశీలించిన ఆయన రశీదులపై పి.అరవింద్ పేరున ప్రింట్ చేసి ఉండగా పాలబోయిన ముత్తయ్య అనే నిందితుడు దురుద్దేషపూర్వకంగా వసూళ్లకు పాల్పడినట్లు విచారణలో తేలిందన్నారు. నిందితులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇప్పటికే ముఠా సభ్యులను పట్టుకునేందుకు ముగ్గురు సిఐలతో బృందం దర్యాప్తు చేస్తోందని కొందరు నిందితులను ఇప్పటికే అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. అక్రమంగా వసూలు చేసిన నగదుతో వారు కొనుగోలు చేసిన ఆస్తులను గుర్తించామని, బ్యాంక్ ఎకౌంట్లను సైతం ఫ్రీజ్ చేయటం జరిగిందని ఎసిపి బాధితులకు తెలిపారు. ఎసిపిని కలిసిన 9 మందితో పాటు చిర్రా చంద్రకళ, చిర్రా గీతాంజలి, నకుతాలి పుల్లమ్మ, కందగట్ల పాపయ్య ల నుంచి ఒకొక్కరి నుంచి మూడున్నర లక్షల చొప్పున రూ.14 లక్షలు నిందితులు వసూలు చేసి మోసం చేసినట్లు తెలిపారు. ఫ్లెక్సీలు, ఫోటోగ్రాఫ్‌లను వారి కార్యక్రమాలకు ఉపయోగించుకున్నారని వారి మాటలు నమ్మి నష్టపోయామని విచారించి తమకు న్యాయం చేయాలని బాధితులు ఎసిపికి ఫిర్యాదు చేశారు.

## స్వయం ఉపాధి పథకాలకు దరఖాసుల స్వీకరణ

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** స్వయం ఉపాధి పథకాలకు నిరుద్యోగ ఎస్సి యువతీ, యువకులు మార్చి 24 లోపు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని ఎస్సి కార్పొరేషన్ ఇడి నవీన్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 25లోగా సంబంధిత ఆన్‌లైన్ దరఖాస్తులకు ధృవపత్రాలు జతచేసి హార్డ్ కాపీలను కలెక్టరేట్‌లోని ఇడి ఎస్సి కార్పొరేషన్ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. నిరుద్యోగ ఎస్సి యువతీ, యువకులకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం పలు పథకాలను ఆమోదించి దరఖాస్తులను ఆహ్వానిస్తుందన్నారు. https://tgodmms.cgg.gov.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. ఇట్టి అవకాశాన్ని అర్హులైన నిరుద్యోగ ఎస్సి యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని నవీన్‌బాబు కోరారు.

## లోపాలు సరిదిద్దు కోవాలి: కలెక్టర్



**ప్రజాపక్షం/గుండాల :** రెండ్రోజుల్లో పాఠశాలలో ఉన్న అన్ని లోపాలు అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ సరిదిద్దు కోవాలని, లేదంటే ఏజెన్సీ గుర్తింపు రద్దు చేసి, బ్లాక్ లిస్టులో పెడతామని జిల్లా కలెక్టర్ అంకిత్ తీవ్రంగా హెచ్చరించారు. మంగళవారం గుండాల మండల పరిధిలోని ముత్తారం గ్రామంలోని ఏకలవ్య పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్ ఏజెన్సీ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తరగతి గదులు, ఆర్ఓ వాటర్ ప్లాంట్, మరుగుదొడ్లు, డైనింగ్ హాల్, కిచెన్ షెడ్, కంప్యూటర్ ల్యాబ్ తదితర సదుపాయాలను సమగ్రంగా పరిశీలించిన ఆయన నేరుగా విద్యార్థులతో ముచ్చటించి, భోజన నాణ్యత, పాలు సరఫరాపై ఆరా తీశారు. ఇందులో భాగంగా పాఠశాలలో అపరిశుభ్రత తాండవిస్తుండటం, కిచెన్ షెడ్ అపరిశుభ్రత, సిబ్బంది కొరత, కంప్యూటర్ ల్యాబ్ దుమ్ముపేరుకుపోయి ఉండటం, మెనూ ప్రకారం ఆహారం అందించక పోవడం వంటి అంశాలను గమనించిన కలెక్టర్ తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించిన కలెక్టర్ నాణ్యతా ప్రమాణాలు పాటించక పోవడంతో అవుట్ సోర్సింగ్ పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ తీరుమారాలని లేదంటే కఠిన చర్యలు తప్పవన్నారు. అనంతరం గుండాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రి ఆవరణలో 108 అంబులెన్స్ సిబ్బందితో మాట్లాడి వారు అందిస్తున్న సేవలపై వివరాలు సేకరించారు. అవసరమైన అన్ని రకాల మందులు, కిట్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.ఈ పర్యటనలో కలెక్టర్ వెంట తహసీల్దార్ ఖాసీం, మండల ప్రత్యేకాధికారి ఇంతియాజ్ ఖాన్, ఎంపిడిఒ బాలరాజు, నితిన్ సింగ్, డా. సుధీర్, శ్రావణ సంధ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## పరిశుభ్రత ప్రజారోగ్యానికి ముఖ్యం

డిఎం అండ్ హెచ్ఒ



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** పరిసరాల పరిశుభ్రత ఆరోగ్యానికి ఎంతో ముఖ్యమని జిల్లా వైద్యాధికారి డా. తుకారం రాథోడ్ అన్నారు. ఆహారభద్రత, పరిశుభ్రత, ప్రమాణాలపై వీధి ఆహార విక్రేతలు, రెస్టారెంట్ యజమానులు, వంటకారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాల్వంచలోని డిప్యూటీ డిఎంహెచ్ఓ కార్యాలయంలో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడారు. ఆహార భద్రత, పరిశుభ్రత పాటించడం ప్రజారోగ్యానికి ఎంతో అవసరం అన్నారు. ఆహార పదార్థాలు శుభ్రంగా చేయడం, వంట చేసే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, శుద్ధమైన తాగునీటిని వినియోగించడం, ఆహార పదార్థాలను సరైన పద్ధతిలో నిల్వ చేయడం, ఆహార తయారీలో పాల్గొనే వారి వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి శ్రీ శరత్, తెలంగాణ రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ, హైజీన్ ట్రైనర్ నందిని తదితరులు పాల్గొన్నారు.

## కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** కల్యాణలక్ష్మి పథకం కింద మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మంగళవారం మండల పరిధిలోని రాంక్యాతండా, ఈర్లపుడి గ్రామాల్లో కల్యాణలక్ష్మి పథకం కింద లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను ఆత్మ కమిటీ చైర్మన్ దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, మండల కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ వాంకుడోత్ దీపక్ నాయక్ లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి లబ్ది చేకూరుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు గుగులోత్ మూర్తి, కేలోత్ గీత, నాయకులు తేజావత్ వెంకన్న, దేవ్‌సింగ్, ఉప సర్పంచ్ శారద తదితరులు పాల్గొన్నారు.

# డిసిసిబి బ్యాంక్‌లో లోన్ స్కామ్

గూడూరుపాడు నకిలీ
పాస్‌బుక్కుల గుట్టు రట్టు
డిసిసిబి సిఇఒకి ఫిర్యాదు




**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండల డిసిసిబి బ్యాంక్ లోన్ స్కాం కలకలం రేపుతోంది. గూడూరుపాడు రెవెన్యూలోని ఓ భూమి మ్యుటేషన్ అక్రమ వ్యవహారానికి తెరతీసింది. భూమి లేకున్నప్పటికీ పిట్టలవారిగూడెంలోని సర్వేనెంబర్లు 71/1, 1,45,59, 64లపై నకిలీపాస్ పుస్తకం పొంది దాని ద్వారా అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన కుటుంబ సభ్యులపై లోన్ పొందిన ఘటన వెలుగుచూసింది. ఈ ఘటపై ఆ గ్రామానికి చెందిన రామ్మూర్తి అనే వ్యక్తి డిసిసిబి సిఇఒకు కలిసి నేరుగా ఫిర్యాదు చేయడం అక్రమ బాగోతానికి అద్దం పట్టింది. ఈ వ్యహారంతో పాటు డిసిసిబిలో ఇచ్చిన లోన్లపై విచారణ చేస్తే మరిన్ని అక్రమ వ్యవహారాలు వెలుగులోకి వస్తాయని పలువురు పేర్కొంటున్నారు.

**ఆందోళనలో రైతులు...**

అక్రమ పద్ధతిలో భూమి ఎక్కించుకొని లోన్ పొందిన వ్యవహారం వెలుగులోకి రావడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. తమ ఆధీనంలో ఉన్న భూమి ఇతరులపై ఎలా రికార్డ్ అయ్యిందని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. తమకు తెలీకుండా ఎలా సాధ్యమైందంటూ ఆందోళనతో పాటు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనలో అధికారులు వ్యవహరించిన తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కొంతమంది రైతులు ఇప్పటికే తమ భూమి రికార్డులను ఆన్‌లైన్‌లో పరిశీలించడం ప్రారంభించగా, మరికొందరు తహసీల్దార్ కార్యాలయాన్ని ఆశ్రయిస్తున్నారు. వెంటనే పూర్తి స్థాయి విచారణ చేసి, అసలు యజమానుల హక్కులను రక్షించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

**అధికారులపై అనుమానాలు...**

ఈ వ్యహారంలో ఖమ్మంరూరల్ డిసిసిబి అధికారుల పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. లోన్‌కు దరఖాస్తు చేసుకున్న వ్యక్తికి సంబంధించిన ఫీల్డ్ స్థాయి ఎంక్వైరీ తప్పనిసరిగా ఉండాల్సి ఉన్నప్పటికీ, అధికారులు ఇవేమి పాటించలేదని తెలిసింది. కేవలం అమ్యామ్యాల కోసమే తూతూ మంత్రంగా ఒక సర్వే నెంబర్ వద్ద ఫోటో దిగినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. అంతే కాకుండా ఇటువంటి పాస్‌బుక్స్ ఆధారంగా పెద్ద ఎత్తున బ్యాంక్‌లోన్లు ఇచ్చినట్లు ఆరోపణలు వినవస్తున్నాయి. అక్రమానికి సహకారాన్ని అందించిన అధికారుల పాత్రపై లోతైన విచారణ అవసరమని ప్రజలు భావిస్తున్నారు.

**విచారణచేస్తే మరిన్ని వెలుగులోకి...**

అడ్డగోలు వ్యవహారంపై అధికారులు కఠిన చర్యలకు దిగితే, ఇదే తరహా మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని, పలువురు పేర్కొంటున్నారు.ఈ అక్రమాలు ఈ ఒక్క గ్రామానికి పరిమితం కాలేదని, ఇతర గ్రామాల్లో కూడా ఇలాంటి తప్పుడు వ్యహారాలు జరిగి ఉండవచ్చని ప్రజలు తెలుపుతున్నారు. ఈ తప్పిదంపై లోతుగా విచారిస్తే , సంబంధిత అధికారుల పాత్ర, మరిన్ని అక్రమ లావాదేవీలు బైటపడే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు.

## అభివృద్ధి కార్యక్రమాలలో ప్రజల భాగస్వామ్యం

ఎమ్మెల్యే కూనంనేని సహకారంతో
అభివృద్ధి చేసుకుందాం
మేయర్ మూడ్ గణేష్

గైర్హాజరైన అధికారులపై ఆగ్రహం




**ప్రజాపక్షం/పాల్వంచ :** ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలలో ప్రజలు భాగస్వాములు కావాలని, అప్పుడే నాణ్యమైన పనులు జరుగుతాయని కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ అన్నారు. తెలంగాణ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ కెటిపిఎస్ పాల్వంచ యూనిట్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ సహకారంతో ప్రజాపాలన, ప్రగతి నివేదిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఎస్‌పిఎస్ డైరెక్టర్ జనరల్ స్వాతిలక్రా ఆదేశాలతో సోమవారం స్వచ్ఛ తెలంగాణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 41వ డివిజన్ కార్పొరేటర్ గొర్రె అన్నపూర్ణ ఆధ్వర్యంలో రాతిచెరువు కట్టపై చెత్తా చెదారాన్ని, పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. అనంతరం గొర్రె నరేష్ నాయుడు ఆధ్వర్యంలో జరిగిన సభలో మేయర్ గణేష్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన ప్రగతి నివేదికలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులపై నిరంతరం నిఘా పెట్టాలని సూచించారు. అప్పుడే ప్రజలు కోరుకున్న అభివృద్ధి సాక్షాత్కరిస్తుందని తెలిపారు. డివిజన్ సమస్యలను ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సహకారంతో స్థానిక కార్పొరేటర్‌తో కలిసి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. **మున్సిపల్ అధికారులపై ఆగ్రహం:** సుమారు వంద మంది ఎస్‌పిఎఫ్ సిబ్బంది, ప్రజలతో పెద్ద ఎత్తున జరుగుతున్న ప్రజాపాలన కార్యక్రమానికి మున్సిపల్ అధికారులు గైర్హాజర్ కావటంతో మేయర్ గణేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యాన్ని నిలదీశారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత, ఎస్‌పిఎస్ ఇన్‌స్పెక్టర్ కిరణ్, ఎస్ఐలు జి. వెంగళరావు, నాగరాజు, సతీష్, శ్రీనివాస రెడ్డి, ప్రవీన్, వెంకటేశ్వర్లు, సిపిఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, నాయకులు లాల్‌పాషా, ప్ర సాద్, డివిజన్ నాయకులు ఎస్‌పిఎఫ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## 22న ఖమ్మం నగర బంద్




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** వెలుగుమట్ల భూ నిర్వాసితులకు అండగా ఈనెల 22న ఖమ్మం నగర బంద్‌ను నిర్వహిస్తున్నట్లు సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఆవునూరి మధు తెలిపారు. మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో ఆవునూరి మధు మాట్లాడుతూ వెలుగుమట్ల భూదాన్ భూముల్లో ఇండ్లు కూల్చిన వద్దే ఇండ్లను నిర్మించాలని సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ భూ నిర్వాసితులకు అండగా ఉంటూ పోరాడుతుందన్నారు. ఆ పోరాట ఫలితంగానే వారం రోజుల క్రితం 311 మందికి ఇండ్ల పట్టాలను అందించిందన్నారు. ఇంకా పట్టాలు అందించాల్సిన వారు వందల సంఖ్యలో ఉన్నారని వారందరికీ ఇండ్ల పట్టాలను అందించాలని డిమాండ్ చేశారు. అందులో భాగంగానే ఈనెల 22న ఖమ్మం నగర బంద్‌ను తలపెట్టినట్లు మధు తెలిపారు. ఈ బంద్‌లో ప్రజలు, పార్టీశ్రేణులు, వ్యాపార వర్గాలు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బండారు ఐలయ్య, రాష్ట్ర నాయకుడు మందుల రాజేంద్రప్రసాద్, జిల్లా నాయకులు వెంకట్రామిరెడ్డి, వై. ప్రకాష్, ఖాసీం, గిరి, సురేష్, లక్ష్మి, రమేష్, సుదర్శన్, మోహన్‌రావు, జానకి, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి సంస్థను రక్షించేందుకే 'సేవ్ సింగరేణి' జాతా



**ప్రజాపక్షం/మణుగూరు :** సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి గుర్తింపు కార్మిక సంఘం కేంద్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం మణుగూరు లోని అన్ని మైన్స్, డిపార్ట్‌మెంట్ల వద్ద హెచ్ఒడీలకు మెమోరాండం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా అడిషనల్ జనరల్ సెక్రటరీ కామ్రేడ్ మిరియాల రంగయ్య మాట్లాడుతూ సింగరేణి సంస్థను రక్షించేందుకు ఎఐటియుసి ఆధ్వర్యంలో సేవ్ సింగరేణి జాతను 18వ తేదీన శ్రీరాంపూర్‌లో ప్రారంభిస్తున్నట్లు తెలియజేస్తూ, సింగరేణిలో కార్మికుల సమస్యలు పేరుకుపోయి ఉన్నాయని బాధ్యతగల గుర్తింపు కార్మిక సంఘంగా స్ట్రక్చర్ కమిటీ సమావేశాలలో అనేక సమస్యలు ప్రస్తావించగా యాజమాన్యం ఒప్పుకొని అంగీకరించి అమలు జరపడం లేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సిన బకాయిలు రూ. 51,000 కోట్లు వెంటనే చెల్లించాలని అన్నారు. డిస్మిస్ అయిన కార్మికులందరికీ పునర్ నియామకం చేసి మస్టర్ల నిబంధనను తొలగించాలని అన్నారు. కార్మికులకు సంబంధించిన అన్ని క్యాడర్ స్కీమ్ సమీక్షించి సవరించాలని అన్నారు. కార్మికులకు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్య సదుపాయం హైదరాబాద్‌లో కల్పించాలని అన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు హై పవర్ కమిటీ వేతనాలు చెల్లించాలని అన్నారు. సంస్థ రక్షణకై మనుగడ కోసం ఎఐటియుసి ఆధ్వర్యంలో సేవ్ సింగరేణి జాత మార్చి 18న ప్రారంభమై సింగరేణిలోని 12 డివిజన్ల నుండి అన్ని బావులలో కార్మికులను చైతన్యపరచి మార్చి 30వ తేదీన కొత్తగూడెం హెడ్ ఆఫీస్ వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. కార్మికులందరూ ఈ యొక్క సేవ్ సింగరేణి జాతాలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేకల ఈశ్వర్ రావు అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ, ఎం.వి.రాం నర్సయ్య గారు వైస్ ప్రెసిడెంట్, ఆఫీస్ బేరర్ లు ఆవుల నాగరాజు, ఆధర్ల సురేందర్, గోలి గంగాధర్ రావు, బి సురేందర్ రావు, శనిగరం కుమార స్వామి, ఆడెపు రాజశేఖర్, ఫీట్ సెక్రటరీలు ఆంతోటి రవికుమార్, గుంపెన శ్రీనివాసరావు, సాయి ప్రకాష్ చారి, బి రవి, జానకి ప్రసాద్, రాజేందర్, మిట్టపల్లి వెంకటేశ్వర్లు, దరిపల్లి వెంకటేశ్వర్లు, ఇమాముద్దీన్, కిషోర్ బాబు, తెన్నేటి నారాయణ, వైరి వెంకటేశ్వర్లు, దండు విజయ్ పాపారావు, నాగుల సతీష్ హుస్సేన్, కళ్యాణం రవి తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై.. మంత్రి తుమ్మల వీడియో కాన్ఫరెన్స్



**ప్రజాపక్షం/వైరా :** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో ఉన్న సోమవరం రైతువేదిక నందు మంగళవారం రైతు నేస్తం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారి దాసరి పుల్లయ్య, జిల్లా డిహెచ్‌ఎస్‌వో మధుసూదన్, వైరా వ్యవసాయ సంచాలకులు తుమ్మలపల్లి కరుణశ్రీ, మండల వ్యవసాయ అధికారి మయాన్ మంజుఖాన్, టెక్నికల్ అనిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రృకతి వ్యవసాయంపై అన్నదాతలకు పలు సూచనలు చేశారు. అనంతరం జిల్లా వ్యవసాయ అధికారి డి.పుల్లయ్య ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు అవగాహన కల్పించారు.ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు ఫార్మర్ కిట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఇఒలు మేడా రాజేష్, వెంపటి కీర్తి, వాసవంతి, వెంకటనరసయ్య, నారపునేనిపల్లి సర్పంచ్ శీలం చంద్రశేఖర్‌రెడ్డి, తాటిపూడి సర్పంచ్ జవ్వాజి అశ్విని నాగరాజు, ఖానాపురం సర్పంచ్ బాలాజి, ముసలిమడుగు సర్పంచ్ తడికమళ్ల నాగార్జున, పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## నీటిని విడుదల చేయాలి

అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పులిగుండాల ప్రాజెక్టు నుంచి నీటిని తక్షణమే విడుదల చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. పెనుబల్లి మండలంలోని పులిగుండాల ప్రాజెక్టు పరిధిలో గల బ్రహ్మలకుంటతో పాటు పరిసర ప్రాంతాల్లో పంటలు ఎండిపోతున్నాయన్న రైతుల ఆవేదనను గుర్తించిన మంత్రి తుమ్మల తక్షణమే స్పందించారు. ప్రాజెక్టు నుంచి సాగునీటిలో ఉన్న అడ్డంకులను వెంటనే తొలగించి వెయ్యి ఎకరాలకు నీరు అందించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నీటి విడుదలలో ఉన్న సాంకేతిక, పరిపాలన సమస్యలను గుర్తించి రెవెన్యూ, ఫారెస్టు శాఖలు సమన్వయంతో వాటిని అత్యవసరంగా పరిష్కరించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. సాగునీటి విడుదలకు ఎలాంటి అడ్డంకులు ఉండకూడదని రైతు ప్రయోజనాలకు ప్రథమ ప్రాధాన్యతనివ్వాలని మంత్రి తెలిపారు. మంత్రి ఆదేశాల నేపథ్యంలో నీటి విడుదల ప్రక్రియను అధికారులు ప్రారంభిస్తారని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి

అంగన్‌వాడీ కేంద్రానికి విద్యుత్ సరఫరా
పరిసరాలు పరిశుభ్రతగా ఉండాలి
మునిసిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ




**ప్రజాపక్షం/వైరా :** వైరా మునిసిపాలిటీ పరిధిలోని 20వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో విద్యుత్ మీటర్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ మంగళవారం వార్డు కౌన్సిలర్ వుండ్రు వరలక్ష్మి కి విద్యుత్‌శాఖ డిఈ రమేష్‌తో కలిసి అందజేశారు. ఈసందర్భంగా మునిసిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రం అభివృద్ధికి కౌన్సిలర్ వరలక్ష్మి కృషి చేస్తున్నారు. ఇటీవల ప్రజాపాలన ప్రగతి పాలన కార్యక్రమంలో భాగంగా వార్డులో పర్యటించిన జిల్లా కలెక్టర్ దురివెట్టి అనుదీప్ దృష్టికి కౌన్సిలర్ వరలక్ష్మి అంగన్‌వాడీ కేంద్ర సమస్యలను వివరించారు. అందులో భాగంగా ఈ రోజు అధికారులు అంగన్‌వాడీ కేంద్రానికి కావాల్సిన విద్యుత్ సరఫరాకు ఏర్పాట్లకు సంబంధించిన వస్తువులను తీసుకురావడం జరిగిందని ఆమె అన్నారు. అంగన్‌వాడీ కేంద్రం ప్రాంగణంలో శుభ్రత అవసరమని, పిల్లలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని చైర్‌పర్సన్ చంద్రకళ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ మెడికల్ అండ్ హెల్త్ చైర్మన్ డాక్టర్ కాపా ముళీకృష్ణ, వుండ్రు శ్యామ్‌బాబు, మాజీ కౌన్సిలర్ గుగులోతు లక్ష్మి బాయి, పొదిలి హరినాథ్, తేజావత్ నాగేశ్వరరావు, గుగులోత్ విజయ్, తాడి రాజు, పృథ్వి, లైన్ ఇన్‌స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

## రైల్వేలైన్ భూసేకరణ పరిహారంపై

# కొలిక్కిరాని చర్చలు

జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం




**ప్రజాపక్షం/కారేపల్లి :** డోర్నకల్, భద్రాచలం రోడ్ రైల్వే లైన్ డబ్లింగ్ పనుల కోసం భూసేకరణకు సంబంధించిన పరిహారం రేట్లపై మంగళవారం ఖమ్మం కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరి, సింగరేణి గ్రామానికి చెందిన భూ నిర్వాసితులు పాల్గొన్నారు. ఈసమావేశంలో పరిహారం రేట్లపై తీవ్ర చర్చ జరిగినప్పటికీ, నిర్ణయం కొలిక్కి రాలేదు. వ్యవసాయ భూములకు ఎకరానికి రూ. 91లక్షలు, ఇళ్ల స్థలాలకు గజానికి రూ. 20వేల చొప్పున పరిహారం ఇవ్వాలని బాధితులు డిమాండ్ చేశారు. అయితే అధికారులు ఆ రేట్లు సాధ్యం కాదని పేర్కొంటూ, ఎకరానికి రూ. 18లక్షలు, గజానికి రూ. 6300 మాత్రమే చెల్లిస్తామని స్పష్టం చేశారు. నిర్మించిన ఇళ్లకు సంబంధించి ఆర్అండ్‌బి శాఖ అంచనాల ప్రకారం అదనపు పరిహారం కలిపి ఒక బాధితుడికి సుమారు రూ 46లక్షలు వచ్చే అవకాశం ఉందని అధికారులు వివరించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో అమలైన రేట్లనే ఇక్కడ కూడా అమలు చేస్తామని చెప్పారు. అయితే నాన్ ఏజెన్సీ ప్రాంతాల్లో భూముల మార్కెట్ విలువను పరిగణనలోకి తీసుకుని న్యాయం చేయాలని నిర్వాసితులు కోరారు. ఈ అంశంపై మరోసారి సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకుంటామని అధికారులు తెలిపారు. తమకు న్యాయమైన పరిహారం చెల్లించాలని కోరుతూ సింగరేణి సర్పంచ్ మేదరి వీరప్రతాప్ ఆధ్వర్యంలో నిర్వాసితులు జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈసమావేశంలో తహసీల్దార్ రమేష్, రైల్వే జేఈ శ్రీకాంత్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

## రెప్పపాటులో తప్పిన ప్రమాదం

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలంలోని మంగాపురం తండాకు చెందిన తేజావత్ కోటేశ్వరరావు ఇంటి పైకప్పు శిథిలావస్థలో ఉండటంతో పెచ్చులూడి పడ్డాయి. మంగళవారం ఉదయం కోటేశ్వరరావు భార్య బుజ్జి భర్త కోటేశ్వరరావుకు భోజనం పెట్టేందుకు ఇంట్లోకి వెళ్లి అన్నం పెట్టుకుని వస్తుండగా భారీ శబ్దంతో పెచ్చులూడి పడ్డాయి. రెప్పపాటులో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. పెచ్చులు సామాన్లపై పడటంతో అవి దెబ్బతిన్నాయి. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న కోటేశ్వరరావు అప్పటి వరకు ఇం ట్లో ఉన్నాడు. కాసేపు బయట ఉందామని అప్పుడే బయటకు వెళ్లాడు. ఆయనకు భోజనం తెచ్చేందుకు వెళ్లిన సమయంలోనే ఈ ప్రమాదం జరిగింది.

# ఆస్పత్రిపై దాడి యుద్ధ నేరమే

## ఆఫ్ఘన్ క్రికెటర్ రషీద్ ఖాన్




**బాగ్దాద్ :** ఆఫ్ఘనిస్తాన్‌లోని ఓ డ్రగ్స్ చికిత్సాలయంపై సోమవారం రాత్రి పాకిస్థాన్ ఆకస్మిక దాడి చేసింది. ఆ దాడిలో కాబూల్‌లోని ఆస్పత్రిలో 400 మంది మృతిచెందగా, మరో 250 మంది గాయపడ్డారు. డ్రగ్ రిహాబిలిటేషన్ ఆస్పత్రిపై రాత్రి 9 గంటలకు దాడి జరిగినట్లు ఆఫ్ఘన్ ప్రభుత్వ ప్రతినిధి హమ్దుల్లా ఫిత్రత్ తెలిపారు. అయితే ఈ ఘటన పట్ల ఆఫ్ఘన్ క్రికెటర్ రషీద్ ఖాన్ స్పందించారు. పాక్ మిలిటరీ చర్యను ఆయన ఖండించారు. పాకిస్థాన్ వైమానిక దాడులతోనే ఈ ప్రాణనష్టం జరిగినట్లు ఆ క్రికెటర్ చెప్పారు. పవిత్రమైన రంజాన్ మాసం సమయంలో ఈ దాడి జరగడం దారుణమన్నారు. తన ఎక్స్ అకౌంట్‌లో రషీద్ ఖాన్ స్పందించారు. సాధారణ పౌరులు చనిపోవడం బాధగా ఉందన్నారు. ఇండ్లను, విద్యా సంస్థలను, వైద్య కేంద్రాలను కావాలని లేదా అనుకోకుండా అటాక్ చేసినా అది యుద్ధ నేరమే అవుతుందని రషీద్ పేర్కొన్నారు. రంజాన్ పవిత్ర మాసం వేళ మనుషుల ప్రాణాలు విలువ ఇవ్వకుండా వ్యవహరిస్తున్న తీరు తీవ్రంగా కలచివేస్తున్నట్లు చెప్పారు. దీని వల్ల వైరం, ద్వేషం పెరుగుతుందన్నారు. ఐక్యరాజ్యసమితి, ఇతర మానవ హక్కుల సంఘాలు ఈ ఘటన పట్ల దర్యాప్తు చేపట్టాలని కోరారు. బాధ్యులను శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి కష్ట సమయంలో ఆఫ్ఘన్ ప్రజలకు అండగా ఉండనున్నట్లు చెప్పారు.

# టి-20ల్లో అమేలియా కొత్త చరిత్ర

## అత్యంత వేగంగా వెయ్యి పరుగులు, వంద వికెట్లతో రికార్డు!

అంతర్జాతీయ క్రికెట్‌లో న్యూజిలాండ్ క్రికెటర్ అమేలియా కేర్ చరిత్ర సృష్టించింది. స్వదేశంలో దక్షిణాఫ్రికాతో జరుగుతున్న ద్వైపాక్షిక సిరీస్‌లో చెలరేగిపోతున్న కివీస్ కెప్టెన్ రెండో టి-20 మ్యాచ్‌లో వందో వికెట్ సాధించింది. తద్వారా టి-20 ల్లో ఆమె అరుదైన మైలురాయిని అధిగమించింది. పొట్టి ఫార్మాట్లో అత్యంత వేగంగా వెయ్యికి పైగా పరుగులు బాదేసి, వందకు పైగా వికెట్లు తీసిన మహిళా క్రికెటర్‌గా అమేలియా అవతరించింది. ఈ ఆల్‌రౌండర్ 94వ ఇన్నింగ్స్‌లోనే ఈ ఫీట్




సొంతం చేసుకుంది. సంచలనాలకు నెలవైన టి-20ల్లో అమేలియా జోరు కొనసాగిస్తోంది. ఇటీవల కాలంలో బ్యాటుతో, బంతితో చెలరేగిపోతున్న కివీస్ క్రికెటర్. నిరుడు టి-20ల్లో తొలి సెంచరీతో రికార్డులకెక్కింది. తాజాగా స్వదేశంలో దక్షిణాఫ్రికాపై పంజా విసురుతున్న అమేలియా అత్యంత వేగంగా వంద వికెట్ల క్లబ్‌లో చేరింది. తద్వారా ఈ ఫార్మాట్‌లో అత్యంత వేగంగా వెయ్యికి పైగా పరుగులు, వందకు పైగా వికెట్లతో చరిత్ర లిఖించిందీ డాషింగ్ బ్యాటర్. మొత్తంగా.. తమ దేశం నుంచి ఈ ఘనత సాధించిన మూడో క్రికెటర్ తనే. ఆమె కంటే ముందు సోఫీ డెవినె, మిచెల్ శాంట్నర్ ఈ మార్క్ అందుకున్నారు. ఓవరాల్‌గా చూస్తే.. అసోసియేట్ నేషన్స్ క్రికెటర్ క్యారీ చాన్ 74 ఇన్నింగ్స్‌లోనే ఈ మైలురాయిని దాటింది. పురుషుల క్రికెట్‌లో బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ షకీబుల్ హసన్ అగ్రస్థానంలో ఉన్నాడు. ఈ వెటరన్ ఆటగాడు 84 ఇన్నింగ్స్‌లో వెయ్యికి పైగా రన్స్, వందకు పైగా వికెట్లు సాధించాడు. మహిళా క్రికెటర్ల పరంగా చూసుకుంటే దీప్తి శర్మ (భారత్), నిడాదార్(పాకిస్థాన్), ఎలీసా పెర్రీ(ఆస్ట్రేలియా), సోఫీ డెవినె(న్యూజిలాండ్), హేలీ మాథ్యూస్(వెస్టిండీస్)లు ఈ క్లబ్‌లో ఉన్నారు.

# మహిళ


# ఆర్థిక సాక్షరత

మహిళల ఆర్థిక సాక్షరత అనేది కేవలం డబ్బు గురించి అవగాహన కలిగి ఉండటం మాత్రమేనని చాలా మంది అనుకుంటారు. కానీ, నిజానికి ఆదాయం సంపాదించడం, ఖర్చులను నియంత్రించడం, పొదుపు చేయడం, పెట్టుబడులు పెట్టడం, అప్పులను నిర్వహించడం, భవిష్యత్తు భద్రతను నిర్మించడం వంటి సమగ్ర ఆర్థిక సామర్థ్యాల సమాహారంగా ఆర్థిక సాక్షరతను చూడాల్సి ఉంటుంది. ఆధునిక సమాజంలో మహిళల విద్య, ఉద్యోగాలు, వ్యాపార అవకాశాలు పెరుగుతున్నప్పటికీ, ఆర్థిక నిర్ణయాల్లో స్వతంత్రత మాత్రం ఇంకా పరిమితంగానే ఉంది. భారతదేశంలో సుమారు 21 శాతం మహిళలకే పూర్తి స్థాయి ఆర్థిక సాక్షరత ఉందని వివిధ అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఇది కేవలం వ్యక్తిగత సమస్య కాకుండా సామాజికఆర్థిక అసమానతలకు కారణమవుతున్న నిర్మాణాత్మక సమస్యగా చూడాలి. మహిళల ఆర్థిక స్వాతంత్ర్యం కుటుంబ స్థాయిలోనే కాదు, దేశ ఆర్థిక వ్యవస్థలో కూడా కీలక పాత్ర పోషిస్తుంది. డబ్బును అర్థం చేసుకునే సామర్థ్యం ఉన్న మహిళలు ఉద్యోగంలో మంచి నిర్ణయాలు తీసుకుంటారు. వ్యాపారాలు ప్రారంభించడానికి, ఆదాయాన్ని విస్తరించడానికి, ఆర్థిక ప్రమాదాలను తగ్గించడానికి ఎక్కువ అవకాశాలు అందిపుచ్చుకుంరు. ఆర్థిక అవగాహన లేకపోతే సంపాదించిన ఆదాయం ఉన్నప్పటికీ దీర్ఘకాలిక సంపద నిర్మాణం సాధ్యం కాదు. అందుకే మహిళల ఆర్థిక సాక్షరతను అభివృద్ధి చేయడం అభివృద్ధి విధానాల్లో ప్రధాన లక్ష్యంగా మారుతోంది. భారతీయ సమాజంలో లింగ అసమానతలు ఆర్థిక రంగంలో స్పష్టంగా కనిపిస్తాయి. చాలా కుటుంబాల్లో ఆదాయం సంపాదించే మహిళలు ఉన్నప్పటికీ, పెట్టుబడులు, బీమా, ఆస్తి కొనుగోలు వంటి నిర్ణయాలు పురుషుల చేతుల్లోనే ఉంటాయి. దీని వల్ల మహిళలు తమ సొంత ఆర్థిక స్థితి గురించి స్పష్టమైన అవగాహన లేకుండా జీవించాల్సి వస్తుంది. ఉద్యోగ విరామాలు, ప్రసూతి కాలం, కుటుంబ బాధ్యతలు



వంటి కారణాల వల్ల మహిళల ఆదాయం నిరంతరంగా ఉండకపోవడం కూడా ఆర్థిక ప్రణాళికలో సమస్యలను సృష్టిస్తుంది. ఈ పరిస్థితుల్లో ఆర్థిక సాక్షరత మహిళలకు భద్రతా కవచంలా పనిచేస్తుంది. ఆర్థిక సాక్షరతలో మొదటి ముఖ్యమైన అంశం బడ్జెట్ నిర్వహణ. వ్యక్తి సంపాదన ఎంత, ఖర్చులు ఎంత, పొదుపు ఎంత అనే సమతుల్యతను అర్థం చేసుకోవడం ఆర్థిక స్థిరత్వానికి మూలాధారం.


## పొదుపు అవసరం



సాధారణంగా వ్యక్తిగత ఆదాయంలో అప్పుల చెల్లింపులు 30 శాతం దాటకూడదని ఆర్థిక నిపుణులు సూచిస్తారు. అదే సమయంలో కనీసం 30 శాతం ఆదాయాన్ని పొదుపుగా నిల్వ చేయడం భవిష్యత్తు భద్రతకు అవసరం. ఈ అలవాటు చిన్న మొత్తాలతో ప్రారంభమైనప్పటికీ కాలక్రమేణా పెద్ద ఆర్థిక బలంగా మారుతుంది. పొదుపు, పెట్టుబడుల మధ్య తేడా అర్థం చేసుకోవడం కూడా మహిళల ఆర్థిక విద్యలో కీలక దశ. చాలా మంది మహిళలు బ్యాంక్ సేవింగ్స్ ఖాతా లేదా బంగారం కొనుగోలును మాత్రమే భద్రతగా భావిస్తారు. అయితే ద్రవ్యోల్బణం కారణంగా డబ్బు విలువ కాలక్రమేణా తగ్గుతుంది. అందువల్ల మ్యూచువల్ ఫండ్లు, పింఛన్ పథకాలు, దీర్ఘకాల పెట్టుబడులు వంటి మార్గాలను అర్థం చేసుకోవడం అవసరం. చిన్న వయస్సులోనే పెట్టుబడులు ప్రారంభిస్తే చక్రవడ్డీ ప్రభావం వల్ల సంపద వేగంగా పెరుగుతుంది. బీమా అవగాహన కూడా మహిళ ల ఆర్థిక భద్రతలో మరో కీలక అంశం. ఆరోగ్య బీమా. జీవిత బీమా కుటుంబాన్ని ఆర్థిక సంక్షోభాల నుంచి రక్షిస్తాయి. చాలా సార్లు మహిళలు భర్త ఉద్యోగం ద్వారా వచ్చే బీమాపై ఆధారపడుతుంటారు. కానీ వ్యక్తిగత బీమా లేకపోతే ఉద్యోగ మార్పులు లేదా కుటుంబ పరిస్థితుల మార్పుల సమయం లో ప్రమాదం ఏర్పడుతుంది. తమ పేరుతో బీమా తీసుకోవడం ఆర్థిక స్వతంత్రతకు సూచిక. రిటైర్మెంట్ ప్రణాళిక మహిళలకు మరింత ముఖ్యమైనది. మహిళల సగటు జీవితకాలం పురుషుల కంటే ఎక్కువగా ఉండటం వల్ల వృద్ధాప్యంలో ఎక్కువ కాలం ఆర్థిక భద్రత అవసరం అవుతుంది. అయితే ఉద్యోగ విరామాలు, తక్కువ వేతనాల కారణంగా పింఛన్ పొదుపులు తక్కువగా ఉండే అవకాశం ఉంది. అందువల్ల చిన్నమొత్తాలతోనైనా నిరంతరంగా రిటైర్మెంట్ ఫండ్ నిర్మించడం అవసరం.

దీర్ఘకాలిక పెట్టుబడులు వృద్ధాప్యంలో ఆర్థిక ఆధారాన్ని తగ్గిస్తాయి. మహిళల ఆర్థిక సాక్షరత సామాజిక అసమానతలను తగ్గించడంలో కూడా సహాయపడుతుంది. స్త్రీపురుషుల ఆధారంగా సాగుతున్న వేతన వ్యత్యాసం సమస్యను ఎదుర్కోవడంలో ఆర్థిక అవగాహన కీలకం. తమ పనికి సరైన పారితోషికం కోరడం, వేతన చర్చలు జరపడం, ఉద్యోగ ప్రయోజనాలను అర్థం చేసుకోవడం వంటి సామర్థ్యాలు ఆర్థిక జ్ఞానంతో వస్తాయి. ఆర్థికంగా అవగాహన ఉన్న మహిళలు ఉద్యోగ అవకాశాలను వ్యూహాత్మకంగా ఎంచు

## దీర్ఘకాల పెట్టుబడులు



కోవడంలో ముందుంటారు. వ్యాపార రంగంలో కూడా ఆర్థిక విద్య ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. చిన్న స్థాయి స్వయం ఉపాధి నుండి పెద్ద వ్యాపారాల వరకు విస్తరించాలంటే లాభనష్టాల విశ్లేషణ, పెట్టుబడి నిర్వహణ, నగదు ప్రవాహ నియంత్రణ వంటి అంశాలు తెలుసుకోవాలి. ఆర్థిక అవగాహన ఉన్న మహిళా వ్యాపారులు తమ వ్యాపారాన్ని నిలబెట్టుకోవడంలో ఎక్కువ విజయాన్ని సాధిస్తారని పరిశోధనలు సూచిస్తున్నాయి. ఇది కుటుంబ ఆదాయాన్ని మాత్రమే కాదు స్థానిక ఆర్థిక వ్యవస్థను కూడా బలోపేతం చేస్తుంది. అయితే మహిళలు ఆర్థిక సాక్షరత సాధించడంలో అనేక అడ్డంకులు ఎదుర్కొంటున్నారు. పితృస్వామ్య సమాజాల్లో మహిళలకు డబ్బు నిర్వహణ నేర్పే అవకాశాలు తక్కువగా ఉంటాయి. చిన్నప్పటి నుంచే ఆర్థిక నిర్ణయాలు పురుషుల బాధ్యతగా భావించడం వల్ల మహిళలు ఆ రంగానికి దూరమవుతారు. గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ బ్యాంకింగ్ సేవలకు ప్రాప్యత లేకపోవడం కూడా ఒక పెద్ద సమస్య. విడాకులు లేదా కుటుంబ విభేదాల తర్వాత ఐదుగురిలో ఒక మహిళ పేదరికానికి చేరే ప్రమాదం ఉందని కొన్ని పరిశోధనలు తెలియజేస్తున్నాయి. ఈ పరిస్థితిని నివారించడానికి 'అత్యవసర నిధి' నిర్మించడం అవసరం.

# ఐపిఎల్ కోసం రంగంలోకి ముంబై దిగ్గజం



పంతొమ్మిదో సీజన్ ఐపిఎల్ కోసం రోహిత్ శర్మ సిద్ధమవుతున్నాడు. రెండు రోజుల క్రితం కుటుంబంతో కలిసి మాల్దీవ్స్‌లో వెకేషన్‌లో సరదాగా గడిపిన రోహిత్.. స్వదేశం వస్తూనే నేరుగా ముంబై స్క్వాడ్‌తో కలిశాడు. మంగళవారం సహచరులు, కోచ్ మహేల జయవర్ధనేతో కాసేపు ముచ్చటించిన హిట్‌మ్యాన్.. కిట్ బ్యాగ్‌తో మైదానంలోకి దిగాడు. నెట్స్‌లో బ్యాటింగ్, ఫీల్డింగ్.. ప్రాక్టీస్ చేసిన రోహిత్ ఐపిఎల్‌లో రఫ్ఫాడించాలనే కసితో ఉన్నాడు. ఐపిఎల్ దిగ్గజ కెప్టెన్లలో ఒకడైన రోహిత్ శర్మ మరో సీజన్‌కు రెడీ అవుతున్నాడు. గత సీజన్‌లో దంచేసిన హిట్‌మ్యాన్ (15 మ్యాచుల్లో 418 పరుగులు) ఈసారీ శుభారంభాలు ఇవ్వాలనే కసితో ఉన్నాడు. మంగళవారం ముంబై స్క్వాడ్‌తో కలిసిన రోహిత్ వెంటనే బ్యాటింగ్ ప్రాక్టీస్ మొదలెట్టాడు. శార్దూల్ ఠాకూర్, ఇతర ముంబై బౌలర్లను కాచుకున్న అతడు.. డిఫెన్స్, భారీ షాట్లు సాధన చేశాడు. అనంతరం సహచరులతో కలిసి ఫీల్డింగ్ చేశాడు. మొన్నటి వరకూ టి-20 ప్రపంచకప్ అంబాసిడర్‌గా మైదానాల్లో సందడి చేసిన రోహిత్.. కాస్త బ్రేక్‌లో మాల్దీవ్స్‌లో కుటుంబంతో కలిసి సేదతీరాడు. ఐపిఎల్‌కు కౌంట్‌డౌన్ తన కెప్టెన్సీలో ముంబైని ఐదుసార్లు (2013, 2015, 2017, 2019, 2020) ముంబైని ఛాంపియన్‌గా నిలిపిన రోహిత్.. గత రెండేళ్లుగా హార్దిక్ పాండ్యా సారథ్యంలో ఆడుతున్నాడు.

**పాంటింగ్ వారసుడిగా...** పంతొమ్మిదో సీజన్ కు మరో పది రోజులే ఉండడంతో ఈ దిగ్గజ ఆటగాడు ప్రాక్టీస్ మొదలెట్టాడు. ఐపిఎల్ ఆరంభంలో దక్కన్ ఛార్జర్స్ తరఫున విజేతగా నిలిచిన రోహిత్.. ఆపై ముంబై ఇండియన్స్ గూటికి చేరాడు. అక్కడ రికీ పాంటింగ్ వారసుడిగా 2013లో సారథ్యం స్వీకరించిన ముంబైకర్ విజయవంతమైన నాయకుడిగా చరిత్రకెక్కాడు.

# వారసత్వ ఉద్యోగాలు పాత పద్ధతిలోనే అమలు చేయాలి

## వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్



**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :** సింగరేణి సంస్థలో వారసత్వ ఉద్యోగాలను పాత పద్ధతిలోనే అమలు చేయాలని సింగరేణి కార్మిక సంఘం (ఎఐటియుసి) రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. సింగరేణి వ్యాప్తంగా పేరుకుపోయిన కార్మిక సమస్యల పరిష్కారం కోసం మంగళవారం అన్ని గనులపై ఎఐటియుసి ఆధ్వర్యంలో ధర్నాలు నిర్వహించి వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి హాజరై సీతారామయ్యమాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం నుంచి సంస్థకు రావాల్సిన బకాయిలను వెంటనే రాబట్టాలన్నారు. కార్మికుల సొంతింటి కలను నెరవేర్చాలని, అధికారులకు ఇస్తున్నట్లుగానే కార్మికుల పెర్క్‌పై ఆదాయపు పన్నును యాజమాన్యమే చెల్లించాలని డిమాండ్ చేశారు. నూతన గనులను ప్రారంభించాలని, మారుపేర్ల సమస్యను పరిష్కరించాలన్నారు. కాంట్రాక్టు కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం ఈనెల 18న ఆర్కే7 గని నుండి సేవ్ సింగరేణి జాతా ప్రారంభిస్తున్నామని, 30న కొత్తగూడెంలో ధర్నాతో ముగుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కందికట్ల వీరభద్రయ్య, ముష్కె సమ్మయ్య, ఎస్‌కె.బాజీ సైదా, కొట్టే కిషన్ రావు, మోత్కూరి కొమురయ్య, రాచర్ల చంద్రమోహన్, బద్రి బుచ్చయ్య, అఫ్రోజ్ ఖాన్, దాడి రాజయ్య, మురళీచౌదరి పాల్గొన్నారు.

# మునిసిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె

## కార్మిక సంఘాల నాయకుల హెచ్చరిక




**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** మునిసిపల్ కార్మికుల సమస్యలు 14 రోజుల్లో పరిష్కరించకపోతే సమ్మెకు వెళ్తామని కార్మిక సంఘాల నాయకులు హెచ్చరించారు. మంగళవారం ఎఐటియుసి, సిఐటియు, టియుసిఐ సంఘాల ఆధ్వర్యంలో మునిసిపల్ కార్మికులు, డ్రైవర్ల పాత మునిసిపల్ కార్యాలయం నుంచి కోర్టు చౌరస్తా, ధర్నా చౌక్ మీదుగా కొత్త మునిసిపల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి కమిషనర్ చాంబర్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా కార్యదర్శి ఓమయ్య, టియుసిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఏ.రమేష్‌బాబు, డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు లక్ష్మ ణ్ మాట్లాడుతూ కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే సమ్మెకు వెళ్తామని అడిషనల్ కమిషనర్ పి.రవిందర్ సాగర్‌కి సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో మునిసిపల్ కార్మిక సంఘాల నాయకులు భూపతి, రాజేశ్వర్, కిరణ్, గోవర్ధన్, రవి, శివకుమార్, భానుచందర్, మహేశ్, యాదమ్మ, లక్ష్మి , శైలజ, కిరణ్, లింగం తదితరులు పాల్గొన్నారు.

# సబ్ ప్లాన్ నిధుల ఖర్చుపై శ్వేతపత్రం

## డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ డిమాండ్



**ప్రజాపక్షం/భువనగిరి :** రాష్ట్రంలో దళితులు, అభివృద్ధి కోసం కేటాయిస్తున్న ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ నిధుల వినియోగంపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్ పిఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. దళిత హక్కుల పోరాట సమితి యాదాద్రి భువనగిరి జిల్లా సమితి సమావేశం మంగళవారం స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయంలో కాశపాక దయాకర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మారుపాక అనిల్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్లో ప్రతి సంవత్సరం ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ కింద వేల కోట్ల రూపాయలు కేటాయిస్తున్నప్పటికీ, ఆ నిధులు నిజంగా దళితులు, ఆదివాసుల అభివృద్ధికే ఖర్చవుతున్నాయా లేదా అన్న విషయంపై స్పష్టత లేకపోవడం ఆందోళనకరమన్నారు. సబ్ ప్లాన్ చట్టం ప్రకారం దళితులు, ఆదివాసుల జనాభా శాతానికి అనుగుణంగా నిధులు కేటాయించి, ఆ వర్గాల విద్య, ఉపాధి, ఆరోగ్యం, గృహాలు, భూమి పంపిణీ వంటి రంగాల్లో అభివృద్ధి కోసం ఖర్చు చేయాలి. కానీ అనేక శాఖలు ఈ నిధులను ఇతర పథకాల కింద చూపించడం లేదా ఖర్చు చేయకుండా నిల్వ చేయడం జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే గత సంవత్సరాల్లో ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ కింద కేటాయించిన మొత్తం నిధులు, ఖర్చు చేసిన మొత్తం, మిగిలిన నిధులు మరియు అవి ఏ పథకాలపై ఖర్చు అయ్యాయన్న వివరాలతో కూడిన పూర్తి స్థాయి శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే సబ్ ప్లాన్ నిధులను ఇతర అవసరాలకు మళ్లింపులు చేయకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, దళితులు మరియు ఆదివాసుల అభివృద్ధికి ఈ నిధులు పూర్తిగా వినియోగించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. లేదంటే దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ దళితులు ఇంకా విద్య, ఉపాధి, ఆర్థిక రంగాల్లో తీవ్ర వెనుకబాటుతనాన్ని ఎదుర్కొంటున్న నేపథ్యంలో సబ్ ప్లాన్ నిధులు వారికి అత్యంత అవసరమన్నారు. అయినప్పటికీ ఈ నిధుల వినియోగంలో ప్రభుత్వం పారదర్శకత పాటించకపోవడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. సమావేశంలో డిహెచ్‌పిఎస్ జిల్లా కార్యదర్శి సలిగంజి వీరాస్వామి, జిల్లా నాయకులు ఇంజ హేమలత, భాగ్య, కొమ్ము బాలనర్సింహా, లింగస్వామి, మూల పోచయ్య, చెడె సుందర్, శాంతి కుమార్, రమేష్, స్వామి, మనోహరమ్మా తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ(ఎం) రాష్ట్ర నాయకుడు భీమ్‌రావు సిపిఐలో చేరిక

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** సిపిఐ(ఎం) మాజీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, గిరిజన సంఘం మాజీ రాష్ట్ర కార్యదర్శి తోడసాం భీమ్‌రావు మంగళవారం సిపిఐలో చేరారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఎస్.విలాస్, సిపిఐ నిర్మల్ జిల్లా కార్యదర్శి భూక్యా రమేష్, సీనియర్ నాయకులు ఎస్ఎన్.రెడ్డి సమక్షంలో చేరిక కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విలాస్ మాట్లాడుతూ తోడసాం భీమ్‌రావు వంటి చురుకైన యువ నాయకులు సిపిఐలో చేరడం అభినందనీయమన్నారు. భీమ్‌రావు రాకతో నిర్మల్ జిల్లాలో పార్టీతో పాటు గిరిజన సంఘం మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి భూక్యా రమేష్ మాట్లాడుతూ జిల్లాలో సిపిఐలోకి వలసలు కొనసాగుతాయని, రాబోయే కాలంలో సిపిఐ ఒక బలమైన రాజకీయ శక్తిగా అవతరించబోతోందన్నారు. రాబోయే జడ్‌పిటిసి, ఎంపిటిసి ఎన్నికల్లో సిపిఐ ఒంటరిగానే బరిలోకి దిగుతుందన్నారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు కోట్ల నారాయణ, అనంత్‌రావు, డిహెచ్‌పిఎస్ ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# మూడో ప్రపంచయుద్ధం తెచ్చేందుకు ట్రంప్ కుట్రలు

## సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ప్రపంచ దేశాలను తన గుప్పిట్లో ఉంచుకునేందుకు అమెరికా అధ్యక్షులు ట్రంప్ మూడో ప్రపంచ యుద్ధానికి కుట్రలు చేస్తున్నాడని, యుద్ధాన్ని వెంటనే నిలిపి వేసి ప్రపంచ శాంతిని కాపాడాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు కోరారు. ఇరాన్‌పై అమెరికా యుద్ధంతోపాటు కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలకు నిరసనగా మంగళవారం సిపిఐ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించి జిల్లా కేంద్రంలోని రాఘవా ప్లాజా వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్ సంస్థలను తనవశం చేసుకునేందుకు ట్రంప్ యుద్ధానికి తెరలేపాడన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్వార్థంతో చేసే స్వార్థపూరిత ఆలోచనలను ప్రపంచ దేశాలు ఖండించాలన్నారు. యుద్ధానికి వ్యతిరేకంగా ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడు నిరసన తెలుపాల్సిన అవసరముందన్నారు. యుద్ధంపై మన దేశ ప్రధాని మోదీ నోరు మెదపకనే గ్యాస్ ధరలు పెరిగాయన్నారు. తక్షణమే మోదీ నోరు విప్పి ప్రపంచ శాంతిని కాపాడాలన్నారు. దేశవ్యాప్తంగా సిపిఐ నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాల్లో భాగంగా సూర్యాపేటలో యుద్ధానికి వ్యతిరేకంగా పెంచిన గ్యాస్ ధరలకు నిరసనగా ధర్నా నిర్వహించినట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, నాయకులు రేగటి లింగయ్య, ఎండి పాషా, పొదిల వెంకటమ్మ, దేశగాని హేమలత, ఐతరాజు లింగయ్య, అయితగాని కామేష్, రెడ్డిమల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




## గ్యాస్ కొరత, ధరల పెరుగుదలకు బిజెపి ప్రభుత్వ విధానాలే కారణం

**వరంగల్ :** గ్యాస్ కొరత ధరల పెరుగుదలకు బిజెపి ప్రభుత్వ వినాధాలే కారణంమని సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా ఆరోపించారు. ఇరాన్‌పై అమెరికా ఇజ్రాయిల్ యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో వరంగల్ జిల్లాలో నిరసన ధర్నా కార్యక్రమాలు నిర్వహించారు. ఖిలా వరంగల్ మండల కేంద్రంలో వరంగల్, ఖమ్మం జాతీయ రహదారిపై సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమంలో షేక్ బాష్ మియా మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రపంచ నియంతగా వ్యవహరిస్తూ తన ఆధిపత్యాన్ని చలాయించడం కోసం ప్రభుత్వ అధినేతలను ఎత్తుకెళ్లి నిర్బంధించడం, ఇరాన్‌పై ఇజ్రాయెల్ తో కలిసి ఏకపక్షంగా దాడులు నిర్వహించి ప్రపంచ సంక్షోభానికి కారణమవుతున్నా ప్రధాని నరేంద్రమోడీ ఆమెరికాను పల్లెత్తు మాట అనకుండా అమెరికాకు దాసోహమై




దేశ స్వారభౌమత్వాన్ని మంటగలిపారన్నారు. గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ ధర ఒకేసారి రూ.60 పెంచడం, గ్యాస్ సిలిండర్ల తీవ్ర కొరత ఏర్పడడంతో హోటల్స్, హాస్టల్స్ మూసి వేసుకోవాల్సిన పరిస్థితి దాపురించి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రధాని నరేంద్రమోడీ బాధ్యతా రహితమైన విధానాలే దీనికి కారణమన్నారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన ధరలను తగ్గించి, బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శి దండు లక్ష్మ ణ్ ,జిల్లా కార్యవర్గ సభ్యులు సంఘీ ఏలేందర్, జిల్లా సమితి సభ్యులు తాళ్లపల్లి జాన్ పాల్, యాకాంబ్ర చారి, సుంకరి భవాని, రాజేందర్ నాయకులు, ఎండి యాకూబ్, జెట్టి విజయలక్ష్మి , బాశెట్టి ఉమ, శ్రీను, ప్రభాకర్, కరుణాకర్, తస్లీం, ఖాజామైనుద్దీన్, ఆరోగ్యం, గౌతమి, రాజాలు, ఇమానియల్, తదితరులు పాల్గొన్నారు.

# 22న ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ప్రారంభం

ఎలాంటి పొరపాట్లకు తావివ్వొద్దు
సిఎం పర్యటనలో
అన్నీ ప్రోటోకాల్ ప్రకారం జరగాలి
కలెక్టర్ హైమావతి

**ప్రజాపక్షం/సిద్దిపేట:** రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనలో ఏలాంటి చిన్న పొరపాట్లకు తావివ్వకుండ వివిధ శాఖలకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ హైమావతి అన్నారు. ఈనెల 22న సిద్ది పేట జిల్లా నంగునూరు మండలం నర్మెట్ట గ్రామంలో అయిల్‌పామ్ ప్యాక్టరీని ప్రారంభించనున్నటు కలెక్టర్ తెలిపారు. మంగళవారం నర్మెట్ట గ్రామంలోని అయిల్ ఫామ్ ప్యాక్టరీని కలెక్టర్ హైమావతి,వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, విజయ ఎండి చంద్రశేఖర్‌లో సందర్శించారు. హెల్‌ప్యాడ్ ఏర్పాటు, బహిరంగసభ స్టేజీ ఏర్పాటు. రైతు మేళాస్టాళ్ల ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫ్యాక్టరీ ప్రారంభం., స్టాళ్లు, శిలాఫలకం. ఆవిష్కరణ తదితర అన్ని కార్యక్రమాలు ప్రోటోకాల్ ప్రకారం ఉండాలని. అదేవిధంగా ఈకార్యక్రమానికి వచ్చే రైతులకు ఏలాంటి ఇబ్బంది కలుగకుండ తాగునీరు,మరుగుదొడ్లు, తదితర అన్ని సౌకర్యాలు కల్పించాలని, అధికారులు సూచించిన విధంగా స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. వ్యవసాయ సంచాలకులు గోపి మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులందరికి ఉపయోగపడేవిధంగా గొప్ప కార్యక్రమమైన అయిల్ ఫామ్ ప్యాక్టరీని ప్రారంభోత్సవం అన్నారు. ప్యాక్టరీ ప్రారంభోత్సవంతో పాటు రైతు మేళాకు వచ్చే వేలాదిమంది రైతులు అయిల్‌ఫామ్ తోటల పెంపకం పొందే ప్రయోజనాలు. వ్యవసాయ యాంత్రీకరణ, పొడి పరిశ్రమ, పశువుల పెంపకం వల్ల కలిగే ప్రయోజనాలు ప్రత్యక్షంగా చూసి అవకాశం ఉన్నందున సంబంధిత అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో అయిల్ ఫామ్ ప్యాక్టరీ మేనేజర్ శ్రీకాంత్, వ్యవసాయ ఆర్టీకల్చర్, ఆర్అండ్‌బి, పోలీస్. అయిల్‌ఫెడ్ సంబంధిత ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.





## గ్యాస్ కొరత పైన సిపిఐ వినూత్న నిరసన



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** పెద్దపల్లి మండలం పెద్ద కలవల గ్రామంలోని మహబూబా బాగ్ వద్ద గల రిలాక్స్ కేఫ్ ముందు సిపిఐ పెద్దపల్లి జిల్లా కౌన్సిల్ సభ్యులు బాలసాని లెనిన్ ఆధ్వర్యంలో గ్యాస్ మరియు ఆయిల్ కొరత పైన వినూత్న నిరసన చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు కట్టెలు హోటల్లో ఇచ్చి చాయ్ ఇవ్వాల్సిందిగా హోటల్ యాజమాన్యాన్ని కోరినారు. కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల కేటాయించకపోవడం వలన హోటల్ రెస్టారెంట్లలో సిలిండర్ లేవని దీని వలన హోటల్స్ మూసుకోవాల్సిన వస్తుందని దానికి బదులుగా కట్టెలు ఇవ్వడం ద్వారా వాళ్ళు కట్టెల పొయ్యి పైన చాయి గాని మిగతా ఇతరత్రా వంటలు చేసుకోవడానికి వీలుగా ఉంటుందని ఈ విధంగా చేశామని జిల్లా కౌన్సిల్ సభ్యులు బాలసాని లెనిన్ అన్నారు. ఇది యుద్ధం తెచ్చిన కొరతన లేక బడా వ్యాపారులు తమ వ్యాపారాన్ని కొనసాగించుకోవడానికి చేస్తున్నటువంటి కృత్రిమ కొరతనా అని ప్రభుత్వం ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి కొరత పునరావృతం కాకుండా కృత్రిమ కుర్తా సృష్టించే వారిని అరెస్ట్ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి నవీన్ ,సిపిఐ నాయకులు కనుకుంట్ల సుమన్, సాయిరాం, ఆజాద్ ,కలవల స్టాలిన్ ,బొబ్బిలి రాకేష్, మహేందర్ ,తదితరులు పాల్గొన్నారు.

## మక్కల కొనుగోలు కేంద్రం ప్రారంభించిన మార్కెట్ కమీటీ చైర్మన్

**ప్రజాపక్షం/హుస్నాబాద్ :** తెలంగాణ బీ సీ రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడు, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఆదేశాల మేరకు మంగళవారం రోజు హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్కెట్ కమీటి చైర్మెన్ తిరుపతిరెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి , సహకారసంఘం చైర్మెన్ బొల్లిశెట్టి శివయ్యతో కలిసి మక్కల కొనుగోల్ కేంద్రంను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు ఏలాంటి ఇబ్బందులు కలుగకుండ జిల్లా వ్యాప్తంగా మక్కల కొనుగోళ్లను ప్రారంబించనున్నట్లువారు తెలిపారు. రైతుల నాణ్యమైన విత్తనాలను ప్రభుత్వం సూచించే మ్యాచర్ నిబందలను పాటించి ప్రభుత్వం ప్రకటించే ధరను పొంది రైతులు లాభాలు పొందలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు మార్కఫేడ్ అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గోన్నారు.

## 3 విడతలలో రైతు భరోసా నిధులు జమ: శ్రీనివాస్

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** యాసంగి 2026 సీజన్ సంబంధించి రైతు భరోసా నిధులను మూడు విడతలలో విడుదల చేయడం జరుగుతుందని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.మార్చి 22న సిద్దిపేట జిల్లాలో 300 కోట్లతో నిర్మించిన ఆయిల్ పామ్ నూనె ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం నాడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యాసంగి సీజన్ 2026 రైతు భరోసా నిధులు విడుదల చేస్తారని, మన జిల్లాకు సంబంధించి 1,51,300 మంది రైతుల ఖాతాలలో 162 కోట్ల 52 లక్షల రూపాయలు మూడు దఫాలుగా విడుదల ఏప్రిల్ నెలాఖరు నాటికి రైతు భరోసా నిధులు జమ అవుతాయని అన్నారు.ఫిబ్రవరి 28 నాటికి జారి అయిన పట్టాదారు పాస్ పుస్తకాల కు సంబంధించిన రైతులకు రైతు భరోసా చెల్లించడం జరుగుతుందని, నూతనంగా పట్టాదారు పాసు పుస్తకం పొందిన రైతులు రైతు భరోసా నిధుల కోసం తమ బ్యాంకు ఖాతా వివరాలు నమోదు చేయాలని, ఇతర వివరాల కోసం సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ప్రకటనలో పేర్కొన్నారు.

## బైక్‌ను ఢీ కొట్టిన పాఠశాల బస్సు... ఇద్దరు మృతి



**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** అతీవేగంగా వస్తున్న ఒ ప్రైయివెట్ పాఠశాల బస్సు వెనుక నుండి ఢీ కొట్టడంతో ఒకరు సంఘటన స్థలంలో మృతి చెందగా, మరొకరు చికిత్సా పొందుతూ ఆసుపత్రిలో మృతి చెందిన విశాదకర సంఘటన మంగళవారం జరిగింది. ఈ రొడ్డు ప్రమాదం జగదేవ్‌పూర్ మండల పరిధిలోని పీర్లపల్లి గ్రామ శివారులో చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ అంధించిన వివరాలీలా ఉన్నాయి. జగదేవ్‌పూర్ లో కొనసాగుతున్న శ్రీ చైతన్య సెంట్ పిట్టర్స్ ఉన్నత పాఠశాల బస్సు విద్యార్థులను దించేందుకు వెల్తున్న క్రమంలో పీర్లపల్లి గ్రామ శివారులో తుర్కపల్లి మండలం వీరారెడ్డి పల్లి గ్రామానికి చెందిన ఆలకుంట రమేష్(45), జగదేవ్‌పూర్ మండలం లింగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన మల్లయ్య(60)వస్తున్న బెక్‌ను బస్సు వేగంగా ఢీ కొట్టడంతో రమేష్ సంఘటన స్థలంలోనే మృతి చెందగా మల్లయ్యకు తీవ్రగాయాలైనట్లు తెలిపారు. ఈ సమాచారం అందుకున్న ఎస్ఐ కృష్ణారెడ్డి 108 ద్వారా క్షతగాత్రున్ని గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్రగాయాలకు గురైన మల్లయ్య చికిత్సా పొందుతూ ఆసుపత్రిలో మృతి చెందినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని విచారణ నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## అక్రమంగా గ్యాస్ సిలిండర్లు వినియోగించే వారిపై దాడులు




**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** కమీషనర్ పౌరసరఫరా శాఖ ఆదేశాల మేరకు జగిత్యాల జిల్లా పౌరసరఫరాల అధికారులు మెట్‌పల్లి పట్టణంలోని హోటళ్ళు, రెస్టారెంట్లలో ముమ్మర తనిఖీలు నిర్వహించారు.గృహ వినియోగ వంట గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు అక్రమంగా వినియోగిస్తున్నారనే సమాచారంతో ఆకస్మిక దాడులు చేపట్టారు.తనిఖీల్లో నిబంధనలకు విరుద్ధంగా సిలిండర్లను వినియోగిస్తున్న 13 మందిపై 6–ఎ కేసులు నమోదు చేసి,సంబంధిత గ్యాస్ సిలిండర్లను సీజ్ చేశారు.ఈ తనిఖీల్లో సహాయ పౌరసరఫరాల అధికారి, నాయబ్ తహసిల్దార్ కె. ఉమాపతి,శ్రీనివాస్, విష్ణు, పౌరసరఫరాల ఇన్స్పెక్టర్ రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.వాణిజ్య అవసరాలకు సబ్సిడీ గృహ వంటగ్యాస్ సిలిండర్లను వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు వ్యాపారులను హెచ్చరించారు.

## పసుపు ధరల పతనంపై రైతు ఐక్య వేదిక ఆందోళన



**ప్రజా పక్షం/ఇబ్రహీంపట్నం:** జగిత్యాల జిల్లా రైతు ఐక్య వేదిక అధ్యక్షుడు నల్ల రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో రైతు ఐక్యవేదిక నాయకులు మంగళవారం మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో వ్యవసాయ మార్కెట్ సెక్రటరీ ఎం. ఇంద్రసేనారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం రైతు ఐక్యవేదిక నాయకులు మాట్లాడుతూ పసుపు ధరలు తీవ్రంగా పడిపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో రూ.13 వేల వరకు ఉన్న ధరలు ప్రస్తుతం రూ.9 వేల కు తగ్గిపోవడంతో రైతులు తీవ్ర నష్టాలు ఎదుర్కొంటున్నారని తెలిపారు.ఈ నేపథ్యంలో వ్యవసాయ మార్కెట్ సెక్రటరీని కలిసి పసుపు ధరలు మరింత తగ్గకుండా చర్యలు తీసుకుని రైతులను ఆదుకోవాలని కోరారు. రైతుల సమస్యలను ప్రభుత్వం గమనించి తగిన మద్దతు ఇవ్వాలని జిల్లా రైతు వేదిక ప్రతినిధులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఐక్యవేదిక రైతులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కారం చేయకుంటే సమ్మెకు వెళ్తాం

ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి
మడ్డి ఎల్లా గౌడ్




**ప్రజాపక్షం/పెద్దపల్లి:** సింగరేణి లో కార్మికుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని లేకుంటే సమ్మె కు పిలుపు నిస్తామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, బ్రాంచి సహాయ కార్యదర్శి రంగు శ్రీను లు పేర్కొన్నారు. మంగళవారం సింగరేణి ఆర్జీ వన్ ఏరియా లోని గనులు, డిపార్ట్మెంట్ లు, ఓసిపి 5 లలో ధర్నాలు నిర్వహించి డిమాండ్ లతో కూడిన వినతి పత్రాలు అధికారుల కు ఇచ్చిన అనంతరం వారు మాట్లాడుతూ సింగరేణి కి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన 51 వేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని, కొత్త గనులు కేటాయించాలని, ఏసిబి విచారణ పేరుతో నిలిపి వేసిన మెడికల్ బోర్డు ను వెంటనే నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. అదే విధంగా సొంత ఇంటి పథకం, పెర్క్స్ పై ఇన్ కం టాక్స్ యాజమాన్యం చెల్లించాలని, మారుపేర్లు, విజిలెన్స్ కేసుల కార్మికుల డిపెండెంటు లకు ఉద్యోగాలు ఇవ్వాలని, డిస్మిస్ కార్మికులకు ఒక సారి అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు, సింగరేణి లో మితిమీరిన రాజకీయ జోక్యాన్ని అరికట్టాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా సింగరేణి లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, యాజమాన్యం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాల పై ఈ నెల 18 నుంచి 30 వరకు సేవ్ సింగరేణి పేరుతో గోలేటి నుండి కొత్తగూడెం వరకు పోరు జాత నిర్వహించి హెడ్ ఆఫీస్ ను ముట్టడిస్తామని, ఇందులో భాగంగా ఈ నెల 22 న గోదావరిఖని కి పోరు జాత వస్తుందని, ఇట్టి జాతా గోదావరి బ్రిడ్జి నుంచి చౌరస్తా వరకు మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించి కార్నర్ మీటింగ్ జరుగుతుందని, ఇట్టి కార్యక్రమాలను విజయవంతం చేయాలని వారు కార్మిక వర్గాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి ఆఫీస్ బేరర్స్ తో పాటు ఫిట్ కార్యదర్శులు సంకె అశోక్, మాదన మహేష్, సిద్ద మల్ల రాజు, సిర్ర మల్లికార్జున్, ఎస్ వెంకట్ రెడ్డి, గండి ప్రసాద్, చెప్యాల భాస్కర్, దాసరి అనిల్, కే.విజయలక్ష్మి , దొంత సాయన్న, ఎం. చక్రపాణి, ఎం.ఎ. గౌస్, కలవేణి రాజేష్, పొన్నాల వెంకటయ్య, కారంపూరి వెంకన్న,గుర్రం ప్రభుదాస్, ఆఫీస్ కార్యదర్శి తొడుపునూరి రమేశ్ కుమార్,తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోతే ఉద్యమిస్తాం

**ప్రజాపక్షం/మల్లాపూర్ :** రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే మార్క్ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని లేనియెడల రైతులంతా కలిసి ఉద్యమిస్తామని రైతు ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు రమేష్ రెడ్డి అన్నారు.ఈ సందర్భంగా బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ మొక్కజొన్న పంట చేతి కొచ్చి రైతులు దళారులకు అమ్ముకోలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రభుత్వం దిగివచ్చి తక్షణమే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోతే ఈనెల 24వ తారీఖున మెట్పల్లి పట్టణంలో పెద్ద ఎత్తున ధర్నాకు దిగుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి మండల అధ్యక్షుడు డబ్బు రమేష్ రెడ్డి, రైతు సంఘ నాయకులు గోపిడి శ్రీనివాస్ రెడ్డి,మోరపు గంగారాజం,కల్లెం మహిపాల్ రెడ్డి, చిట్టి రెడ్డి రమేష్,రాజశేఖర్ ,నాగరాజు, తదితరులున్నారు.

## కరీంనగర్ ముఖద్వారాలకు అడ్డంగా బిజెపి నేతల హోర్డింగ్స్, ఫ్లెక్సీలు

పట్టించుకోని మున్సిపల్ అధికారులు
సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు
పైడిపల్లి రాజు



**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ నగరంలో బిజెపి నాయకులు అధికారాన్ని అడ్డం పెట్టుకొని మున్సిపల్ నుండి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా మున్సిపల్ కి ఎటువంటి రుసుము చెల్లించకుండా ఇష్టారాజ్యంగా హోర్డింగ్, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారని వీటిపై చర్యలు తీసుకోవాల్సిన మున్సిపల్ అధికారులు నిమ్మకు నీరత్తినట్లుగా వ్యవరిస్తున్నారని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు పైడిపల్లి రాజు ఒక ప్రకటన తెలిపారు. ప్రజా ప్రతినిధులు నిబంధనలు తుంగలో తొక్కుతున్నారని ప్రజలకు నిబంధనలు చెప్పాల్సిన నేతలే నీతి తప్పుతున్నారని ఇది ఏ మాత్రం సరైన పద్ధతి కాదని ఆయన అన్నారు. కరీంనగర్ నగరానికి వేలాది మంది ప్రజలు ప్రతిరోజు చూడడానికి వస్తుంటారని కరీంనగర్ ముఖద్వారాలను చూడాల్సిన ప్రజలకు బిజెపి నేతల ముఖాలు కనబడుతున్నాయని కరీంనగర్ ఖ్యాతిని కనబడకుండా చేస్తున్న వీరి పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. గత పాలన కన్నా మా పాలనలో మార్క్ చూపిస్తామని చెప్పిన బీజేపీ నేతలు అడ్డదారి తొక్కుతున్నారని ఆయన ఆరోపించారు. సభ ముగిసి మూడు రోజులైనా ఇప్పటికీ వారి ఫ్లెక్సీలు, హోర్డింగ్ లు అలాగే ఉన్నాయని మున్సిపల్ అధికారులకు కనబడడం లేదా అని ప్రశ్నించారు. వీటిని వెంటనే తొలగించాలని లేనిపక్షంలో మున్సిపల్ అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని పైడిపల్లిరాజు హెచ్చరించారు.




## గ్రామ సభల్లో బాలల హక్కులపై అవగాహన

కలెక్టర్ చిత్రా మిశ్రా





**ప్రజాపక్షం/కరీంనగర్:** బాలల హక్కుల పరిరక్షణపై గ్రామ సభల్లో ప్రజలందరికీ విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పేర్కొన్నారు. జాతీయ బాలల పరిరక్షణ కమిషన్ సూచన మేరకు కలెక్టరేట్ ఆడిటోరియంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోలీసులు, ఉపాధ్యాయులకు బాలల హక్కుల పై వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా పాలనప్రగతి ప్రణాళికా కార్యక్రమంలో భాగంగా అన్ని గ్రామాల్లోనూ నిర్వహించే గ్రామ సభల్లో బాలల హక్కులపై అవగాహన కల్పించాలని అన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు గ్రామస్థాయి అధికారులకు ఈ అవగాహన చాలా అవసరమని తెలిపారు. బాలల హక్కులు ఉల్లంఘిస్తే ఏ విధంగా శిక్షార్హులవుతారో వివరించాలని అన్నారు. అంగన్వాడి, ఆశ, గ్రామ కార్యదర్శి, సర్పంచులకు బాల్య వివాహాలు, బాలల హక్కుల ఉల్లంఘన, బాల పరిరక్షణ చట్టాలు వంటివి తెలియజేయాలని అన్నారు. బాధిత చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న సేవలు, సౌకర్యాలు, బాలసదనాల గురించి అందరికీ అవగాహన అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిడబ్ల్యుసి చైర్ పర్సన్ ధనలక్ష్మి, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, జిల్లా బాలల హక్కుల పరిరక్షణ అధికారి పర్వీన్, చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ సంపత్, సఖి కేంద్రం అడ్మిన్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్ పామ్ సాగుకు రైతులు ముందుకు రావాలి

కలెక్టర్ గరిమ అగ్రవాల్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ఆయిల్ పామ్ పంట సాగుకు రైతులు ముందుకు రావాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ, ఉద్యానవన శాఖ ఆద్వర్యంలో ఇల్లంతకుంట మండలం వంతడుపుల, అనంతారం, రేపాక, ఓబులాపూర్, బోయినపల్లి మండలం విలాసాగర్, మల్కాపూర్, మర్లపేట, కోనరావుపేట మండలం ఎగ్లాస్పూర్, వేములవాడ, గంభీరావుపేట మండలం శ్రీగాద గ్రామాల్లో మొత్తం 40 ఎకరాల్లో ఆయిల్ పామ్ మొక్కల మెగా ప్లాంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించగా, ఇల్లంతకుంట మండలం వంతడుపులలో మంగళవారం కార్యక్రమానికి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ఆయిల్ పామ్ సాగుతో అధిక దిగుబడి, లాభాలు వస్తాయని తెలిపారు. ఆయిల్ పామ్ లో అంతర పంటలుగా కూరగాయలు, మొక్క జొన్న, పూల మొక్కలు ఇతర పంటలు సాగు చేస్తున్నారని పేర్కొన్నారు. అలాగే డ్రిప్ ఇరిగేషన్, ఇతర సబ్సిడీలు ఉన్నాయని తెలిపారు. పంటకు మంచి మద్దతు ధర వస్తుందని వివరించారు. పంట ఉత్పత్తి సేకరణకు ఎలాంటి ఇబ్బంది లేదని, ప్రతి మండలం నుంచి కొనుగోలు చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శరత్ బాబు, తహసీల్దార్ ఫరూఖ్, ఎంపీడీఓ శశికళ తదితరులు ఉన్నారు.

## సిద్దిపేట అభివృద్ధిపై ఎందుకంత కక్ష?

గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనుల కోసం విడుదలైన రూ.1070 కోట్లు ఎందుకు రద్దు చేశావ్?
కాంగ్రెస్ హయాంలో ఒక్క అభివృద్ధి పనైనా చేశారా?
సిఎం రేవంత్‌రెడ్డికి మాజీ మంత్రి హరీష్‌రావు బహిరంగ లేఖ





**ప్రజాపక్షం/సిద్దిపేట:** సిద్దిపేట నియోజకవర్గంలో సిఎం రేవంత్‌రెడ్డి రద్దు చేసిన 1070 కోట్ల నిధులను పునరుద్దరించి..నిలిచిపోయిన అభివృద్ధి కొనసాగించాలని..సిద్దిపేటపై ఎందుకంత కక్ష.. అధికారంలో ఉన్న సిద్దిపేటపై ఈర్ష్యాద్వేషాలేనా అని? ఈనెల 22న సిద్దిపేట వస్తున్న సిఎం రేవంత్‌రెడ్డికి మాజీ మంత్రి,సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు బహిరంగ లేఖ రాసారు. మంగళవారం సిద్దిపేటలో విడుదల చేశారు. మీరు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి 27 నెలల తర్వాత అధికారికంగా సిద్దిపేట నియోజకవర్గంలో అడుగుపెడుతున్నందుకు ఈ ప్రాంత ఎమ్మెల్యేగా స్వాగతిస్తున్నాని హరీష్‌రావు అన్నారు. మీరు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సిద్దిపేట పేరేత్తనిదే మీకు రోజు గడిచేది కాదని సిద్దిపేట అభివృద్ధిపై మీరు ప్రదర్శించిన ఈర్ష్యాద్వేషాలను మా నియోజకవర్గం ప్రజలు కలకాలం గుర్తుంచుకుంటారని లేఖలో పేర్కొన్నారు. ఆనాడు కలలో కూడ సిద్దిపటను తలచిన మీరు ఈనాడు అధికారంలోకి రాగానే రాష్ట్రంలో సిద్దిపేట అనే నియోజకవర్గం ఒకటుందని విషయాన్ని మరిచిపోవటం హాస్యస్పదంగా ఉందన్నారు. సిద్దిపేట అభివృద్ధిని విస్మరించటమే గాకుండ బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరైన నిధులను పూర్తిగా రద్దు చేశారని. నిధులు రద్దు కావటంతో 27 నెలలుగా పనులు ఆగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సిద్దిపేట అభివృద్ధి కోసం 1070 కోట్లు కేటాయింపు జరిగిందని, ఈ నిధులతో అభివృద్ధి పనులు జరుగుతుండగా అర్ధాంతరంగా నిధులను రద్దు చేశారన్నారు. అర్ధాంతరంగా ఆగిన పనులను జరిగేలా చర్యలు తీసుకొని మీ గౌరవాన్ని కాపాడుకోవాలని కోరారు.

**సిద్దిపేటలో ఆగిన అభివృద్ధి పనుల వివరాలు**

ప్రభుత్వ వెటర్నీరి కళాశాల. రంగనాయక్‌సాగర్ టూరిజం,కోమటిచెరువు శిల్పారామం నిర్మాణం, సిద్దిపేట నియోజకవర్గం ఓటర్ రింగ్ రోడ్డు నిర్మాణం,తొర్నాలలో బిఎస్సీ అగ్రీకల్చర్ కళాశాల,మిట్టపల్లి ప్రభుత్వ మహిళా డిగ్రీకళాశాలభవనం, సిద్దిపేట క్రీడకారల కోసం స్పోర్ట్స్ హాబ్ నిలిచిపోయాయన్నారు. టూటౌన్ పోలీస్ స్టేషన్, త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ ,సిద్దిపేటఇల్లంత కుంట ఫోర్‌లైన్ రోడ్డు, సిద్దిపేట కిష్టాపూర్ రహదారి. సిద్దిపేటలో మల్టిఫర్పస్ అడిటోరియం, బ్లాక్ ఆఫీస్ కార్యాలయం వద్ద ఇంటిగ్రేటెడ్ వేజ్.నాన్ వేజ్ మార్కెట్ పనులు నిలిచిపోయాయన్నారు. నిలిచిపోయిన అభివృద్ధి పనులకు నిధులను పునరుద్దరించాలని మాజీ మంత్రి హరీష్‌రావు సిఎం రేవంత్‌రెడ్డికి వ్రాసిన లేఖలో పేర్కొన్నారు.

## బాధితులకు సత్వర న్యాయం అందించడమే లక్ష్యం: ఎస్‌పి

**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ :** బాధితులకు సత్వర న్యాయం అందించడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. ప్రజలకు మరింత వేగవంతమైన, సౌకర్యవంతమైన పోలీస్ సేవలు అందిచాలనే లక్ష్యంతో తెలంగాణ పోలీస్ శాఖ కీలక ముందడుగు వేసిందని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు కొన్ని ప్రత్యేక నేరాల్లో బాధితులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా వారి వద్దకే వెళ్లి ఎఫ్ఐఆర్ నమోదు చేసే విధానాన్ని జిల్లా వ్యాప్తంగా అమలు చేస్తున్నట్లు ఎస్పీ వివరించారు. నేరం జరిగిన తర్వాత శారీరకంగా, మానసికంగా ఇబ్బందులు పడుతున్న బాధితులకు పోలీస్ స్టేషన్‌కు వెళ్లడం ఒక భారంగా మారకూడదనే ఉద్దేశంతో ఈ విధానాన్ని ప్రవేశ పెట్టినట్లు వివరించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పోలీస్ స్టేషన్లలో ఈ విధానాన్ని అమలు చేసి ఇప్పటి వరకు ఐదు కేసులు నమోదు చేశామన్నారు. ఫిర్యాదుదారులు డయల్ 100 కు ఫోన్ చేసినా, నేరుగా సమాచారం ఇచ్చిన తక్షణమే పోలీసు సిబ్బంది ఆన్‌లైన్‌లో కేసు నమోదు చేస్తారని ఎస్పీ వివరించారు. ఈ విధానం ద్వారా బాధితులకు త్వరిత న్యాయం అందించడమే కాకుండా పోలీస్ సేవలపై ప్రజలకు నమ్మకం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.



# డిజిటల్ యుగంలో ఫ్యాక్ట్ చెకింగ్ కీలకం

జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



ప్రజాపక్షం / సంగారెడ్డి : ప్రస్తుత డిజిటల్ యుగంలో తప్పుడు సమాచారం వేగంగా వ్యాపిస్తున్న నేపథ్యంలో ఫ్యాక్ట్ చెకింగ్‌కు అత్యంత ప్రాధాన్యం పెరిగిందని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. కృత్రిమ మేధస్సు ద్వారా తయారవుతున్న కంటెంట్ తప్పుడు పద్ధతిలో చిత్రాలు, తప్పుడు సమాచారాన్ని గుర్తించి నిజమైన వార్తలను ప్రజలను చేరవేయడంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని ఆమె అన్నారు. ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో హైదరాబాద్ ఆధ్వర్యంలో మంగళవారం సంగారెడ్డి జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో వార్తాలాప్ పేరుతో జర్నలిస్టులకు ఒక రోజు వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లింగ ఆదారిత హింస మహిళల కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల జర్నలిజంలో కృత్రిమ మేధస్సు వినియోగం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ ప్రావీణ్య పిఐబి అదనపు డైరెక్టర్ జనరల్ శ్రుతి పాటిల్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్‌షాప్ ను ప్రారంభించారు. ప్రింట్ ,ఎలక్ట్రానిక్ మీడియాకు చెందిన సుమారు 130 మంది జర్నలిస్టులు ఈ వర్క్‌షాప్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ డిజిటల్ యుగంలో ఫ్యాక్ట్ చెకింగ్ కు అత్యంత ప్రాధాన్యం పెరిగిందన్నారు. చిన్న తప్పు దారి పట్టించే సమాచారం కూడా సమాజంలో భయం, ప్రజల నమ్మకంపై ప్రతికూల ప్రభావం చూపవచ్చని పేర్కొన్నారు. మీడియా ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభం లాంటిదని పేర్కొన్నారు. ప్రభుత్వ పాలసీలు,పథకాలు, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని ఆమె అన్నారు. జర్నలిస్టులు నైతిక విలువలతో కూడిన నాణ్యమైన వార్తలను అందించాలని సూచించారు. ఈ తరహా వర్క్‌షాప్ లు,జర్నలిస్టులు నూతన పరిజ్ఞానాన్ని తెలుసుకునేందుకు తమ వృత్తిపరమైన సామర్థ్యాన్ని పెంపొందించుకోవడానికి ఉపయోగపడుతుందని కలెక్టర్ తెలిపారు. పీఐబి అదనపు డైరెక్టర్ జనరల్ శ్రుతి పాటిల్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వ శాఖల అధికారిక సమాచారాన్ని ప్రజలకు ఖచ్చితంగా చేరవేయడంలో పిబిఐ కీలక పాత్ర పోషిసుం




దని చెప్పారు. ముఖ్యంగా కృతి మేదుస్సు విస్తరిస్తున్న ఈ కాలంలో తప్పుడు వార్తలను గుర్తించి ఖండిచండలో పిఐబి ప్యాక్ట్ చెక్ యునిట్ ముఖ్యమైన బాద్యత నిర్వహిస్తున్నదని తెలిపారు. ప్రెస్ ఇన్మర్మేషన్ బ్యూరో ద్వారా నిర్వహిస్తున్న పలు కార్యక్రమాల గురించి ఆమె వివరించారు. లింగ సమానత్వం ,మహిళల సంక్షేమ పథకాలపై సీనియర్ జర్నలిస్టు సజయ కాకర్ల మాట్లాడుతూ లింగ సమానత్వం కుటుంబం నుంచే ప్రారంభం కావాలని పిల్లల్లో సరైన దృక్పథాన్ని తల్లిదండ్రులు పెంపోదించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ అంశాలపై అవగాహన కల్పించడంలో జర్నలిస్టుల పాత్ర కూడా కీలకమని చెప్పారు. జర్నలిజింలో ఏఐవినియోగంపై సత్యప్రియ వివరించారు. నోట్ బుక్ కేఎల్ఎం చాట్ జేపిటీ, గూగుల్ ఫేస్ పాయింట్ ఎలెవన్ లాబ్స్ జెమిని ఏఐ వంటి పలు ఏఐ సాదనాలను ఎలా ఉపయోగించాలో వివరించారు. అయితే ఏఐ వేదికలపై వ్యక్తి గత ,సున్నితమైన సమాచారాన్ని పంచుకోవడంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వర్క్‌షాప్ ముగింపులో జర్నలిస్టులతో ప్రశ్నోత్తర కార్యక్రమం నిర్వహించారు. జర్నలిస్టులకు అడిగిన పలు ప్రశ్నలకు పిఐబి అదనపు డైరెక్టర్ జనరల్ సమాదానాలు ఇచ్చి వారి సూచనలు ,అభిప్రాయాలను సంబందిత మంత్రిత్వ శాఖలకు చేరవేస్తామని హామీ ఇచ్చారు.

## కార్మిక హక్కుల సాధనకు పోరాటం

ఎఐటియుసి బ్రాంచ్ సెక్రెటరీ శైలేంద్ర సత్యనారాయణ



ప్రజాపక్షం / మందమర్రి : సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఏప్రిల్ నెలలో చేపట్టబోయే సమ్మెకు కార్మికులందరూ సిద్ధంగా ఉండాలని ఎఐటియుసి బ్రాంచ్ సెక్రెటరీ శైలేంద్ర సత్యనారాయణ పిలుపునిచ్చారు. మందమర్రి ఏరియాలోని కెకె 5, కెకె ఓసి, వర్క్‌షాప్, జిఎం కార్యాలయం తదితర విభాగాల్లో మంగళవారం కార్మికులకు చైతన్య కార్యక్రమాలు నిర్వహించారు. నూతన బొగ్గు బ్లాకులను ప్రారంభించకపోవడం, మెడికల్ బోర్డు నిర్వహణలో ఆలస్యం, పెర్క్స్‌పై ఆదాయపు పన్ను మినహాయింపు ఇవ్వకపోవడంపై యాజమాన్యం తీరును తప్పుబట్టారు. సొంతింటి పథకం అమలు, మారు పేర్ల సవరణ వంటి డిమాండ్ల సాధన కోసం ఈ నెల 18 నుండి సింగరేణి వ్యాప్తంగా జాతా కార్యక్రమం చేపడుతున్నట్లు ప్రకటించారు. ఈ జాతా మార్చి 30న కొత్తగూడెం ప్రధాన కార్యాలయం ముందు నిర్వహించే ధర్నాతో ముగుస్తుందని తెలిపారు. నాయకులు భీమనాథుని సుదర్శన్, కంది శ్రీనివాస్, బాణయ్య, రమణ, రాజేశ్వరరావు, సంపత్ కుమార్, విక్రమ్ సింగ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## సమర్థవంతంగా ప్రజా పాలన

అదనపు కలెక్టర్ చంద్రయ్య



ప్రజాపక్షం / కాసిపేట : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య అధికారులను ఆదేశించారు. మంగళవారం కాసిపేట మండలం దేవాపూర్ గ్రామ పంచాయతీని సందర్శించి నర్సరీ, పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. ప్రతి రోజూ ఇంటింటి నుండి తడి, పొడి చెత్తను వేరుగా సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలని సూచించారు. గ్రా మంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసి మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం, శుద్ధమైన తా గునీరు అందించాలని ఆదేశించారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను, ఉపాధి హామీ కూలీల హాజరు పట్టికను తనిఖీ చేశారు. ఓటరు జాబితా మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని బూత్ స్థాయి అధికారులకు సూచించారు. గ్రామంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు కోసం అనువైన స్థలాన్ని పరిశీలించి, అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులను కోరారు. తహసీల్దారు, ఎంపిడిఓ, ఆర్ఐ, పంచాయతీ కార్యదర్శి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులు

ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం




ప్రజాపక్షం/నిజామాబాద్: విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం అన్నారు.మంగళవారం ఎఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో నగరంలోని రైల్వే స్టేషన్ దగ్గర జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రఘురాం మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని విద్యారంగాభివృద్ధికి తోడ్పాటునందించాలని డిమాండ్ చేశారు. దాంతో పాటు విద్యా కమీషన్ ఇచ్చిన నివేదికను రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో అమలు చేయాలని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీ ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టులను భర్తీ చేసి విద్యారంగం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. దాంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లోని ఫీజు రిఎంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్‌లను వెంటనే ఈ బడ్జెట్ సమావేశాల్లో ఆమోదించి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సుభోద్, కోశాధికారి అనూష, నిఖిల్, గణేష్, విఠల్ పాల్గొన్నారు.

## అభివృద్ధిలో పాత్రికేయుల పాత్ర కీలకం




ప్రజాపక్షం / జన్నారం : ప్రజాస్వామ్య వ్యవస్థలో నాలుగో స్థంభంగా భావించే పాత్రికేయ రంగం ప్రజా సమస్యల పరిష్కారం, సమాజ అభివృద్ధిలో ముఖ్య పాత్ర పోషిస్తుందని బిఆర్ఎస్ మండల నాయకులు సాయిని ప్రసాద్ నేత అన్నారు. మండల కేంద్రంలో ఇటీవల ఎన్నికైన ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గానికి మంగళవారం అభినందన సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ప్రజలకు, ప్రభుత్వాలకు వారధిగా నిలుస్తూ పాత్రికేయులు అందిస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. పాత్రికేయులు బాధ్యతాయుతంగా పనిచేస్తే సమస్యల పరిష్కారానికి మరింత అవకాశం ఉంటుందని తెలిపారు. సమాజానికి అవసరమైన విషయ పరిజ్ఞానాన్ని అందించడంలో వారు నిరంతరం కృషి చేస్తున్నారని గుర్తు చేశారు. నూతన కార్యవర్గం పాత్రికేయుల హక్కుల సాధనకు, వారి సంక్షేమానికి పాటుపడాలని ఆకాంక్షించారు. ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షుడు గాజుల లింగన్న గౌడ్, ప్రధాన కార్యదర్శి జాడి వెంకటయ్య, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## 'చలో ఢిల్లీ' కార్యక్రమం విజయవంతం

ప్రజాపక్షం/ ఉట్నూర్: మతం మారిన ఆదివాసులను ఎస్‌టి జాబితా నుండి తొలగించాలని డిమాండ్ చేస్తూ మే 24న నిర్వహించనున్న 'చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా రాయిసెంటర్ అధ్యక్షులు మెస్రం దుర్గు పటేల్ పిలుపునిచ్చారు. మంగళవారం ఉట్నూర్‌లో గిరిజన సురక్ష మంచ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.జిల్లాలోని ఆదావాసీ తెగల పెద్దలు, రాయిసెంటర్ సార్మెడీలు, పటేల్, దేవరీ, మహాజన్, గ్రామ సర్పంచ్‌లు, అన్ని సంఘాల నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుండి వేల సంఖ్యలో ఆదివాసీ బంధువులను ఢిల్లీకి తీసుకెళ్లేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. హక్కుల సాధన కోసం ఆదివాసీలందరూ ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు నైతమ్ శంకర్, సట్ల అశోక్, జైవంత్రావు మహారాజ్, తెకం సంతోష్, మోహన్, కిరణ్ పాల్గొన్నారు.

## ఎంపి అరవింద్ కృషితో బోధన్.. కెవిల్లో అదనపు సెక్షన్లు

హర్షం వ్యక్తం చేస్తున్న జిల్లావాసులు

ప్రజాపక్షం/నిజామాబాద్: జిల్లా పార్లమెంట్ సభ్యుడు అరవింద్ ధర్మపురి నిరంతర కృషి ఫలితంగా బోధన్, నిజామాబాద్ కేంద్రీయ విద్యాలయాల్లో అదనపు సెక్షన్లు మంజూరయ్యాయి. కేంద్రీయ విద్యాలయ సంఘటన్ (కెవిఎస్) 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించి విడుదల చేసిన ఆదేశాల ప్రకారం ఈనిర్ణయం తీసుకోబడిందని తెలిపారు.ఈ నిర్ణయంతో బోధన్ కేంద్రీయ విద్యాలయంలో 2వ తరగతి నుండి 5వ తరగతి వరకు అదనపు సెక్షన్లు, నిజామాబాద్ కేంద్రీయ విద్యాలయంలో 3వ తరగతి నుండి 5వ తరగతులకు అదనపుసెక్షన్లు ఏర్పాటు చేయబడనున్నాయి. నిజామాబాద్ కేంద్రీయ విద్యాలయంలో ఇంటర్ ప్రథమ సంవత్సరం (సైన్స్)కి సైతం అనుమతి లభించింది. దీంతో తరగతికి 40 మంది చొప్పున మొత్తం సుమారు 320 మంది విద్యార్థులకు సీబీఎస్ఈ విధానంలో నాణ్యమైన విద్య అందుబాటులోకి రానుందని అదే విధంగా రెండు కేంద్రీయ విద్యాలయాల్లో అదనపు సిబ్బంది నియామకానికి మార్గం సుగమం కానుంది. ప్రాంతంలో విద్యార్థుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న అడ్మిషన్ సమస్యలకు కూడా ఉపశమనం కలిగించనుంది. మరింత మంది విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా మార్గం సుగమమవుతుందని తెలిపారు.

## సకాలంలో రుణాలు చెల్లిస్తే కొత్తవి ఇస్తాం

ప్రజాపక్షం/మోర్తాడ్: తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తే మళ్లీ కొత్త రుణాలను చెల్లిస్తామని జిల్లా సమాఖ్య రికవరీ సభ్యులు హరిత, భారతి, జ్యోతి, శోభాలు పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలో ఇందూరు జిల్లా మహిళా సమాఖ్య బృందం స్త్రీ నిధి బ్యాంకు లీంకేజీ బకాయిల రికవరీ కై మంగళవారం పర్యటించారు. బ్యాంకు లింకేజీ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సంధ్యారాణి, స్త్రీనిధి జిల్లా రీజినల్ మేనేజర్ రామ్‌దాస్, ఏపీఎం కుంట గంగాధర్‌ల నేతృత్వంలో ఇందూర్ జిల్లా సమాఖ్య రికవరీ టీం సభ్యులు మోర్తాడ్ మండల సమాఖ్య పాలకవర్గ సభ్యులు స్థానిక సిబ్బంది అంతా కలిసి మోర్తాడ్ పట్టణంలో పర్యటించారు. మూడు నెలలు దాటి వాయిదాలు చెల్లించడంలో విఫలమైన సంఘాన్ని బకాయి సంఘంగా పరిగణించడం జరుగుతుందని ఇలాంటి వారు తక్షణమే ఈ నెల 25వ తేది లోపు తమ బకాయిలను వందశాతం చెల్లించాలని కోరారు. ఐకెపి ద్వారా అందించే రుణాలు ఒక రూపాయిలోపు వడ్డీకి లభిస్తాయని సకాలంలో చెల్లించిన వారికి రా ష్ట ప్రభుత్వం వడ్డీ రాయితీ కూడా అందిస్తుందని ఇవన్నీ పొందాలంటే తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని అధికారులు సూచించారు. రాష్ట వ్యాప్తంగా ప్రతి ఒక్క బకాయి ఉన్న సభ్యుల ఇంటికి రివకరీ టీం వెళ్తుందని, ప్రతి ఒక్రూ తమ బకాయిలను చెల్లించి సహకరించాలని అధికారులు కోరారు. బ్యాంకు లీంకేజీ రుణాలు, స్త్రీ నిధి రుణాలను సంబంధించిన బకాయిలను చెల్లిస్తే వారి అర్హతను బట్టి మళ్లీ కొత్తగా రుణాలు అందచేస్తామని అధికారులు వెల్లడించారు. సూక్ష్మ ఆహార శుద్ధి కార్యక్రమాలు చేపట్టే వారి కోసం 35శాతం సబ్సిడీతో కూడా రుణాలు అందిస్తామని అన్నారు. ఐకెపి ఆధ్వర్యంలో నడిచే మహిళా సంఘాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, మహిళా సంఘాలు



లేకపోతే మళ్లీ వడ్డీ వ్యాపారులు విజృంభించి ఐదు రూపాయాలు పది రూపాయాలు వడ్డీకి రుణాలను ఇస్తారని, తద్వారా పేద మధ్య తరగతి ప్రజలు నష్టపోతారని జిల్లా సమాఖ్య ప్రతినిధులు అన్నారు. సభ్యులంతా సహకరించి రుణ బకాయిలను చెల్లించాలని అధికారులు వెల్లడించారు. జిల్లా సమాఖ్య రికవరీ సభ్యులు హరిత, ఐకెపి సిసిలు మహేంద ర్, శ్రీనివాస్,సంతోష్, సమాఖ్య కార్యదర్శి వరలక్ష్మి, వీవోఏలు మోర్తాడ్ సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

## నిఖిల్‌సాయి నుండి మునిసిపల్ టాక్స్ బకాయి వసూలు

మునిసిపల్ అధికారులకు సిపిఐ నాయకులు వినతి

ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ : నిజామాబాద్‌నగరంలోని ప్రముఖ వాణిజ్య సంస్థలను నిర్వహిస్తున్న కొంతమంది వ్యక్తులు నగరపాలక సంస్థకు కోట్లలో ఆస్తిపన్ను బకాయిలుకట్టకుండా నగరపాలక సంస్థ అభివృద్ధికి అడ్డుపడుతున్నారని, వారినుండి వెంటనే బకాయిలను వసూలు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పి. సుధాకర్‌అన్నారు. మంగళవారం నిజామాబాద్ మునిసిపల్ కార్యాలయంలో సిపిఐ ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ పి. రవిందర్ సాగర్, డిప్యూటి కమిషనర్ రవిబాబుల కు వినతి పత్రం సమర్పించారు. నిజామాబాద్ నగరంలోని నిఖిల్‌సాయి ఇంటర్నేషనల్ హోటల్ యాజమాన్యం నగరపాలక సంస్థకు




బకాయి ఉన్న సుమారు రూ. 6 కోట్లు టాక్స్ చెల్లించకుండా గత కొన్ని సంవత్సరాలుగా కాలయాపన చేస్తున్నారని అన్నారు. నగరపాలక సంస్థ అభివృద్ధికి నిధులు లేకపోవుట వలన నగర ప్రజల మౌలిక సౌకర్యాలు సమకూర్చలేకపోవడంతోపాటు, నగరాన్ని అనునిత్యం శుభ్రంగాఉంచే పారిశుద్య కార్మికుల వేతనాలు సకాలంలో చెల్లించలేకపోతున్నారని అన్నారు. నగరపాలక సంస్థకు బకాయి ఉన్న నిఖిల్ సాయి ఇంటర్నేషనల్ హోటల్ యాజమాన్యం చెల్లించాల్సిన మునిసిపల్ టాక్సు రూ. 6 కోట్లు వసూలు చేసి నగర అభివృద్ధికి తోడ్పాటు అందించాలని అధికారులను కోరారు. సిపిఐ నాయకులు రంజిత్ కుమార్, రఘురాం పాల్గొన్నారు.

## గ్యాస్ సిలిండర్ల కొరత లేదు

కలెక్టర్ అభిలాష అభినవ్



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : జిల్లాలో డొమెస్టిక్,కమర్షియల్ గ్యాస్ సిలిండర్లకు ఎటువంటి కొరత లేదని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ స్పష్టం చేవారు. అన్ని గ్యాస్ ఏజెన్సీలలో తగినంత గ్యాస్ అందుబాటులో ఉందని తెలిపారు.గ్యాస్ సిలిండర్లను బుక్ చేసుకున్నవారికి నిర్ణీత సమయంలో పల సిలిండర్లను ప్రజలకు డోర్ డెలివరీ చేస్తున్నట్లు వివరించారు.ప్రజలకు ఎవరికైనా గ్యాస్ సిలిండర్ల సరఫరాలో ఇబ్బందులు కలిగితే కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నెంబర్ 9100577132 ను సంప్రదించవచ్చునని వివరించారు.ఇప్పటికే గ్యాస్ సిలిండర్లను సాఫీగా పంపిణీ చేసే విధంగా స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని పేర్కొన్నారు.ప్రజలు ఎవరు గ్యాస్ కొరత అని వస్తున్న అసత్య వార్తలను,పుకార్లను నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు.

## వేతనాలు పెంచకుంటే ఉద్యమం ఉధృతం

ఎఐటియుసి బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి ఉపేందర్




ప్రజాపక్షం / రెబ్బన : సింగరేణి లారీ డ్రైవర్లు, క్లీనర్ల వేతనాలు పెంచని పక్షంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ఎఐటియుసి బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి భోగి ఉపేందర్ హెచ్చరించారు. కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా రెబ్బన మండలం బెల్లంపల్లి ఏరియా గోలేటిలో పనిచేస్తున్న లారీ డ్రైవర్లు, క్లీనర్లు ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంగళవారం నిరవధిక సమ్మె చేపట్టారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా డ్రైవర్లకు 34 వేల రూపాయలు, క్లీనర్లకు 21 వేల రూపాయల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. వీటితో పాటు ఇపిఎఫ్, ఇఎస్ఐ, బోనస్ సౌకర్యాలు కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోరారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

## పోలీసుల ఆరోగ్య రక్షణే ప్రభుత్వ ధ్యేయం

సూపరిండెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ

ప్రజాపక్షం / గజ్వేల్: గజ్వేల్ జిల్లా కేంద్ర ఆసుపత్రిలో మంగళవారం పోలీసు, ట్రాఫిక్ సిబ్బంది కోసం ప్రత్యేక ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాల ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న 63 మంది పోలీసు సిబ్బందికి ఈ శిబిరంలో సుమారు 59 రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గజ్వేల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ మాట్లాడుతూ రాత్రి పగలు తేడా లేకుండా సొంత ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా శాంతిభద్రతల పరిరక్షణ కోసం శ్రమిస్తున్న పోలీసుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు.



పోలీసులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే సమాజ శ్రేయస్సు, ప్రజల రక్షణ సాధ్యమవుతుందని అన్నారు. విధి నిర్వహణలో ఒత్తిడికి గురయ్యే పోలీసులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఇతర దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. గజ్వేల్ ఏసీపీ నరసింహులు, సీఐ రవికుమార్, ట్రాఫిక్ సీఐ మురళి, ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ రాము, డాక్టర్ శ్రీధర్, ల్యాబ్ టెక్నీషియన్లు దొడ్డి రమేష్, జీవన, రచన, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్‌పామ్ పంటతో అధిక లాభాలు

జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

ప్రజాపక్షం/పాపన్నపేట: ఆయిల్ ఫామ్ పంటల పరిశీలనకు 70 బస్సులలో సిద్ధిపేట జిలాకు తీసుకువెళ్లి చూపిస్తామని, సాంప్రదాయ పంటల కంటే ఆయిల్ ఫామ్ పంటతో నే రైతులకు అధిక లాభాలు ఉంటాయని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నా రు.మంగళవారం పాపన్నపేట మండలంలోని గాంధారి పల్లిలో రైతులు సాగు చేస్తున్న ఆయిల్ పామ్ పంటలను జిల్లా ఉద్యానవన శాఖ అధికారులతో పరిశీలించారు. రైతులతో ముచ్చటించారు. వాణిజ్య పంటలపై రైతులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. రైతులతో మాట్లాడిన కలెక్టర్ ఆయిల్ పామ్ పంట సాగు విధానం, దిగుబడి పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పంట పెరుగుదలను పరిశీలించిన కలెక్టర్ రైతులు ఆధునిక సాగు పద్ధతులు పా టిస్తూ ఆయిల్ పామ్ పంటను సమర్థవం



తంగా సాగు చే యాలని సూచించారు. ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగుకు ప్రోత్సాహం అందిస్తున్నందున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అలాగే ఆయిల్ పామ్ సాగును మరింత విస్తరించే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, సబ్సిడీల గురించి అవగాహన కల్పించాలని తెలిపారు. ఆయిల్ ఫామ్ సాగు కోసం 2,500 ఎకరాలు లక్ష్యం గా పెట్టుకున్నారని, ఇప్పటికే 2000 ఎకరాలు సాగు అయిందని తెలిపారు. ఆయిల్ ఫామ్ పంటల సాగు పరిశీలన కోసం ఈనెల 20, 21, 22 తేదీలలో సిద్ధిపేట జిల్లాలోని ఆయిల్ ఫామ్ పంటల సాగు పరిశీలంకోసం 70 బస్సులు ఏర్పాటు చేసి మెదక్ జిల్లా రైతులను పంపుతున్నట్లు తెలిపారు.ఆర్డీవో రమాదేవి, ఎంపీడీవో విష్ణువర్ధన్, సర్పంచ్ సిద్దిరాం రెడ్డి తోపాటు రైతులు పాల్గొన్నారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు

గ్యాస్ ఏజెన్సీని పరిశీలించిన కలెక్టర్,ఎస్పి



ప్రజాపక్షం/సారంగాపూర్ : అపేమతులు లేకుండా అక్రమంగా ఇసుకను మొరాన్ని తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుని వాహనాలకు సీజ్ చేస్తామని,అలాగే గృహాల్లో వినియోగించే గంట గ్యాస్సు హోటళ్లను రద్దు చేస్తామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్,జిల్లా ఎస్పీ జానకి షర్మిల హెచ్చరించారు.జాం గ్రామంతో పాటు మండల కేంద్రంలోని గ్యాస్ ఏజెన్సీని పరిశీలిచారు.గుత్తేదారులు ఇందిరమ్మ ఇండ్ల పేరట ఎటు ఇసుకను అటు మొరాన్ని విచ్చలవిడిగా కొల్లగోడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయని అనుమతులు లేకుండా అక్రమంగా అరలించే వారిపై ప్రత్యేక కమిటిని ఏర్పాటు చేసి నిరంతరం నిఘా పెంచుతామని పేర్కొన్నారు.అదేవిధంగా మండలంలో నివాస గృహాలకు సరిపడా గ్యాస్ ఏజెన్సీలను రద్దుచేసి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడును అని హెచ్చరించారు. అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్,తహసిల్దార్ సంధ్యారాణి,ఎంపీడీవో లక్ష్మి కాంత్,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

> పవర్ స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా తెరకెక్కిన 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా 19న ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్యంలో దర్శకుడు హరీష్ శంకర్ ప్రమోషన్ కార్యక్రమాలతో వరుస ఇంటర్వ్యూల్లో పాల్గొంటూ సినిమా విశేషాలు పంచుకుంటూ, తాజాగా మెగాస్టార్ చిరంజీవి గురించి చెప్పిన మాటలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. సినిమా గురించి మాట్లాడిన హరీష్ శంకర్, 'ఉస్తాద్ భగత్ సింగ్' పవన్ కల్యాణ్ అభిమానులకు నిజమైన మాస్ జాతరలా ఉంటుందని తెలిపారు.

# రీల్

## 'పోలీస్ కంప్లైంట్' టీజర్ విడుదల

సౌతిండియా ప్రేక్షకుల ముందుకు యాక్షన్, కామెడీ, హారర్ థ్రిల్లర్ కలగలిపిన సినిమాను తీసుకురాబోతున్నారు దర్శకుడు సంజీవ్ మేగోటి. వరలక్ష్మి శరత్‌కుమార్, నవీన్ చంద్ర, రాగిణి ద్వివేది, కృష్ణ సాయి ప్రధాన పాత్రల్లో నటించిన సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రం 'పోలీస్ కంప్లైంట్' కన్నడ వెర్షన్ టీజర్‌కు బెంగళూరులో సినీ ప్రముఖుల సమక్షంలో ఘనంగా విడుదల చేశారు. ఈ వేడుకకు 'దేవి' చిత్రం ద్వారా గుర్తింపు పొందిన నటి ప్రేమ, 'దండుపాళ్యం' ఫేమ్ పూజా గాంధీ, కన్నడ ఫిల్మ్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.ఆర్.కె.విశ్వనాధ్ ముఖ్య అతిథులుగా హాజరై టీజర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నటి రాగిణి ద్వివేది మాట్లాడుతూ, 'పోలీస్ కంప్లైంట్' కథ ఎంతో ఆసక్తికరంగా ఉందని, ఇది ప్రేక్షకులను ఆకట్టుకునే సస్పెన్స్ థ్రిల్లర్ అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. తక్కువ సమయంలోనే ఇంత క్వాలిటీతో సినిమాను నిర్మించిన దర్శక నిర్మాతలను అభినందించారు. అలాగే వరలక్ష్మి శరత్‌కుమార్, నవీన్ చంద్ర వంటి ప్రతిభావంతులైన నటులతో కలిసి పనిచేయడం సంతోషంగా ఉందన్నారు. దర్శకుడు సంజీవ్ మేగోటి మాట్లాడుతూ, కేవలం 45 రోజుల్లో 52 మంది సీనియర్ ఆర్టిస్టులతో ఈ సినిమాను తెరకెక్కించడం ఒక ప్రత్యేక అనుభవమని తెలిపారు. 'పోలీస్ కంప్లైంట్' పూర్తి స్థాయి సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందిందని, ప్రేక్షకులను తప్పకుండా ఆకట్టుకుంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు. త్వరలో నే ఈ సినిమాను విడుదల చేస్తామని తెలిపారు.



## సందడిగా 'యూత్' మీట్



కెన్ కరునాస్, అనిష్మ అనిల్ కుమార్, దేవదర్శిని చేతన్, సూరజ్ వెంజరముడు, ప్రియాన్షి యాదవ్, మీనాక్షి దినేష్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తమిళ మూవీ 'యూత్'. ఈ చిత్రాన్ని ఇదే పేరుతో ఈ2సీ బ్యానర్‌పై తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు హౌస్ ఫుల్ వినీత్, సందీప్. ఈ చిత్రానికి కెన్ కరునాస్ అండ్ గ్యాంగ్ దర్శకత్వం వహించారు. ఈ నెల 26న 'యూత్' మూవీ తెలుగులో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది. 'కమ్ విత్ యువర్ గ్యాంగ్, నోట్ నో ఏజ్ లిమిట్' అనే స్లోగన్‌తో ఈ సినిమా ప్రమోషనల్ క్యాంపెయిన్ చేస్తున్నారు. సోమవారం ఈ సినిమా ప్రెషర్స్ మీట్ కార్యక్రమం పలువురు సినీ ప్రముఖుల సమక్షంలో హైదరాబాద్‌లో సందడిగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీవోపీ సూర్య బాలాజీ మాట్లాడుతూ 'యూత్' మూవీని సందీప్, వినీత్ తెలుగు ఆడియెన్స్ ముందుకు తీసుకొస్తున్నారు. ఒక మూవీని ఎలా ఆడియెన్స్‌కు రీచ్ చేయాలి అనేది సందీప్, వినీత్‌ను చూసి తెలుసుకోవాలి. 19న తమిళంలో యూత్ మూవీని చూద్దాం, అలాగే 26న తెలుగులో చూసి హిట్ చేద్దాం అన్నారు. హీరో మౌళి తనూజ్ మాట్లాడుతూ 'యూత్' మూవీ టీజర్ చాలా బాగుంది. నేను సినిమా మొత్తం చూశాను. కంప్లీట్ ఎంటర్‌టైనింగ్ మూవీ ఇది. మన తెలుగు ఆడియెన్స్‌కు బాగా నచ్చుతుంది. మీ అందరినీ పక్కాగా ఎంటర్‌టైన్ చేసే చిత్రమిది. మీరంతా తప్పకుండా ఈ నెల 26న యూత్ మూవీ థియేటర్స్‌లో చూడండి. వినీత్, సందీప్‌కు ఆల్ ది బెస్ట్ చెబుతున్నా. అన్నారు. హీరోయిన్ ప్రియాన్షి యాదవ్ మాట్లాడుతూ 'యూత్' మూవీతో తమిళంతో పాటు తెలుగు ఆడియెన్స్‌కు పరిచయం కావడం సంతోషంగా ఉంది. మా సినిమాను థియేటర్స్‌లో మీరంతా చూస్తారని కోరుకుంటున్నా అన్నారు. హీరోయిన్ మీనాక్షి మాట్లాడుతూ తెలుగు ఆడియన్స్ యంగ్ టాలెంట్‌ను ఎంకరేజ్ చేయడంలో ముందుంటారు అన్నారు. ఈ కార్యక్రమంలో అనిష్మ అనిల్ కుమార్, ప్రొడ్యూసర్ వినీత్, ప్రొడ్యూసర్ సందీప్, లిరిసిస్ట్ సనరే, ప్రొడ్యూసర్ కరుపయ్య, డైరెక్టర్ కశ్యప్ శ్రీనివాస్, డైరెక్టర్ వెంకటేష్ నిమ్మలపూడి, డైరెక్టర్ గోపీనాథ్ రెడ్డి, డైరెక్టర్ రవికిరణ్ కోలా, యాక్టర్ సూరజ్ వెంజరముడు, డైరెక్టర్ వెంకటేష్ మహా, డైరెక్టర్ వశిష్ట, హీరో, డైరెక్టర్ కెన్ కరునాస్ పాల్గొన్నారు.

## పలు భాషల్లోకి 'వనజీవి రామయ్య' బయోపిక్



పద్మశ్రీ అవార్డు గ్రహీత, 'కోటి మొక్కల రామయ్య'గా ప్రసిద్ధి చెందిన వనజీవి దరిపల్లి రామయ్య జీవిత కథ వెండితెరపైకి వచ్చింది. సమాజానికి పర్యావరణ సందేశాన్ని అందించిన ఈ మహనీయుడి జీవితం ఆధారంగా రూపొందిన 'వనజీవి రామయ్య' బయోపిక్ తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందించే గద్దర్ అవార్డుల్లో బెస్ట్ షార్ట్ ఫిలిమ్స్ విభాగంలో ఎంపికైంది. నంది అవార్డు గ్రహీత వేముగంటి దర్శకత్వంలో నిదిగొండ నరేష్ కుమార్ ప్రజాపతి, భూషం రవీంద్రనాథ్, లింగంపల్లి చంద్రశేఖర్ నిర్మించిన ఈ సినిమాకు బల్లేపల్లి మోహన్ సంగీతాన్ని అందించారు. తాజాగా చిత్రయూనిట్ హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో ప్రత్యేక ప్రివ్యూ ప్రదర్శన నిర్వహించింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల, టిజెఎస్ చీఫ్ ప్రొఫెసర్ కోదండరాం, రాజకీయ విశ్లేషకులు వి.ప్రకాష్, తన్నేరు బాబు రావు, నాగ మహేష్, సినీ ప్రముఖులు తనికెళ్ల భరణి, తమ్మారెడ్డి భరద్వాజ తదితరులు హాజరై చిత్రాన్ని అభినందించారు. ఈ చిత్రాన్ని భారతీయ భాషల్లో కూడా విడుదల చేయాలని నిర్ణయించినట్లు చిత్ర బృందం వెల్లడించింది. దర్శకుడు వేముగంటి మాట్లాడుతూ, కోటి మొక్కలు నాటి ప్రకృతికి సేవ చేసిన రామయ్య గారి జీవితం భవిష్యత్ తరాలకు ప్రేరణగా నిలవాలనే ఉద్దేశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. త్వరలోనే భారతీయ భాషల్లో కూడా ఈ బయోపిక్‌ను తీసుకురానున్నాం అని తెలిపారు. సంగీత దర్శకుడు బల్లేపల్లి మోహన్ కూడా ఇదే భావనను వ్యక్తం చేస్తూ, ఈ చిత్రాన్ని ప్రకృతి ప్రేమికుడు రామయ్యకు నివాళిగా అంకితం చేస్తున్నామని చెప్పారు.

## ఏప్రిల్ 10న 'డెకాయిట్'



అడివి శేష్ ఇప్పుడు కొత్త అవతార్‌లో 'డెకాయిట్'తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ చిత్రంలో శేష్ తొలిసారిగా మాస్ పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రంలో హీరోయిన్‌గా మృణాల్ ఠాకూర్ నటిస్తున్నారు. అనురాగ్ కశ్యప్ కీలక పాత్ర పోషిస్తున్నారు. షానియల్ డియో ఈ సినిమాతో దర్శకుడిగా అరంగేట్రం చేస్తున్నారు. సుప్రియా యార్లగడ్డ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సునీల్ నారంగ్ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పిస్తోంది. 'డెకాయిట్' ఏప్రిల్ 10న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. తాజాగా ఈ సినిమా షూటింగ్ పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా హీరో అడవి శేష్ మాట్లాడుతూ ఇద్దరూ విడిపోయిన మాజీ ప్రేమికులు, వాళ్ళ జర్నీలో ఏం రియలైజ్ అవుతారో ఇందులో చాలా స్పెషల్‌గా ఉంటుంది. చుట్టూ గన్స్ బుల్లెట్స్ ఉన్నప్పుడు ఇద్దరి మధ్య ఎమోషన్ ఎలా ఉంటుందని ఇందులో చాలా కొత్తగా ఉంటుంది. కలిపి 149 రోజుల్లో షూటింగ్ కంప్లీట్ చేశాం. కథ ఏడాదిపాటు రాశాం అని అన్నారు. అది అద్భుతంగా వర్క్ అవుట్ అయ్యింది. ఈ సినిమా తెలుగు, హిందీ భాషల్లో షూట్ చేశాం. హిందీలో కొన్ని సీన్స్ ట్రీట్‌మెంట్ కాస్త డిఫరెంట్‌గా ఉంటుందని చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం భీమ్స్, కొరియోగ్రాఫర్ విజయ్, ప్రొడక్షన్ డిజైనర్ నాగేంద్ర.

## పోస్ట్ ప్రొడక్షన్‌లో 'గోట్'



ప్రముఖ హాస్య కథానాయకుడు సుడిగాలి సుధీర్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం గోట్ అనేది ఉపశీర్షిక. దివ్యభారతి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి వేదవ్యాస్ దర్శకుడు. మహాతేజ క్రియేషన్స్ అండ్ జైష్ణవ్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి చంద్రశేఖర్ రెడ్డి మొగుళ్ళ నిర్మాత. ప్రస్తుతం నిర్మాణానంతర పనులను జరుపుకుంటోన్న ఈ చిత్రం 26న ప్రపంచ వ్యాప్తంగా థియేట్రికల్ రిలీజ్ కానుంది. త్వరలోనే ఈ చిత్రం ట్రైలర్‌ను కూడా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. నిర్మాత చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఖర్చు విషయంలో ఎక్కడా రాజీపడకుండా చాలా రిచ్‌గా చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. టెక్నికల్‌గా కూడా చిత్రం ఉన్నతస్థాయిలో వుంటుంది. సుడిగాలి సుధీర్ కెరీర్లో ఈ చిత్రం మైల్‌స్టోన్‌గా నిలుస్తుంది. సినిమా ఆద్యంతం ప్రతి ఫ్రేమ్ ఎంతో అద్భుతంగా ఉంటుంది. పూర్తి కమర్షియల్ అంశాలతో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో యువతను ఆలోచింపజేసే ఓ మంచి విషయం కూడా దాగి ఉంటుంది. తప్పకుండా ఈ చిత్రం అందర్నీ అలరిస్తుందనే నమ్మకం ఉంది' అన్నారు.

## 'మక్కుళు మక్కుళు కాలేజు' పాట ఆవిష్కరణ



ప్రముఖ దర్శకుడు మహేష్ చంద్ర దర్శకత్వంలో డాక్టర్ రాజేంద్రప్రసాద్, పథ్వీరాజ్, కేదార్ శంకర్, మణి చందన, అన్నపూర్ణమ్మ, సన్నీ అఖిల్, విరాట్, సాయి ప్రణీత్, శ్రీలు, ప్రత్యూష, రెహానా ప్రధాన తారాగణంగా రూపొందిన చిత్రం 'పిఠాపురంలో'. దీనికి ఉప శీర్షిక 'అలా మొదలైంది'. మహేష్ చంద్ర సినిమా టీం బ్యానర్‌పై దుండి గళ్ళ బాల కృష్ణ, ఆకుల సురేష్ పటేల్, ఎఫ్.ఎం. మురళి (గోదావరి కిట్టయ్య) ఈ చిత్రాన్ని నిర్మించారు. జి.సి.క్రిష్ సంగీత దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాలోని 'మక్కుళు మక్కుళు కాలేజు యవ్వన మర్కట గ్యారేజు' పాటను ప్రముఖ దర్శకుడు వి.వి. వినాయక్ ఆవిష్కరించారు. ఈ పాటను శ్రీరామ్ తపస్వి రాశారు. ఈ సందర్భంగా వినాయక్ మాట్లాడుతూ 'నేను కో డైరెక్టర్‌గా చంద్ర మహేష్ దగ్గర 'చెప్పాలని ఉంది' చిత్రానికి పనిచేశాను. ఆ తర్వాత 'ఆది' సినిమాతో దర్శకుణ్ణి అయ్యాను. చంద్ర మహేష్ నాకు చాలా ఇష్టమైన వ్యక్తి. సుప్రసిద్ధ నిర్మాత డి. ఇష్టమైన దర్శకుల్లో చంద్ర మహేష్ ఒకరు. ఆయన యూత్ ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్‌గా మూడు విభిన్న ప్రేమ కథలతో 'పిఠాపురంలో' చిత్రాన్ని రూపొందించారు. ఈ సినిమా పెద్ద హిట్టు కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. అలాగే నిర్మాతలకు మంచి లాభాలు రావాలని ఆకాంక్షిస్తున్నాను' అని చెప్పారు. దర్శకుడు చంద్ర మహేష్ మాట్లాడుతూ 'ఈ వారంలో ఈ సినిమా ట్రైలర్ విడుదల చేస్తున్నాం. ఏప్రిల్లో చిత్రాన్ని విడుదల చేస్తాం. నా కెరీర్‌లోనే ఇదొక మంచి సినిమాగా నిలిచిపోతుంది' అని తెలిపారు.

## పార్టీ మార్పు యోచన

(మొదటి పేజీ తరువాయి)

ఏ పార్టీలో ఉన్నారో స్పష్టం చేసి మాట్లాడాలని హితవు పలికారు. తనతో కలిసి పనిచేయాలని సంజయ్ కుమార్ మాట్లాడం చూస్తుంటే ఆసలు ఆయనది ఏ పార్టీ అని ప్రశ్నించారు. స్పీకర్ బిఆర్ఎస్‌లోనే ఉన్నారని అంటున్నారని, సంజయ్ కుమార్ మాత్రం ఏ పార్టీలో ఉన్నారో ఆయనకే తెలియదన్నారు. కాంగ్రెస్ పార్టీతో తనకు 40 ఏళ్ల బంధం ఉందని, అయితే ఎంతో ఒత్తిడి ఉంటే తప్ప పార్టీ మార్పుపై ఆలోచన చేస్తున్నాననో అర్థం చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ అంతర్గత వ్యవహారాల్లోకి సంజయ్ కుమార్ రావడంతోనే జగిత్యాల కాంగ్రెస్‌లో చిచ్చు రేగిందన్నారు. 2014లో ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు తాను ప్రజల హక్కుల కోసం పోరాడనని గుర్తుచేశారు. కానీ జగిత్యాల ఎమ్మెల్యే మాత్రం ప్రజల అభివృద్ధి హక్కును సాధించలేకపోతున్నారన్నారు. రాజ్యాంగ బద్ధంగా వ్యవహరించాలే తప్పా వక్రమార్గన వెళితే ప్రజలు హర్షించరన్నారు.

ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కొత్త మోహన్, బండ శంకర్, జున్ను రాజేందర్, సామల రాజశేఖర్, కల్లెపెల్లి దుర్గయ్య, నేహాల్, గుగ్గిల్ల హరీష్, పుప్పాల అశోక్, తొపారపు రజనీ కాంత్, మామిడిపెల్లి మహిపాల్, శ్రీరాముల గంగాధర్ తదితరులు ఉన్నారు.

## జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

### ఇఫ్తార్ వేడుకలు సామరస్యానికి నిదర్శనం
### మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్: జర్నలిస్టుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని, వారి సమస్యల పరిష్కారానికి సానుకూల నిర్ణయాలు తీసుకుంటామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. రంజాన్ మాసం క్రమశిక్షణ, సహనం, సేవా భావం, మానవత్వానికి ప్రతీకమని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ (టియుడబ్ల్యుజె), తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (టియుడబ్ల్యుజెఎఫ్) సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో మంగళవారం నిర్వహించిన 'దావత్ ఏ ఇఫ్తార్' కార్యక్రమంలో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో వారు వారధిలా పని చేస్తున్నారని కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నా రు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. జర్నలిస్టుల అక్రిడిటేషన్ విషయంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా, అక్రిడిటేషన్ కమిటీలో జర్నలిస్టుల సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. అలాగే ఇళ్ల స్థలాల కేటాయింపు, హెల్త్ కార్డుల మంజూరు వంటి అంశాల్లో కూడా సానుకూల నిర్ణయాలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ దేశంలోని ప్రస్తుత పరిస్థితులు సమాజంలోని ఐక్యతను విచ్ఛిన్నం చేయడానికి చేస్తున్న ప్రయత్నాలు పెరిగిపోతున్నాయన్నారు. ఇలాంటి చర్యలను అరికడుతూ సమాజమంతా ఐక్యంగా ఉందని చాటిచెప్పేందుకు మనమంతా ఐక్యంగా ముందుకు పోవాల్సిన అవసరం ఉందన్నారు. 'జనగణమన' గీతం జాతీయ గీతమని స్పష్టం చేశారు. రంజాన్ ఉపవాసాలతో శరీరాలకు సౌకర్యాన్ని, ఆరోగ్యాన్ని కలిగిస్తుందన్నారు. ఇలాంటి పండుగలకు ఇఫ్తార్ పేరుతో ఇతర మతస్తులను ఆహ్వానించి సోదర భావాన్ని పెంపొందించుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు.

ఐజెయు మాజీ అధ్యక్షులు దేవులపల్లి అమర్ మాట్లాడుతూ భారతదేశంలో కూడా మతాలను వేరు చేసి, మతం పేరు మీద మనుషులను వేరు చేసే ప్రయత్నాలు, అటు వైపుగా పోతున్న పరిస్థితులు చూసి మనలాంటి వాళ్లం ఆందోళన చెందుతున్న సమయంలో మతాల మధ్య సంబంధాలు, స్నేహభావాలు పెంపొందించడానికి ఇఫ్తార్ కార్యక్రమాలు చాలా అవసరమని నొక్కి చెప్పారు. కార్యక్రమంలో సుల్తాన్ ఉల్ ఉలూమ్ విద్యా సంస్థల కార్యదర్శి జఫర్ జావేద్, పిస్తా హౌస్ సిఇఒ మాజీద్, టియుడబ్ల్యుజె అధ్యక్షులు కె.విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి కె.రామనారాయణ, కార్యవర్గ సభ్యులు బొమ్మగాని కిరణ్‌కుమార్, టియుడబ్ల్యుజెఎఫ్ అధ్యక్షులు ఎం.ఎ.మజీద్, ప్రధాన కార్యదర్శి సయ్యద్ గౌస్ మొహియుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.9 లక్షల డ్రగ్స్ పట్టివేత

ప్రజాపక్షం/హైదరాబాద్: మేడ్చల్ జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు రెండు వేర్వేరు కేసుల్లో భారీగా మాదకద్రవ్యాలను పట్టుకున్నారు. మొత్తం రూ.9 లక్షల విలువైన 76.77 గ్రాముల కొకైన్, 200 గ్రాముల ఒజి కుష్ (హైబ్రిడ్ గంజాయి) స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ షేక్ ఫయాజుద్దీన్ వెల్లడించారు. సుచిత్ర సర్కిల్ పరిధిలో రూట్ వాచ్ నిర్వహించిన సమయంలో 76.77 గ్రాముల కొకైన్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఇంజోత్‌సింగ్ నాగ్‌పాల్ (27)ను అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద ఉన్న కారును కూడా సీజ్ చేశారు. విచారణలో, ముంబైలోని బ్రోబిలీ కేప్ వద్ద అబ్‌డుజ్ అనే వ్యక్తి నుంచి ఈ కొకైన్‌ను తెచ్చుకున్నట్లు నిందితుడు ఒప్పుకున్నాడు. టెలిగ్రామ్ యాప్ ద్వారా డ్రగ్స్ విక్రయిస్తున్నాడన్న సమాచారంతో హస్మత్‌పేట్ ప్రాంతంలో తనిఖీలు నిర్వహించిన అధికారులు, మన్‌ప్రీత్ సింగ్ (35)ను అదుపులోకి తీసుకున్నారు.అతని వద్ద 200 గ్రాముల ఒజి కుష్ స్వాధీనం చేసుకున్నారు. ఈ డ్రగ్స్‌ను తమిళనాడులోని పాట్యాల అనే వ్యక్తి సరఫరా చేసినట్లు విచారణలో వెల్లడైంది. కొకైన్ కేసు నిందితుడిని కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ స్టేషన్‌కు, ఒజి కుష్ కేసు నిందితుడిని బాలనగర్ ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించారు. ఈ దాడుల్లో ఎఇఎస్ మాధవయ్య, డిటిఎఫ్ సిఐ నర్సిరెడ్డి, ఎస్ఐ పవన్ కుమార్ రెడ్డి సహా సిబ్బంది వెంకటేశ్వర్‌రావు, చెన్నయ్య, శ్రీనివాస్, జ్యోతి, తేజ, మునాఫ్‌లు పాల్గొన్నారు.

## సిట్ ఏర్పాటు

(మొదటి పేజీ తరువాయి)

రానున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తున్న మొయినాబాద్ డ్రగ్ పార్టీ కేసు విచారణ కోసం ఏర్పాటైన సిట్ దూకుడు పెంచింది. ఈ కేసులో మొయినాబాద్ పోలీస్ స్టేషన్‌లో మొత్తం 11 మందిపై కేసు నమోదవగా వీరిలో 8 మందికి స్టేషన్ బెయిల్ ఇచ్చారు. వీరిని మంగళవారం వీరిని శంషాబాద్ రూరల్ పోలీసు స్టేషన్‌లో సిట్ విచారించింది. నిందితుల నుంచి పలు కీలక సమాచారం రాబట్టే ప్రయత్నం చేసింది. ఈ ఫామ్ హౌస్‌లో డ్రగ్స్ పార్టీలలో చాలా విషయాలు తెలుసుకోవాల్సి ఉందని, పార్టీ కోసం బెంగళూరుకు చెందిన వ్యాపారవేత్తలు, అడ్వకేట్లు ఎందుకొచ్చారు? అనే కోణంలో సిట్ దృష్టి సారించింది. ఈ పార్టీ వెనుక పెద్ద బిజినెస్ డీల్ ఉందనే ప్రచారం జరుగుతుండగా సిట్ సైతం అదే కోణంలో దర్యాప్తు వేగవంతం చేస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది.

**వెలుగులోకి సంచలనాలు?..** మొయినాబాద్ ఫామ్హౌస్ డ్రగ్స్ వ్యవహారంలో రోజురోజుకు కొత్త ట్విస్టులు తెరమీదకు వస్తున్నాయి. ఈ పార్టీ వెనుక దుబాయ్ కనెక్షన్లు ఉన్నాయని, డ్రగ్స్ వ్యాపార కోణం ఉందనే చర్చ జరుగుతోంది. అలాగే రాజకీయ ప్రముఖుల ఇన్వాల్వ్ మెంట్ ఉండటంతో కేసు దర్యాప్తులో చివరాఖరికి ఏం తేలబోతోంది అనేది సర్వత్రా ఆసక్తిగా మారింది.

## ఢిల్లీ వెళ్లలేదా? (మొదటి పేజీ తరువాయి)

ఎంఎల్ఎ కె.టి.రామారావు కాంగ్రెస్ నాయకుల ఢిల్లీ పర్యటనను ప్రస్తావించారు. ఇందుకు మంత్రి శ్రీధర్‌బాబు పైవిధంగా స్పందించారు. కాంగ్రెస్ జాతీయ పార్టీ అని ఢిల్లీ నుంచే రాజకీయం ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. కెటిఆర్ ఎవరో రాసిన స్క్రిప్ట్‌ను ఇక్కడ చదివి వినిపిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రయోజనాల గురించి ఢిల్లీకి వెళ్లకుండా జిద్దు రాజకీయం చేయాలా? రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసం తాము ఒక మెట్టు దిగైనా ప్రయత్నిస్తామని, కేంద్రం సహకరిస్తుందా? నిధులను మంజూరు చేస్తుందా? లేదా అనేది వారిష్టం అని అన్నారు. తమది ఫ్లాప్ అయిన సినిమా కాదని, 2023 శాసనసభ ఎన్నికలు, ఆ తర్వాత జరిగిన లోక్‌సభ, అనంతరం సర్పంచ్, మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ ఫ్లాప్ అయిందని మంత్రి ఎద్దేవా చేశారు. ఇకనైనా వాస్తవాలు మాట్లాడితే వచ్చే ఎంపిటిసి, జెడ్‌పిసిటి ఎన్నికల్లోనైనా కనీసం ఫ్లాప్ నుంచి తప్పించుకుని, కాస్త మెరుగుపడే అవకాశం ఉంటుందని శ్రీధర్‌బాబు సూచించారు.

**తెలంగాణ సొమ్ముతో ఢిల్లీ పర్యటనలా? : కెటిఆర్**

అంతకుముందు బిఆర్ఎస్ ఎంఎల్ఎ కెటిఆర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సొమ్ముతో మంత్రులు ఢిల్లీ పర్యటనలు చేస్తున్నారని, తెలంగాణ జనం సొమ్ముతో ఇతర రాష్ట్రాల్లో ఎన్నికల ప్రచారాలు నిర్వహిస్తున్నారని, ఢిల్లీలో మంత్రివర్గ సమావేశాన్ని నిర్వహించారని కెటిఆర్ ఆరోపించారు. జరగనివి జరిగినట్టు, చేయనవి చేసినట్టుగా అంతా కనికట్టు చేస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఫ్లాప్ అయిన సినిమా అని కెటిఆర్ ఎద్దేవా చేశారు.

## డ్రగ్స్ పరీక్షకు సిఎం సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

సవాల్ విసిరారు. శాసనమండలి సమావేశాలు మంగళవారం చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అధ్యక్షతన ప్రారంభమయ్యాయి. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ చేసిన ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని మహేష్ కుమార్ గౌడ్ ప్రవేశపెట్టారు. తీర్మానంపై చర్చ సందర్భంగా అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బిఆర్ఎస్, బిజెపి సభ్యుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. చర్చను బి.మహేశ్ కుమార్ గౌడ్ ప్రారంభిస్తూ డ్రగ్స్ అంశంపై చేసిన వ్యాఖ్యలు సభలో తీవ్ర దుమారం రేపాయి. మాజీ సిఎం కెసిఆర్ పేరును ప్రస్తావిస్తూ మహేశ్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలపై చైర్మన్ అభ్యంతరం వ్యక్తం చేశారు. సభలో లేని వ్యక్తుల పేర్లు ప్రస్తావించవద్దని సూచించడంతో మహేశ్ కుమార్ గౌడ్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకున్నారు. అనంతరం కాంగ్రెస్ ఎంఎల్‌సిలు అద్దంకి దయాకర్, డాక్టర్ బల్మూర్ వెంకట్ తీర్మానాన్ని బలపరుస్తూ ప్రభుత్వ కార్యక్రమాలను వివరించారు. అద్దంకి దయాకర్ మాట్లాడుతూ రూ.2 లక్షల రుణమాఫీని ఏక కాలంలో పూర్తి చేశామని, సన్న వరి ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందిస్తున్నామని తెలిపారు. రైతు భరోసా కింద ఇప్పటికే రూ.19వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ బలోపేతానికి రూ.1000 కోట్లు కేటాయించామని, ప్రతి నియోజకవర్గంలో సమీకృత గురుకులాల నిర్మాణం చేపడుతున్నామని వివరించారు. బల్మూరి వెంకట్ మాట్లాడుతూ పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని, వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుల పునరుద్ధరణతో పాటు బాసర నుండి భద్రాచలం వరకు టెంపుల్ టూరిజం సర్క్యూట్‌ను అభివృద్ధి చేస్తామని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కాంగ్రెస్ 5 గ్యారంటీలను అమలు చేస్తున్నప్పటికీ ప్రతిపక్షాలకు కనిపించకపోవడం విచారకరమన్నారు. బిఆర్ఎస్ పక్ష నాయకులు సి.మధుసూదనాచారి, బిజెపి సభ్యులు ఎ.వి.ఎన్. రెడ్డి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఇస్తామన్న రూ.2500 నగదు ఎందుకు ఇవ్వడం లేదని, ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత ఏమైందని మధుసూదనాచారి ప్రశ్నించారు. విత్తనాలు, ఎరువుల సరఫరాలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూల్చివేయడం అన్యాయమని, దీనిపై స్పష్టమైన విధానం ఉండాలని బిజెపి సభ్యులు ఎ.వి.ఎన్.రెడ్డి డిమాండ్ చేశారు. పెన్షన్ బకాయిల విడుదల, డిఎస్‌సి ప్రక్రియ వేగవంతం, జాతీయ విద్యా విధానం2020 అమలుపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

## సస్పెన్షన్ ఎత్తివేత

(మొదటి పేజీ తరువాయి)

కిరణ్ రిజిజు అన్నారు. దీనికి అధికార, ప్రతిపక్ష బెంచీలు రెండూ అంగీకరించాయి. సభ లోపల లేదా పార్లమెంట్ ప్రాంగణంలో ఎలాంటి ప్లకార్డులు, పోస్టర్లు, ఫోటోలు లేదా ఎఐ రూపొందించిన చిత్రాలను ప్రదర్శించకుండా చూసుకోవాల్సిన అవసరం ఉందని స్పీకర్ బిర్లా అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన అమెరికా పార్లమెంటులో కార్యకలాపాలు సజావుగా సాగాలని, ప్రతిఒక్కరూ సహకరించాలని అందరూ భావిస్తున్నారని బిర్లా అన్నారు. అనంతరం ఏడుగురు కాంగ్రెస్ ఎంపిలు, ఒక సిపిఐ(ఎం) సభ్యుడి సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని కోరుతూ రిజిజు ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టగా, అది మూజువాణి ఓటుతో ఆమోదం పొందింది. సస్పెండ్ అయిన ఎంపిలలో కాంగ్రెస్‌కు చెందిన గుర్జీత్ సింగ్ ఔజ్లా, హిబి ఈడెన్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, అమరీందర్ సింగ్ రాజా వారింగ్, మణికం టాగోర్, ప్రశాంత్ పడోలే, డీన్ కురియాకో సిపిఐ(ఎం)కి చెందిన ఎస్. వెంకటేశన్ ఉన్నారు. సస్పెన్షన్ ఎత్తివేయడానికి ముందు సురేష్ వాదన తర్వాత, సమాజ్‌వాదీ పార్టీ సభ్యుడు ధర్మేంద్ర యాదవ్ ఈ చర్యను సమర్థిస్తూ, పార్లమెంటు అత్యున్నత ప్రమాణాలను కాపాడటంలో తమ పార్టీ సహకరించడానికి సిద్ధంగా ఉందని అన్నారు. 'సభ గౌరవానికి భంగం కలిగించే ఏ పనీ మేము చేయబోమని సభకు హామీ ఇస్తున్నాను. అయితే, అధికార కూటమి సభ్యులు కూడా సరిగ్గా ప్రవర్తించాలి' అని యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన బిజెపికి చెందిన నిషికాంత్ దుబే పేరును ప్రస్తావిస్తూ, 'తనను తాను సరిదిద్దుకోవాలి' అని కోరారు. తన 17 ఏళ్ల పార్లమెంటరీ ప్రస్థానంలో సభ గౌరవాన్ని దిగజార్చే పని ఏదీ తాను చేయలేదని చెబుతూ, దుబే వెంటనే యాదవ్ వ్యాఖ్యలను ఖండించారు. సమాజ్‌వాదీ పార్టీ ఎంపి చేసిన వ్యాఖ్యలకుగాను, ఆయన క్షమాపణ చెప్పాలని కూడా దుబే డిమాండ్ చేశారు. సభ సజావుగా సాగేలా చూసేందుకు అధికార, ప్రతిపక్ష సభ్యులు ఇరువురూ కృషి చేయాలని ఎన్‌సిపి నాయకురాలు సుప్రియా సూలే అన్నారు. 'ఎవరూ ఎవరిపైనా వ్యక్తిగత వ్యాఖ్యలు చేయకూడదు. మేము (ప్రతిపక్షం) అధికార పక్షాన్ని గౌరవించాలి. అలాగే అధికార పక్షం కూడా ప్రతిపక్షాన్ని గౌరవించాలి. ఇరుపక్షాల మధ్య ఒక 'లక్ష్మణ రేఖ' ఉండాలి. దానిని ఎవరూ దాటకూడదు' అని ఆమె పేర్కొన్నారు. సభ సజావుగా సాగాలని, ఇరుపక్షాలు సహకరించుకోవాలని జెడియు నాయకుడు, కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ అన్నారు. అధికార కూటమి సభ్యులు నిబంధనలను ఉల్లంఘించరని, గతంలోనూ తాము ఎప్పుడూ నిబంధనలను ఉల్లంఘించలేదని రిజిజు తెలిపారు. కాగా, సోమవారం నుండి ప్రతిపక్ష సభ్యులు ఎటువంటి ప్లకార్డులు లేదా బ్యానర్లను ప్రదర్శించలేదని, సభ సక్రమంగా పనిచేయడానికి సహకరించడానికి తాము సిద్ధంగా ఉన్నామని సురేష్ తెలిపారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com